ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam,Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool,Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 183 పేజీలు: 12 వెల: 8.00

ప్రజ్వల్ రేవణ్ణకు జీవితఖైదు 5లో

పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని మోడీ

# రైతును రాజును చేస్తా

## 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేసిన సిఎం చంద్రబాబు

రైతుల ఖాతాలకు తొలివిడతగా రూ.7వేలు జమ

46,85,838 మంది రైతులకు లబ్ధి

టెక్నాలజీ ద్వారా పంటలపై సూచనలు

వెలుగొండ ఫేజ్-1తో ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలు

సూపర్‌సిక్స్ అమలు సక్సెస్: సిఎం

**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఏ పంట వేస్తే లాభాలు వస్తాయన్నది అధ్యయనం చేసి వారికి సూచనలు జారీ చేస్తామని వెల్లడించారు. సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీ అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రకాశంజిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో ప్రారంభించారు. పచ్చని పొలాల్లో రైతుల మధ్య కూర్చునిఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. కర్షక సోదరులతో కలిసి పథకాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46,85,838 మంది రైతులఖాతాల్లో రూ.7వేలు జమ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో కాసేపుముచ్చటించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసం ఎంత మేర ఉందో చూడాలని సీఎం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రకటన మేరకు రైతులకు ఏటా రూ.20,000 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చామన్నారు. ఈ పథకం ద్వారా 3విడతల్లో రైతులకు ఈ పథకాన్ని వర్తింపచేస్తామని సీఎం స్పష్టం చేశారు. **రైతుల కళ్లల్లో ఆనందం చూశా:** అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇలా పచ్చని పొలాలు, దేశానికి అన్నం పెట్టే రైతుల మధ్య ప్రారంభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. రైతు కళ్లల్లో ఆనందాన్ని నేరుగా చూస్తున్నాను. రైతు ఎప్పటికి రాజే. కరోనా వంటి విపత్తులోనూ అన్నదాత నాగలి చేత పట్టి పొలంలో పనిచేశాడు. ఎన్ని కష్టాలున్నా రైతులు బాగుండాలనేది నా కోరిక. ఎన్నికలకు ముందు విధ్వంస, >>2



శనివారం తూర్పు వీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు రామనారాయణరెడ్డి, అచ్చెన్నాయుడు తదితరులు



# '3'కు చేరువలో భారత్

## స్వదేశీ ఆయుధాలతో 'సిందూర్' సక్సెస్

భారత్ శత్రువులు భూగర్భంలో కూడా ఉండకూడదు

'ఉగ్ర'మద్దతుదారులే ఏడుస్తున్నారు: వారణాసిలో ప్రధాని మోడీ

**వారణాసి, ఆగస్టు 2:** ఆధునిక భారత దేశం శత్రుదేశాలకు కాలభైరవుడు అవుతాడని ప్రధాని మోడీఅన్నారు. తన స్వంత నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. భారత దేశ శత్రువులు భూగర్భంలో కూడా బ్రతికి ఉండరాదు అని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ గురించి ఆయన ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ వైఖరిని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పేర్కొన్న కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. తాజాగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ పరిణీతి షిండే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌ను ఎవరైనా తమాషా అని పిలుస్తారా అని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వల్ల విపక్ష నేతలకు కడుపు నొప్పి పుడుతోందన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశామన్న వాస్తవాన్ని కాంగ్రెస్ కానీ, దాని మిత్రులు జీర్ణించుకోలేకపోతున్నట్లు చెప్పారు. విశ్వనాథుడి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రతీకారం తీర్చుకున్నామన్నారు. కాశీలో ఉన్న మాస్టర్లను అడగాలనుకుం టున్నానని, భారత శక్తిపై మీరు గర్వంగా ఫీలవ్వడం లేదా అని ప్రధాని అన్నారు. భారత్‌లో తయారీ అయిన ఆయుధాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో తమ సత్తాను చాటినట్లు చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న చాలా వైమానిక స్థావరాలు ఇంకా ఐసీయూ స్థితిలోనే ఉన్నాయని, పాకిస్థాన్ బాధపడుతోందని, దాన్ని ఎవరైనా అర్థం చేసుకోగలరని, కానీ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు మాత్రం పాకిస్థాన్ బాధను చూడలేకపోతున్నారని ప్రధాని అన్నారు. >>2

# ఉచిత బస్సుపై రేపు ఉపసంఘం కీలక భేటీ

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించనన్నది,ఆ మేరకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కీలక ప్రకటన చేసింది,ఈ క్రమంలో ఉచిత బస్సు పథకంపై మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అనిత, సంధ్యారాణితో కూడిన మంత్రివర్గ ఉప సంఘం ఈ నెల 4న సమావేశం కానుంది. అదే విధంగా ఈ నెల 6న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ స్కీం గురించి నిర్ణయం తీసుకొని అధికారికంగా విధివిధానాలు ప్రకటించనున్నారు. ఈ పథకానికి స్త్రీశక్తి అనే పేరు పెట్టారంట్లూ ఓ టికెట్ విస్తతంగా ప్రచారంలోకి వచ్చింది,అయితే . అది డమ్మీ టికెట్ అని, పథకం పేరు ఇంకా ఖరారు కాలేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇదే సందర్భంలో మహిళలకు ఉచితబస్సు ప్రయాణంపై ఏపీఎస్‌ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. ఎక్కువ బస్సులు అందుబాటులో ఉండేలా చూడటం, అదనపు డ్రైవర్లను సమకూర్చుకోవడం, కండక్టర్లకు శిక్షణపై అధికారులు దృష్టిపెట్టారు. సంస్థలో 11,449 బస్సులు ఉండగా,అందులో పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ >>2



శనివారం రహదారి ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

# ఇథనాల్ సృష్టికర్తలు రైతులే

## దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టం వారితోనే..

నీరు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ల వ్యవస్థల వల్లే దేశపురోగతి: కేంద్రమంత్రి గడ్కరీ

రాష్ట్రంలో 27 రహదారులకు శంకుస్థాపన, రెండు ప్రాజెక్టులను ప్రారంభించిన కేంద్రమంత్రి

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ ప్రగతి నీరు,విద్యుత్తు, రవాణా,కమ్యూనికేషన్ వ్యవస్థలు కీలక పాత్రను వహిస్తాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఏపీ అభివృద్ధిలో నౌకాయాన శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.రాజధాని ప్రాంతంలోని ఓ సమావేశ ప్రాంగణంలో రాష్ట్రంలో రూ.5,233 కోట్లు విలువైన 27 జాతీయ రహదారులకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ,సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్థాపన చేసారు.రెండు ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేసారు. రాష్ట్రంలో 185 కి.మీ మేర రూ.2,381 కోట్ల విలువైన 27 ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగితే 87కి.మీ మేర రూ.2,852 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులు ఉన్నాయి, ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయశాఖ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్రమంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీజనార్ధన్ రెడ్డి. పాల్గొన్నారు.ఆయా ప్రాజెక్టులను ప్రారంభించిన తరువాత నితిన్ గడ్కరీ మాట్లాడుతూ షిపింగ్, పోర్టులు, రోడ్లు అభివృద్ధి చెందితే ఆ దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామన్నారు. కొద్ది కాలంలోనే జపాన్‌ను అధిగమించామన్నారు. ఒకటి,రెండు స్థానాల్లో అమెరికా చైనా ఉన్నాయి. మోడీ హయంలో మన రైతులు విద్యుత్తుతయారు చేస్తున్నారు. ఇథనాల్ వల్ల దేశంలోరూ.లక్షలకోట్లు ఆదా అవుతాయన్నారు.భవిష్యత్తులో >>2

# లిక్కర్ స్కాం: సిట్‌వద్ద కీలక విడియో

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేరారోపణను ఎదుర్కొంటున్న వారికి సంబంధించి సిట్‌కు ఓ వీడియో లభ్యమైనట్లు సమాచారం. ఈ కేసులో ఒక నిందితునిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి. డబ్బుల ఉంచిన స్థావరానికి సంబంధించి వెంకటేష్ నాయుడు ఫోన్ నుంచి వీడియోను రిట్రీవ్ చేశారు సిట్ అధికారులు. ఆ వీడియోలో మద్యం ముడుపుల లావాదేవిలు జరిగినట్లు చెప్పబడుతున్న ప్రదేశంలో నోట్ల కట్టలతో చెవిరెడ్డి పీఏ వెంకటేష్ నాయుడు సిట్‌కు అడ్డంగా దొరికిపోయాడు. వెంకటేష్ నాయుడు ఫోన్‌నుంచి రిట్రీవ్ చేసిన వీడియోలో డబ్బుల డెన్‌లో నోట్ల కట్టలు లెక్కించుకుంటూ ఉన్న వీడియో సంచలనం రేపుతోంది. ఈ కేసులో ఇప్పటికే >>2

## 15 సీట్లు రాకపోయి ఉంటే

# మోడీ ప్రధాని కాలేరు

ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** మూడోసారి ప్రధానిగా పాలన చేపట్టిన నరేంద్రమోడీ అతితక్కువ మెజార్టీతో పదవి చేపట్టారని, మరో 15 సీట్లు రాకపోయి ఉంటే ఆయన ప్రధాని అయ్యేవారు కాదని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తాను దేశానికి రాజు కావాలని అస్సలు అనుకోవడం లేదని, అలాంటి భావనకు తాను పూర్తి వ్యతిరేకినని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టగానే, ఇస్ దేశ్ కా రాజా కైసా హో, రాహుల్ గాంధీ జైసా హో అంటూ పలువురు సభికులు నినాదాలు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "లేదండి, నేను రాజును కాదు. రాజు కావాలని నాకు లేదు. నేను రాజుకు వ్యతిరేకిని. రాజు అనే భావనను కూడా నేను వ్యతిరేకిస్తాను" అని తేల్చి చెప్పారు. గతంలో రాజు అనే పదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ ప్రజల అభిప్రాయాన్ని,మనోభావాలను మోడీ ఆలకించడం లేదని ఆనాడు కాంగ్రెస్ అగ్రనేత ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలుచేశారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని ఆయన విరుచుకుపడ్డారు. 2024లోక్‌సభ >>2



# ఎన్డీయె కూటమిని విచ్ఛిన్నం చేయలేరు

## రహదారి వ్యవస్థ మరింత పటిష్టం: డిసిఎం పవన్

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంగాని,రాష్ట్రంగాని ప్రగతి పథంలో ముందుకు నడవాలంటే రవాణా వ్యవస్థ కీలకమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు,ఈ దిశలో కేంద్రంలోను,రాష్ట్రంలోను రహదారి వ్యవస్థను పటిష్టం చేసే దిశలో ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.కూటమిలో ఉన్న మూడు పార్టీల్లోని నేతలు, కార్యకర్తలకు చిన్నచిన్న పొరపచ్చాలు ఉన్నా.. మీ స్థాయిలోనే పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. మన కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి వైసీపీ నేతలు ఎంతో ప్రయత్నం చేస్తారని.. మనం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అభివృద్ధిలో వెనుకబడ్డ ఏపీ తిరిగి ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు. కనీసం 15 సంవత్సరాలు ఈ కూటమి చాలా బలంగా ఉండాలని ఉద్ఘాటించారు. తమ ఈ ప్రయత్నం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని నొక్కిచెప్పారు.శనివారం మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈరోజు రోడ్లు వేయడమే కాదని.. ఇది భారత భవిష్యత్తుకు బలమైన పునాది అని పవన్ కళ్యాణ్ అభివర్ణించారు. ఈ దేశ ప్రగతికి చిహ్నాలు రవాణా మార్గాలని నొక్కిచెప్పారు. గోల్డెన్ క్వార్డలేటర్ ద్వారా రహదారులు దేశ దశను దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహార్ వాజ్‌పాయ్ మార్చారని కొనియాడారు. భారతదేశం ఎదుగుదలకు అసలైన బలం మౌలిక వసతులని, దీనికి ప్రధాన కారణం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అని ఉద్ఘాటించారు. 2014లో దేశంలో జాతీయ రహదారులు 91 వేల కిలోమీటర్లు ఉండగా.. ఇప్పుడు లక్షా 40వేల కిలోమీటర్లకు చేరిందని చెప్పుకొచ్చారు. నిర్మాణ వేగం మూడు రెట్లు, బడ్జెట్ ఆరురెట్లు పెరిగిందని వివరించారు. అందుకే గడ్కరీని హైవే మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారని ప్రశంసించారు పవన్ కళ్యాణ్.

గత జగన్ ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం నుంచి సహకారం వచ్చినా సరైన విధంగా స్పందించలేదని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.550కోట్లు ఇస్తే ఏపీ ప్రభుత్వం రూ.50 కోట్లు ఇచ్చిరోడ్లు వేశామని వెల్లడించారు. రవాణా లేని ఏజెన్సీ ప్రాంతాలను రోడ్లతో కలుపుతున్నామని అక్కడ డోలీ మోతలు లేకుండా చేశామని తెలి పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.50 కోట్లు ఇవ్వడంతో >>2



# దేవాంశ్ కోసం సెలవు పెట్టా..

## కుమారుని స్కూలుకు హాజరైన మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మంత్రి నారా లోకేష్ దంపతులు తమ కుమారుడు దేవాంశ్ చదువుతున్న పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఆ సందర్భంగా తీసుకున్న సెల్ఫీ ఫొటోను ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ప్రజా జీవితంలో తీరిక లేకుండా ఉన్న సమయంలో.. ఇలాంటి క్షణాలు ప్రత్యేక అనుభూతిని ఇస్తాయి. దేవాంష్ నవ్వు, చెప్పే ముచ్చట్లు తండ్రిగా సంతోషాన్నిస్తాయి కుమారుడిని చూసి గర్వపడుతున్నా' అని పేర్కొన్నారు. కొన్ని అనుభూతులు మరువలేని,అవి జ్ఞాపకాల్లో పదిలంగా ఉంటాయన్నారు.ఆయన తన ఎక్స్ పోస్టులో భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాంష్‌తో కలిసి దిగిన స్వీయ ఛాయా చిత్రాన్ని(సెల్ఫీ)నిజతపరిచారు. రాష్ట్రంలోని పెట్టుబడుల ఆకర్షణతోపాటు రాష్ట్రంలో కీలక మంత్రిగా, అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రి కుమారుడిగా నిరంతరం అనేక సమావేశాలు, అధికార పర్యటనలతో నిత్యం తీరిక లేకుండా గడిపుతున్నారు లోకేష్. అయితే ఈసారి మాత్రం తన కొడుకుపాఠశాలలో జరిగే కార్యక్రమానికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు తీసుకున్నా..అంటూ >>2

# ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగానికి ప్రోత్సాహం

## పర్యాటకం అభివృద్ధికి చర్యలు: మంత్రి దుర్గేష్




**విజయవాడ.ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యాటక, ఆతిథ్యరంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఈవెంట్ మేనేజ్ మెంట్ రంగానికి ఏపీలోని కూటమి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ ఫెయిర్ మోంట్ ప్యాలెస్ లో ఆగస్టు 13 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈవెంట్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి కందులదుర్గేష్, రాష్ట్రపర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ >>2

# రాగులపాడు లిఫ్ట్ నుండి 10 పంపులతో ఎత్తిపోతలు



రాగులపాడు లిఫ్ట్ నుండి 10 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

## హంద్రీనీవా చరిత్రలో సరికొత్త రికార్డు

3,150 క్యూసెక్కుల మేర పారుతున్న కృష్ణా జలాలు

**ఉరవకొండ, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అసాధ్యం..సుసాధ్యమైంది. రాయలసీమ జిల్లాలకు వరప్రసాదిని అయిన హంద్రీనీవా కాలువ నీటి ఎత్తిపోతల్లో సరికొత్త రికార్డు శనివారం ఆవిష్కృతమైంది. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామం వద్దగల 8వలిఫ్ట్ నుండి 10పంపులతో కృష్ణా >>2

# రైతును రాజును చేస్తా

>> సైకో పాలనతో అందర్నీ ఇబ్బంది పెట్టి వారు ఆనందపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్‌సిక్స్ అమలు నాకు మాటల్లో చెప్పలేని సంతోషాన్నిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరింది. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5వేలు చొప్పున జమ చేశాం. దీని కోసం



శనివారం సిఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందచేస్తున్న దృశ్యం

రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాము. మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2వేలు చొప్పున రూ.832 కోట్లు ఇస్తోంది. మొదటి విడతలో కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7వేలు జమ చేశాం. ఈ విడతలో రైతులకు రూ.3,175 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది అని సీఎం తెలిపారు.

**సందేహాల నివృత్తికి పోర్టల్, టోల్ ఫ్రీ నెంబరు:** పథకం అమలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఫిర్యాదులు, సందేహాలు ఉన్నా అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని ఆర్ఎస్‌కే లాగిన్ ద్వారా తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. అలాగే 155251 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రకాశం జిల్లాకు రూ.186 కోట్లు ఇస్తున్నాం. జిల్లాలోని 2,65,317 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతోంది. అలాగే దర్శి నియోజకవర్గంలో 42,786 మంది రైతులకు రూ.29 కోట్లు ఇస్తున్నాం. దర్శి మండలంలో 10,972 మంది రైతులకు రూ.7.36 కోట్లు ఇస్తున్నాం. ఒక్క వీరాయపాలెంలోనే 476 మంది రైతులకు రూ.31,00,000 లక్షలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

**సూపర్‌సిక్స్ అమలు సంతోషాన్నిస్తోంది:** రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాం. ప్రజలు బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసింది. చాలా సమస్యలు వచ్చాయి. ఎన్ని కష్టాలున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూపర్‌సిక్స్ అమలు చేస్తున్నాం. నేను హామీ ఇచ్చినట్టే పెంచిన రూ.4000 పింఛన్ గత ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చాను. పింఛన్ల కోసం ఏడాదికి 64 లక్షల మందికి రూ.32,134 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.1000 మాత్రమే పెంచింది. భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ ఎగ్గొట్టారు. ఎవరైనా లబ్ధిదారులు రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా మూడు నెలల మొత్తాన్ని ఒకే సారి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**15వ తేదీ నుంచి ఉచిత బస్సు:** తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికి రూ.15వేలు ఇచ్చాం. గత ప్రభుత్వం అందరికి ఇస్తామని ఎన్నికల్లో చెప్పి తీరా గెలిచాక మాట మార్చి ఒక్కరికే పరిమితం చేశారు. దీపం పథకం కింద ఆడ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపాను. దీపం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇందుకోసం రూ.2,700 కోట్లు వెచ్చిస్తున్నాం. ఈనెల ఆగస్టు 15న స్త్రీ శక్తి కింద ఆడ బిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. దీని వల్ల రాష్ట్రంలో 2 కోట్ల 60 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది. మీ పెద్దలు ఇచ్చిన ఆస్తి కంటే నేను నెలవారీ చేసే సాయమే ఎక్కువ. ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు పెట్టి రూ.5కే భోజనం పెడుతుంటే గత ప్రభుత్వం క్యాంటీన్లను మూసేసిందని సీఎం చంద్రబాబు అన్నారు.

**రిజర్వాయర్లు కళకళ :** ముందు చూపుతో అన్ని రిజర్వాయర్లకు నీరు వదలడంతో 700 టీఎంసీలతో రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, కాటన్ బ్యారేజ్, ప్రకాశం బ్యారేజ్, సోమశిలలో సమృద్ధిగా నీరు ఉంది. ఎవరికి తాగు, సాగు నీటి కొరత లేకుండా నదుల అనుసంధానం చేస్తాం. భూగర్భ జలాల పెంపుపై ప్రజలు కూడా దృష్టి సారించాలని కోరుతున్నాను. 2014-19 మధ్య కాలంలో సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేయగా గత ప్రభుత్వం రూ.12 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. గత పాలకులు ఉచిత భీమా పథకాన్ని నాశనం చేస్తే కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ మేం దాన్ని పునరుద్ధరించాం. వైసీపీ హయాంలో రూ.1,670 కోట్ల ధాన్యం డబ్బులను రైతులకు ఎగ్గొట్టారు. కూటమి వచ్చాకే ఆ బకాయిలన్నీ చెల్లించాం. గుండ్లకమ్మ గేట్లకు మేం మరమ్మత్తులు చేసి ప్రాజెక్టును సంరక్షించాం. వెలిగొండను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వచ్చే సీజన్‌కి ఫేజ్ వన్ పూర్తి చేసి కృష్ణా జలాలు వెలిగొండ ద్వారా ప్రకాశం జిల్లాకు తీసుకువస్తాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.



శనివారం డ్రైఫ్లవర్స్‌తో రూపొందించిన శ్రీవారిచిత్రపటాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దంపతులకు అందజేస్తున్న టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి

# దేశం సంక్షేమంతో అభివృద్ధి చెందాలి

## పేదల జీవితాలు మెరుగుపడాలని వేడుకున్నా

### తిరుమలలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

**తిరుమల,ఆగస్టు 2ప్రభాతవార్తప్రతినిధి:** దేశం సుసంన్నంగా ఉండాలని, దేశ ప్రజల సంక్షేమం కోసం పేదల జీవితాలు మెరుగుపడాలని శ్రీవేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా జాతీయరహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు. శనివారం ఉదయం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ కుటుంబంతో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. మహాద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన గడ్కరీ ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రం బహుకరించారు. స్వామివారి దర్శనంతో మనసు సంతోషం కలిగిందన్నారు. కేంద్రమంత్రి వెంట టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## సింగపూర్ నుంచి మలేసియా చేరుకున్న మంత్రి నారాయణ

### కౌలాలంపూర్‌లో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబుతో కలిసి పర్యటన

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి నిర్మాణానికి సంబంధించి మలేషియా లో ఉన్న ఉత్తమ పద్ధతులను మంత్రి.అధ్యయనం చేస్తారు,.ఆయా అంశాలపై అక్కడి ఆర్కిటెక్స్, సాంకేతిక నిపుణులతో ప్రభుత్వ బాధ్యులతో చర్చిస్తారు.ఉదయం కౌలాలంపూర్ అధికారులతో కలిసి వరద నివారణ చర్యలు,అర్బన్ డెవలప్మెంట్ ,ఐకానిక్ స్కై స్క్రాపర్,పెట్రోనాస్ ట్విన్ టవర్స్,పిరమిడ్ మాల్ ,కన్వెన్షన్ సెంటర్లు,ను మంత్రి.అధ్యయనం చేయనున్నారు. మధ్యాహ్నం మలేషియా పరిపాలన రాజధాని పుత్రజయ నిర్మాణంపై మంత్రి నారాయణ అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే ఆయన ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆయన అక్కడి అధికారుల నుంచి తెలుసు కున్నారు. పుత్రజయలో ప్రభుత్వ పాలన భవనాల నిర్మాణాలు,మౌలికవసతులు,టెక్నాలజీ పార్కులను మంత్రి నారాయణ. పరిశీలిస్తారు. వీటితో పాటు నగరనిర్మాణం,అక్కడి కట్టడాలు, డ్రైనేజీ వ్యవస్థ,గ్రీనరీ ఇతరంశాలపై తెలుసుకుంటారు.

# దేవాంశ్ కోసం సెలవు పెట్టా..

>> చేసిన ట్వీట్ అందరిని ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ లో అత్యంత బిజీ నేతల్లో ఒకరైన ఐటీ, హెచ్ఆర్డీ మంత్రి నారా లోకేష్, శనివారం తన కొడుకు దేవాన్ష్ స్కూల్‌లో జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కి హాజరయ్యారు. సాధారణంగా రాష్ట్రంలోని పెట్టుబడుల ఆకర్షణతోపాటు రాష్ట్రంలో కీలక మంత్రిగా, అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రి కుమారుడిగా నిరంతరం అనేక సమావేశాలు, అధికార పర్యటనలతో నిత్యం తీరిక లేకుండా గడుపుతున్నారు లోకేష్. అయితే ఈసారి మాత్రం తన కొడుకు పాఠశాలలో జరిగే కార్యక్రమానికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు తీసుకున్నా అంటూ చేసిన ట్వీట్ అందరిని ఆకట్టుకుంది.

# ఇథనాల్ సృష్టికర్తలు రైతులే

>> విమానాలు కుడా రైతులు తయారు చేసే ఇంధనంతో నడుస్తాయన్నారు.ఇథనాల్,మిథనాల్, సీఎన్‌జీ,బయో డిజిల్ వినియోగం పెరుగుతుందన్నారు.ఈవీ వాహనాల తయారీ శరవేగంగా పెరుగుతుందన్నారు., లిథియం బ్యాటరీలు ఖర్చు క్రమంగా తగ్గుతుందన్నారు,వందశాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలు రావాలన్నారు,.కాలుష్య రహిత దేశమే మన లక్ష్యం కావాలన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.లక్షల కోట్లుతో పనులు ప్రారంభిస్తామన్నారు.నాగ్‌పూర్, జబల్‌పూర్‌లో వరిగడ్డి వినియోగించి రోడ్లు వేసామన్నారు.ఏపీ అన్ని రంగాల్లో వేగంగా దూసుకుని పోతుంది,మంచి నాయకుడు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.చంద్రబాబు గురించి వినేవాళ్ళమన్నారు.ఆయన లాంటి విజన్ ఉన్న నాయకులు అరుదుగా ఉంటారన్నారు. మన దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 12శాతంగా ఉందన్నారు.అది 22 శాతానికి పెరగాలన్నదే తమ లక్ష్యం అని గడ్కరీ అన్నారు,మన రైతులు కేవలం అన్నదాతలు మాత్రమే కాదు. ఇంధన దాతలు కూడా. రాష్ట్ర పర్యటనలో భారీ ప్రాజెక్టులను మంజూరు చేస్తూ ప్రకటన చేసిన కేంద్ర మంత్రి గడ్కరీ హైదరాబాద్ విజయవాడరోడ్డు 6 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.6700కోట్లు విజయవాడ మచిలీపట్నం రోడ్డు 6 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2600 కోట్ల వినుకొండ గుంటూరు రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2605 కోట్లుగుంటూరు నిజాంపట్నం రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2000 కోట్లుబుగ్గకయిప గిద్దలూరు రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.4,200 కోట్లు ఆకివీడు దిగమర్రు రోడ్డు 4 లేన్లు చేస్తారు. రూ.2500 కోట్లు పెడన లక్ష్మీపురం రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.4,200 కోట్లు ముద్దనూరు కడప రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.1182 కోట్లు ఇవి కాకుండా హైదరాబాద్ విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా మంజూరు చేశారు.ఏడాదిలో మరో లక్ష కోట్ల రూపాయాల హైవే ప్రాజెక్టుల మంజూరుకు వేదిక నుంచే గడ్కరీ అంగీకారం తెలిపారు. దీనిపై సంతోషాన్ని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు...గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు

**అభివృద్ధికి నాగరీకతకు రహదారులు చిహ్నం: సీఎం చంద్రబాబు**

అభివృద్ధి, నాగరికతకు రహదారులు చిహ్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. పోలవరానికి కేంద్రమంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ అండదండలు ఎప్పటికీ మరిచిపోలేమని నొక్కిచెప్పారు. గడ్కరీ అంకితభావం, చిత్తశుద్ధి చాలా గొప్పవని కొనియాడారు. గడ్కరీ చొరవతో రోజుకు 37 కిలోమీటర్ల హైవేల నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు.ప్రధాని నరేంద్రమోదీ దూరదృష్టితో రోడ్లకు రూపం ఇస్తే దాన్ని గడ్కరీ ముందుకు తీసుకువెళ్తున్నారు. ఇప్పుడు ఆరు ప్రాజెక్టులు నితిన్ గడ్కరీ అనౌన్స్ చేశారు. భవిష్యత్తులో రోజుకు 50 కిలో మీటర్లు రహదారులు మీ ఆధ్వర్యంలో నిర్మాణం అవుతాయి. నెల్లూరు నుంచి తిరుపతికి గతంలో 10 గంటలు పట్టేది. ఐదేళ్ల ఏపీలో రోడ్లు విధ్వంసం అయిపోయాయి. ఏపీలో 4300 కిమి ఉంటే 5 సంవత్సరాల్లో 8700 కిలోమీటర్లు పెంచే ప్రయత్నం గతంలో చేశాం. 11వేల కోట్లు 760 కిలోమీటర్లు ఒక్క ఏడాదిలో పూర్తిచేసాం.ఏపీలో ల్యాండ్ అక్విజేషన్ సమస్య లేదు... మీరు ఆదేశించండి యుద్ధ ప్రాతిపదికను పనులు పూర్తిచేస్తాం. రూ.15000 కోట్లతో 1000కిలోమీటర్లు ఈసంవత్సరం పూర్తిచేస్తాం. రవాణా ఖర్చులు మన దగ్గర తగ్గాలంటే లాజిస్టిక్ పెరగాలి... అంటే పోర్టులు, రోడ్లు బాగుండాలి. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ముందుదేశంలో వేగవంతంగా జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకొని, రాష్ట్రంలోనూ మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో అడవి తల్లి బాట పేరుతో సుందరమైన రోడ్లు వేస్తున్నాం. పీఎం జన్ మన్ పథకం, ఉపాధి హామీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం గ్రాంటు కలుపుకొని రూ.1005 కోట్లతో స్వాతంత్రం వచ్చిన తర్వాత రోడ్లు కూడా చూడని గిరి ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నాం. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ఎకో టూరిజం మీద దృష్టి నిలిపి గిరిజన ప్రాంత యువతకు ఉపాధికి దారులు చూపుతున్నామని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చెప్పారు. గత ప్రభుత్వం కూల్చివేతలతో పాలన మొదలుపెట్టి రహదారుల గుంతలు, విధ్వంసంమిగిలిస్తే, దాన్ని అధిగమించి కూటమి పాలన ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్రంలోని 29జాతీయ రహదారుల శంకుస్థాపనలు, పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో వేస్తున్న రోడ్లు కొత్త భవిష్యత్తుకు పునాది వేస్తాయి. అభివృద్ధిలో వెనుకబడిన గిరిపుత్రుల బతుకుల్లో కొత్త వెలుగులు తీసుకొస్తాయి. అడవి తల్లి బాట పథకానికి అడిగిన వెంటనే రూ.50 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటును విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నితిన్ గడ్కరీని ఏపీ సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు.

# సిట్‌వద్ద కీలక విడియో

>> వెంకటేష్ నాయుడును సిట్ అరెస్ట్ చేసింది. ఇప్పటివరకూ తనకు మద్యం వ్యాపారంతో సంబంధం లేదని వైసీపీ కీలకనేత చెవిరెడ్డి చెబుతున్నారు.అయితే. చెవిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన వెంకటేష్ నాయుడుకు చెందిన ప్రదేశంలో దొరకటంతో ఈ కేసు ఇప్పుడు మరింత రసవత్తరంగా మారింది.

**ఆ 11 కోట్లు బ్యాంకులో జమ :** మద్యం కుంభకోణం ద్వారా పట్టుబడిన రూ.11 కోట్లు బ్యాంకులో సిట్ అధికారులు డిపాజిట్ చేశారు. ఆ నోట్లను వీడియో తీయాలని, విడిగానే ఉంచాలని ఏసీబీ కోర్టులో రాజ్ కసిరెడ్డి తరపు న్యాయవాదులు పిటీషన్ వేశారు. అన్ని నోట్ల కట్టలను ఫొటోలు, వీడియో తీయించినట్లు కోర్టుకు సిట్ అధికారులు తెలిపారు. బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.11 కోట్లను విడిగానే భద్రపరచాలని సెట్‌కు ఆదేశాలు జారీ చేసింది ఏసీబీ కోర్టు. కోర్టు ఆదేశాల కాపీలను బ్యాంకు అధికారులకు కసిరెడ్డి తరపు న్యాయవాదులు అందజేశారు.లిక్కరు స్కాంలో నిందితులకు చెందినవిగా చెప్పబడిన ప్రదేశంలో ఇటీవల సిట్ అధికారులు రూ.11కోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటితో తమకు సంబంధంలేదని లిక్కర్ కేసులో నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఏపీ హైకోర్టు అఫిడవిట్ దాఖలు చేసారు. ఈ పరిణామాల నడుమ సోదాల్లో దొరికిన సోమ్మును బ్యాంకులో డిపాజిట్ చేయాలని విజయవాడ ఏసీబీ కోర్టు సిట్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను సిట్ అమలుచేసింది.

# 10 పంపులతో ఎత్తిపోతలు

>> జలాలను ఎత్తిపోస్తున్నారు. 10 పంపులను ఆన్ చేయడం ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువలో 3,150 క్యూసెక్కుల నీరు జీడిపల్లి వైపు పరుగులు తీస్తుండటంతో నిండుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హంద్రీనీవా ప్రధాన కాలువను 3,650 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని నిర్ణయించి పనులు ప్రారంభించి కేవలం 100 రోజుల్లో మొదటి దశ కాలువ వెడల్పు పనులు పూర్తి చేయడంతో అసాధ్యమనుకున్నది సుసాధ్యమైంది. కాగా ఉదయం దాదాపు గంటపాటు 10 పంపులతో ఎత్తిపోతలు కొనసాగింగిన అధికారులు ఆ తరువాత ఒక పంపును ఆఫ్‌చేసి 9 పంపులతో ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు. 2013 నుండి హంద్రీనీవా కాలువకు నీరు వస్తుండగా ప్రతి ఏడాది గరిష్టంగా 6 పంపులతో మాత్రమే నీటిని ఎత్తిపోసినట్లు తెలుస్తోంది. జూలై 17న కర్నూల్ జిల్లా మల్యాల వద్ద నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాలువకు నీటి విడుదల చేశారు. ఈ క్రమంలోనే 22వ తేదీ నుండి రాగులపాడు లిఫ్ట్ నుండినీటి ఎత్తిపోతలు ప్రారంభంకాగా అతితక్కువ సమయంలోనే 1.68 టీఎంసీల నీటి సామర్థ్యంగల బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి జలాశయం నిండటంతో అక్కడి నుండి నీటిని 11.100 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంగల పీఏబీఆర్ జలాశయం విడుదల చేస్తున్నారు.

# ఈవెంట్ మేనేజ్ మెంట్ రంగానికి ప్రోత్సాహం

>> లో పలువురు ఈవెంట్ మేనేజర్లతో వారు చర్చించారు. స్వర్ణాంధ్ర టూరిజం విజన్ 2029ను, ఏపీలో పర్యాటక వృద్ధికి గల అవకాశాలను కూలంకషంగా వివరించారు. ఈ రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల పెంచడానికి కృషి చేస్తోందని తెలిపారు. సరికొత్త ఆలోచనలతో, సృజనాత్మకతతో కూడిన కార్యక్రమాల ద్వారా పర్యాటకులను ఆకర్షించాలని నిర్ణయించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని ఇన్వెస్టర్లకు చెబుతూ నూతన పర్యాటక పాలసీ విధివిధానాలు, రాష్ట్ర వనరుల గురించి, పర్యాటకాభివృద్ధిలో ఈవెంట్ మేనేజ్ మెంట్ భాగస్వామ్య ఆవశ్యకతను వివరించారు. ఏపీ పర్యాటకంలో పెట్టుబడులు పెడితే భరోసా కల్పించే బాధ్యత మాదని ఈ సందర్భంగా ఇన్వెస్టర్లకు వారు వివరించారు. ప్రస్తుతం ఏ రంగంలోనైనా ఎలాంటి కార్యక్రమం చేపట్టాలన్నా ఈవెంట్ మేనేజ్ మెంట్ పరిశ్రమ భాగస్వామ్యం తప్పనిసరి అని మంత్రి దుర్గేష్ అన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో ప్రకృతి సౌందర్యంతో పాటు ఈవెంట్ మేనేజ్మెంట్ ల ఏర్పాటు అవసరాన్ని వివరించారు. మారుతున్నప్రపంచంలో ఈవెంట్ మేనేజ్ మెంట్ కి ప్రాముఖ్యత సంతరించుకుందని, ప్రజల్లో పెరుగుతున్న పర్యాటక ఆసక్తిని, ఇంట్లో జరిగే శుభకార్యాలు మొదలుకొని సినిమా ఫంక్షన్ల వరకు చేస్తున్న ఈవెంట్లను, ఈవెంట్ మేనేజ్ మెంట్ కు పెరిగిన ఆదరణ, ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యులను చేయాలని భావిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఏపీ టూరిజం అథారిటీ 21 ఈవెంట్ మేనేజ్ మెంట్ ఏజెన్సీలను 2 కేటగిరీల క్రింద ఎంప్యానెల్ మెంట్ చేసిందన్నారు. కేటగిరి ఏలో మెగా, జిల్లా స్థాయి ఈవెంట్స్, కేటగిరి బీలో జిల్లా స్థాయి ఈవెంట్స్ ఉంటాయన్నారు.110కి పైగా టూరిజం ఆపరేటర్లను ఎంప్యానెల్ చేసిన విషయం వెల్లడించారు.ఈ నేపథ్యంలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కన్వెన్షన్స్, ఎగ్జిబిషన్స్(ఎంఐసీఈ), వైజాగ్ బీచ్, కాకినాడ, అమరావతిలలో మ్యూజిక్ మరియు ఎంటర్ టైన్ మెంట్ ఈవెంట్స్,లేపాక్షి, తిరుపతి, అమరావతిలో పండుగలు, ఫెయిర్స్, విజయవాడ, తిరుపతిలో స్పోర్ట్స్ ఈవెంట్స్, కూచిపూడి గ్రామం,అమరావతి, వైజాగ్ లో ఆర్ట్ అండ్ కల్చరల్ ఈవెంట్స్, దిండి, అరకు వ్యాలీ, హార్సిలీ హిల్స్ లో డెస్టినేషన్ వెడ్డింగ్స్, తిరుపతి, అమరావతిలో ఎడ్యుకేషనల్ ఈవెంట్స్ నిర్వహించి తద్వారా పర్యాటకులను ఆకర్షించాలని భావిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 8 మెగా ఈవెంట్స్, 15 జిల్లా ఈవెంట్స్ నిర్వహించేందుకు ఈవెంట్ క్యాలెండర్ ను సిద్ధం చేశామన్నారు. గడిచిన 6 నెలల్లో ఏపీ ప్రభుత్వం 85కి పైగా ప్రఖ్యాత హోటల్లు, ఎంఐసీఈలతో ఎంవోయూలు కుదుర్చుకుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. అంతేగాక 10,655 కోట్ల పెట్టుబడులు రాబట్టామన్నారు. తద్వారా 8163 గదులు ఏర్పాటు అవుతాయని, 7 ఎంఐసీఈ కన్వెన్షన్ సెంటర్ లు నెలకొల్పబడుతాయన్నారు. వీటి ద్వారా రాబోయే నాలుగేళ్లలో 22325 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కలగనుందన్నారు.

# ఉచిత బస్సుపై రేపు ఉపసంఘం కీలకభేటీ

>> ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు అన్నీ కలిపి 8,548 (74 శాతం) ఉన్నాయి. పథకం అమలులో ఇవే కీలకం కానున్నాయి. సాధారణంగా ప్రతి డిపోలో కొన్ని బస్సులు స్పేర్ కింద పక్కన పెట్టేవి కూడా ఆగస్టు 15 నుంచి ఈ బస్సులనూ రోడ్డెక్కించనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ 371 స్కూల్ బస్సులు నడుపుతోంది. ఇవి ఆయా నగరాలు, పట్టణాలకు సమీపంలోని గ్రామాలకు ఉదయం వెళ్లి విద్యార్థులను బడులకు తీసుకొస్తాయి. మళ్లీ సాయంత్రం బడుల నుంచి ఊళ్లకు తీసుకెళ్తాయి. మిగిలిన సమయమంతా డిపోలోనే ఉంటాయి. ఇకపై మిగిలిన సమయంలో ఈ బస్సులను కూడా ఇతర రూట్లలో నడపనున్నారు.

**ప్రయాణికులతో సహనంగా వ్యవహరించండి:** పథకం మొదలయ్యాక తొలి మూడు నెలలు అధిక రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎక్కువ మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తారని, దీనివల్ల అన్ని బస్సుల్లో రద్దీ పెరగనుందని భావిస్తున్నారు. దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు అధికారులు తగిన సూచనలు చేస్తున్నారు. రద్దీ సమయంలో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేసినా సహనంగా వ్యవహరించాలని పేర్కొంటున్నారు.

**మహిళలకు వేరుగా టికెట్లు:** ఉచిత ప్రయాణం అమలు ఉన్న బస్సుల్లో మహిళలకు వేరుగా జీరో టికెట్లు ఇవ్వనున్నారు. మగవారికి సాధారణ టికెట్లు, మహిళలకు జీరో టికెట్లు ఇస్తారు. భర్త, భార్య ప్రయాణిస్తే భర్తకు ఛార్జీ ఉండే టికెట్, భార్యకు జీరో టికెట్ రెండూ వేర్వేరుగా జారీ చేస్తారు. జీరో టికెట్ల జారీపైకండక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత టిమ్స్‌లలో కొత్తగా ఉమెన్ ఫ్రీ టికెట్ అనే ఆప్షన్ తీసుకొస్తున్నారు.

# 15 సీట్లు రాకపోయి ఉంటే మోడీ ప్రధాని కాలేరు

>> ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందన్నారు. దాదాపు 70 నుంచి 100 లోక్‌సభ సీట్లలో రిగ్గింగ్ జరిగి ఉండొచ్చని, ఒకవేళ 15 సీట్లలోనే రిగ్గింగ్ జరిగి ఉంటే మోడీకి ప్రధానిగా అవకాశమే లభించేది కాదని రాహుల్ కామెంట్ చేశారు. చాలా స్వల్ప మెజారిటీతో ప్రధానమంత్రి కుర్చీపై నరేంద్ర మోడీకూర్చొని ఉన్నారనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంకొన్ని సీట్లు తక్కువగా వచ్చి ఉంటే ఆయన అక్కడ కూర్చోగలిగే వారే కాదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ రిగ్గింగ్ జరిగే అవకాశం ఉంటుందని రాబోయేకొన్ని రోజుల్లో తాము నిరూపించబోతున్నామని ఆయన వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న ఓటర్ల ఫొటోలు, పేర్లను తమ పార్టీ తనిఖీ చేయగా, మొత్తం 6.5 లక్షల ఓటర్లలోని 1.5 లక్షల మంది ఓటర్లు నకిలీలే అని తేలిందని రాహుల్ చెప్పారు. ఈ సమాచారాన్ని కాంగ్రెస్ విడుదల చేశాక ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు రావడాన్ని అందరూ చూస్తారని, అది ఆటం బాంబులా కుదిపేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆరోపించారు. ఇంతకుముందు తగిన సాక్ష్యాధారాలు లేక ఈ అంశంపై తాను మాట్లాడలేకపోయేవాడినని తెలిపారు.

# విచ్ఛిన్నం చేయలేరు

>> రూ.1000 కోట్లతో రోడ్లు వేయగలిగామని చెప్పుకొచ్చారు.అటవీ అనుమతులతోనే రోడ్లకు ప్రణాళికలు వేసి ముందుకు తీసుకెళ్తున్నామని ఉద్ఘాటించారు. గత జగన్ ప్రభుత్వాన్ని చూశామని.. కూల్చివేతలతో ఆ ప్రభుత్వం మొదలైందని కనీసం రోడ్లు కూడా వేయలేదని, రహదారులపై గుంతలు పూడ్చలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు రహదారులు, హైవేలు నిర్మిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# '3'కు చేరువలో భారత్

>> ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే వాళ్ల పాకిస్థాన్‌లోనూ, ఇండియాలోనూ ఏడుస్తున్నారని విమర్శించారు. మన సైనిక బలగాలను కాంగ్రెస్ నిత్యం అవమానిస్తోందని, ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పిలుస్తోందని మోదీ అన్నారు. కాంగ్రెస్ వ్యాఖ్యలను సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులను ఇప్పుడు ఎందుకు చంపారని సమాజ్‌వాదీ పార్టీ అడుగుతోందని, వాళ్లను పిలిచి.. చంపాలా వద్దా అని అడగాలా, లేదంటే వాళ్ల పారిపోయే వరకు వేచి చూడాలని అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ రుద్ర స్వరూపాన్ని ప్రపంచం తిలకించిందని, ఇప్పుడు నవ భారతం శత్రువులకు కాలభైరవుడిగా మారినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. పాకిస్తాన్ వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. బ్రహ్మోస్ మిస్సైళ్ల వల్ల పాకిస్తాన్‌కు నిద్ర పట్టడం లేదు.

ఈ క్రమంలో పాక్ మళ్లీ దాడులు చేయాలని చూస్తే, ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ మిసైళ్లతో ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేస్తామని మోదీ హెచ్చరించారు. లక్నోలో బ్రహ్మోస్ తయారీ యూనిట్ త్వరలో ప్రారంభం కానుంది. రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధిగా మారుతోందని, యూపీ డిఫెన్స్ కారిడార్‌లో పెద్ద పెద్ద కంపెనీలు పెట్టుబడి పెట్టడం ఇప్పటికే ప్రారంభించాయని ప్రధాని తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 03-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
నవమి ఉ.9.41
విశాఖ ఉ.6.34
వర్జ్యం ఉ.11.00-12.47
దు.సా.4.52-5.43
శుభసమయం:ఉ.10.00-11.00,సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థికపరిస్థితి సానుకూలంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి.

**వృషభం :** అనుకున్న అవకాశాలు శ్రమించడం వలన కలిసివస్తాయి. ఉద్యోగులకు హెూదాలు లభిస్తాయి.

**మిథునం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తిచేస్తారు. శుభకార్యాలకు హజరవుతారు.

**కర్కాటకం :** ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవహ రించండి. ఆర్థికపరిస్థితి మెరుగుపడతాయి.

**కన్య :** సన్నిహితులకు మీవంతు సహాయం అందిస్తారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** వివాహ, ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మకరం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుకుకుంటారు.

**కుంభం:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది.

**మీనం :** ఆరోగ్యసమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వరి నాట్లు వేసిన హోం మంత్రి అనిత



**గజపతినగరం (విజయనగరం జిల్లా), ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఆమె రాష్ట్రానికి మంత్రి. జిల్లాకు ఇన్చార్జి మంత్రి కూడా. అయినప్పటికీ తన హోదాను పక్కన పెట్టి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు స్వయంగా పొలంలోకి దిగారు. బురదలో అడుగులు వేస్తూ, స్వయంగా తన చేతితో వరి నాట్లు నాటారు. వ్యవసాయ కూలీలతో ఉబాల్లో పాలు పంచుకున్నారు. వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఆమే రాష్ట్ర హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత. గజపతినగరం మండలం బంగారమ్మ పేట వద్ద ఈ అరుదైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మోకాళ్ల వరకు కూరుకుపోయే దమ్ము మడిలో మంత్రి అనిత అతికష్టం మీద కూలీల చేయి పట్టుకొని అడుగుతీసి అడుగు వేస్తూ, వారి కష్టాలను తెలుసుకుంటూ స్వయంగా వరినాట్లను వేయడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఒక ఎకరం పొలంలో నాట్లు వేయడానికి ఎంత సమయం పడుతుంది, ఎంత మంది పని చేస్తారు, రోజుకు ఎంత కూలీ సంపాదిస్తారు తదితర విషయాలను మంత్రి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారురాజు, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే రైతాంగానికి మంచి రోజులు వచ్చాయని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ తొలి విడత నిధులు విడుదల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ, రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెడుతూ, సూపర్ సిక్స్‌లో భాగంగా ఈరోజు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌ను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. విత్తనం నాటిన దగ్గరనుంచి పంట కోసి ఇంటికి చేర్చేవరకు రైతుకు అన్ని విధాలా ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయకత్వంలో రైతన్నకు అన్నివిధాలా భరోసా అందుతోందని చెప్పారు. రైతులకు ఆధునిక పరికరాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే కాకుండా, డ్రోన్ల ద్వారా సాగుకు సహకారాన్ని ఇస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

## మచిలీపట్నం ఎంపి కార్యాలయం ఎదుట ధర్నా

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన మచిలీపట్టణం ఎంపీ బాలశౌరి కార్యాలయం వద్ద శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంపీ బాలశౌరి దగ్గర పీఏగా పనిచేస్తున్నగోపాల్ సింగ్ కలిసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశారంటూ .. బాధితులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలిప్పిస్తామంటూ .. తమ వద్ద కోటిన్నర రూపాయలు వరకూ వసూలు చేశారని ఆరోపించారు. 60 మంది వద్ద రెండు లక్షల రూపాయల చొప్పున వసూలు చేశారని బాధితులు తెలిపారు. ఎంపీ పీఏ గోపాల్‌సింగ్ గతంలో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అపాయింట్‌మెంట్ లెటర్ల గడువు ముగిశాయంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. విజయవాడలోని నోవాటెల్‌కు వస్తే మళ్లీ కొత్తగా అపాయింట్‌మెంట్ లెటర్లు ఇస్తానని నమ్మించారని వాపోయారు. దీంతో నిన్న నోవాటెల్ హోటల్‌కు బాధితులు వెళ్లగా, అక్కడకు గోపాల్ సింగ్ రాలేదని చెప్పడంతో బాధితులంతా ఆందోళన చేపట్టారు. తామంతా మోసపోయామని, తమకు న్యాయం చేయాలంటూ ఎంపీ బాలశౌరి కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఎంపీ కార్యాలయం వద్ద ఆందోళన చేయకూడదని పోలీసులు వారిని హెచ్చరించారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## పద్మావతిఅమ్మవారి సేవలో కేంద్రమంత్రి గడ్కరీ



**తిరుచానూరు,ఆగస్ట్ 2 ప్రభాతవార్త:** కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శనివారం ఉదయం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి ఇఒ శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం, అమ్మవారిఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంధ్రనాథ్ కేంద్రమంత్రికి స్వాగతం పలికారు . అనంతరం ఆలయంలోపల అమ్మవారి ధ్వజస్తంభానికి నమస్కరించారు. అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులుఅందుకున్నారు. ఆలయ అర్చకుడు బాబుస్వామి, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాధరెడ్డి ,గాలిపుష్పలత కేంద్రమంత్రి వెంట ఉన్నారు.

## వెంగమాంబ బృందావనానికి పుష్పాంజలి



**తిరుమల,ఆగస్ట్ 2, ప్రభాతవార్తప్రతినిధి:** మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతి పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందా వనానికి పుష్పాంజలి ఘటించారు. శనివారం వెంగమాంబ వంశస్థులు పాల్గొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వెంగమాంబ ప్రాజెక్టు అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

## గోవిందుని బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న తిరుమల !

**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమల కొండపై ఏడాదిలో తొమ్మిదిరోజులు పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలంటే భక్తులకు ఎనలేని ప్రీతి. దేశవిదేశాల నుండి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తొమ్మిది రోజులు 17వాహనాలపై మలయప్ప స్వామి భక్తులకు కనువిందుచేస్తారు. సెప్టెంబర్ 23 నుండి మొదలుకానున్న శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఆలయం పరిసరాలు , మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటు, తాగునీరు కల్పించేందుకు నీటికొళాయిలు మరమ్మతులు, మాఢవీధుల్లో స్వామివారి దశావతారాల ప్రతిమలతో స్వాగత ఆర్చిలు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భక్తులను ఆకటుకునేలా తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయి. తొమ్మిదిరోజులు జరిగే దేవదేవుని బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. ఇలవైకుంఠం నుంచి కలియుగ వైకుంఠానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించడం, దీంతో వైకుంఠంగానే తీర్చిదిద్దుతారు. వాహనసేవలు ఊరేగే మాఢవీధుల్లో భక్తుల సౌకర్యార్థం గ్యాలరీల పనులు చేపడుతున్నారు. దక్షిణమాఢవీధిలో వాహనసేవల సమయంలో ఇనుపకంచె దాటిరాకుండా ఉండేందుకు బలమైన గోడను నిర్మిస్తున్నారు. భక్తుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకున్నారు. అధునాతన సిసికెమెరాలు, లైటింగ్స్ అన్నీ మార్పుచేస్తున్నారు.


## శ్రీవారి దర్శనంతో ఆనందం: ప్రముఖులు



**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందం కలుగుతుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. తెలిపారు.తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు.

శనివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో మృదంగం విద్వాంసుడు యల్లా వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తానా వేముల సతీశ్, నటుడు ఆది ,తమన్‌లు కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుపతి ఎస్వీజూలో ఆత్మకూరు ఆడపులి మృతి



**తిరుపతి,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలో పిఏపురం సెక్షన్ బైర్లూట్‌రేంజ్‌లో గతనెలలో పట్టుబడి తిరుపతి ఎస్వీజూకు తరలించిన టి-132 ఆడపులి చికిత్స తీసుకుంటూ శనివారం ఉదయం మృతి చెందింది. ఆత్మకూరులో తీవ్రంగా గాయపడిన ఆడపులిని జూలై 7వతేదీ అటవీశాఖ అధికారులు తిరుపతి జూకు తరలించారు. ఎస్వీపశువైద్యకళాశాల సర్జరీ విభాగం ప్రొఫెసర్లు ఆధ్వర్యంలో ఓరల్ కేవిటీ ఫిస్తులా తిరిగి తెరచుకోవడంతో మళ్ళీ సర్జరీ చేశారు. గతనెల 16వతేదీనుండి గాయానికి మృదువైన పీట్లు లోపలి మెత్తనిపొరలు అదనపు సంరక్షణగా కుట్లునయం కావడానికి మెత్తని మాంసం ,గ్లూకోస్,ఎలక్ట్రోలైట్, యాంటీబయాటిక్స్ ఇవ్వడం జరిగింది. టి-132 ఆడపులి రెండు రోజులుగా ఆహారం తీసుకోకుండా నీటిపైనే ఆధారపడింది. శనివారం ఉదయం మృతి చెందింది. ఎస్వీపశువైద్యకళాశాల పాథాలజీ విభాగం ప్రొఫెసర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టమ్‌లో సెప్టీసీమియా షాక్‌తో మృతి చెందిందని తెలిపారు.. జంతుప్రదర్శనశాలలో ఖననం చేశారు.

## తెలుగు రాష్ట్రాల రైల్వే పిసిసిఎంగా ఇతి పాండే



**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 2,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే బాధ్యతలను చేపట్టారు. ఇతి పాండే 1995ఐఆర్‌టిఎస్ బ్యాచ్ అధికారిణి. ఆమె అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి మనస్తత్వ శాస్త్రంలో బంగారు పతక విజేత. దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆమె సెంట్రల్ రైల్వే భూసావల్ డివిజన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సెంట్రల్ రైల్వే ప్రధాన కార్యాలయంలో చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్)గా, సెంట్రల్, వెస్ట్రన్ రైల్వేలలో సరుకు రవాణా చీఫ్ కమర్షియల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్,డిసిఎం,ఏసిఎంతో సహా వివిధ పదవులలో సేవలను అందించారు. పాండేకు వాణిజ్య విభాగంలో నైపుణ్యంతో పాటు భద్రత, విజిలెన్స్ విభాగాలలో చేశారు. ఇతిపాండే భూసావల్ డిఆర్ఎంగా పనిచేస్తున్న సమయంలో మారుమూల ప్రాంతాలలోని రైల్వే కార్మికులు, వారి కుటుంబాలకు అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ అందించడానికి రుద్ర అనే హాస్పిటల్ ఆన్ వీల్స్ చొరవను ప్రవేశపెట్టారు. ఈ మొబైల్ క్లినిక్ ఆరోగ్య సంరక్షణను మారుస్తూ వారికి అత్యంత అవసరమైన వారికి నేరుగా సకాలంలో వైద్య సేవలను అందిస్తోంది. జనంల్ మేనేజర్స్ అవార్డు(రెండుసార్లు), రైల్వే మంత్రిత్వ శాఖ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ అండ్ మెరిటోరియస్ సర్వీసెస్ 2007, ఉమెన్ అచీవర్స్ అవార్డు 2016లను కైవసం చేసుకున్నారు. ఈఏడాది జూన్ 17న, రైల్వే మంత్రి రాజ్ బాషా రజత్ పదక్‌తో సత్కరించారు. ముంబైలో మొట్టమొదటి అన్‌రిజర్వ్డ్ టికెటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. క్లెయిమ్స్ ఆఫీసర్‌గా ఆమె ఎల్ఫిన్‌స్టోన్ రోడ్ తొక్కిసలాట బాధితులందరికి క్లెయిమ్‌లు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈ ఎపిసోడ్ రైల్వే పరిహారం రైల్వే చట్టం పరిధిలో లేకపోయినా న్యాయవాది ప్రమేయం లేకుండా పరిష్కారం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించారు. చీఫ్ కమర్షియల్ మేనేజర్(ఫ్రైట్)గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న సమయంలో పశ్చిమ రైల్వేపై సరుకు రవాణా కార్యకలాపాల సమగ్ర అవలోకనంపై 'రైడింగ్ ది ఫ్రైట్ ట్రైన్'అనే పుస్తకాన్ని రాశారు. బ్యూరోక్రాట్స్ వార్షిక జాబితా 2024లో 24మంది బ్యూరోక్రాట్ చేంజ్-మేకర్లలో ఆమె ఒకరుగా గుర్తింపు పొందారు. ఈ గౌరవం ఆమె దూరదృష్టి గల నాయకత్వాన్ని, ప్రయాణికుల సేవలు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడంలో అవిశ్రాంత కృషిని ప్రతిభింబిస్తుంది.

## పోలీస్ నియామక ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించిన రమ్య మాధురి



**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా) ఆగస్టు 2 ప్రభాతవార్త:** పోలీస్ నియామక ఫలితాల్లో విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన గొర్లి రమ్య మాధురి రాష్ట్రస్థాయిలో సెకండ్ టాపర్‌గా నిలిచి 159 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మహిళా విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. జనరల్ విభాగంలో సెకండ్ ర్యాంకు సాధించింది. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలని, పోలీస్ యూనిఫాం వేసుకోవాలని పట్టుదలతో చదివానని ఆమె తెలిపారు. తన ఆశయం నెరవేరడం పట్ల ఆమె హార్షం వ్యక్తం చేశారు. తండ్రి రమణ 2008 సంవత్సరంలో చనిపోవడంతో అప్పటినుండి తల్లి, అన్నయ్య గౌరీ శంకర్ తనను చదివించారని, తన తల్లి అదే గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తుందని రమ్య చెప్పారు. గడసాం హైస్కూల్లో 10వ తరగతి చదివి 9.3 పాయింట్లు మార్కులు సాధించి స్కూల్లో రెండవ స్థానం పొందానన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ విజయనగరంలో పూర్తి చేశానని, కాకినాడలో కోచింగ్ తీసుకుని కానిస్టేబుల్ పరీక్ష రాశానని ఆమె పేర్కొన్నారు. కాగా ఆమె కృషి, పట్టుదల పట్ల కుటుంబ సభ్యులు గ్రామస్తులు హార్షం వ్యక్తం చేశారు. రమ్య అద్వితీయ ప్రతిభ పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందిస్తూ అత్యుత్తమ ఫలితం సాధించడం ద్వారా రమ్య జిల్లాకే గర్వకారణం అయ్యారని ప్రశంసించారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**పెంచలకోన (రాపూరు, నెల్లూరు), ఆగస్టు 2, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేద పండితులు, వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.



రైతులకు ఆర్థిక సహాయం చెక్కులను అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## శ్రీకాళహస్తిలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ లాంఛనం

### ఇది రైతు ప్రభుత్వం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే ఆర్థిక సహాయం 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' కార్యక్రమాలను తిరుపతిజిల్లాలోని శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్,వ్యవసాయశాఖ శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సంబరాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డెప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఫోటోలకు పాలాభిషేకం జరిపారు.ఈ ప్రాంతంలో రైతులు పండించిన పండ్లతో పూజలు చేసారు.ఈ సందర్భంగా చెక్కులను పంపిణి చేసారు.ఇక్కడ రైతులు ఏర్పాటు చేసిన రక రకాల వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అధ్యక్షత వహించారు.

## తెలుగు జాతి ముద్దు బిడ్డ పింగళి వెంకయ్య: వైఎస్ జగన్

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు జాతి ముద్దు బిడ్డ పింగళి వెంకయ్య అని వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని ... వైఎస్.జగన్ నివాళులర్పించారు. జాతీయ జెండా రూపకర్త, తెలుగు జాతి ముద్దు బిడ్డ పింగళి వెంకయ్య గారు. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఆయన భారతదేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## మదనపల్లె-చెన్నైల మధ్య రైళ్లు నడపాలి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 2,ప్రభాతవార్త** రాయలసీమలోని ప్రఖ్యాత వాణిజ్య వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన మదనపల్లె నుంచి తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై మధ్య రైలు సర్వీసులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన మదనపల్లె టమోటా మార్కెట్ నుంచి టమోటా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి. అలాగే మామిడి తదితర వ్యవసాయ ఉత్పత్తులు ఇక్కడి నుండి చెన్నైలోని ప్రఖ్యాతిగాంచిన కోయంబెడు మార్కెట్, చెన్నైలోని పాండి బజార్,టి.నగర్ మార్కెట్‌కు అనేక వ్యవసాయ ఉత్పత్తులను తమ తమ అవసరాల నిమిత్తం ఈ ప్రాంత ప్రజలు ప్రస్తుతం రోడ్డు మార్గంలో మదనపల్లి-చెన్నై మధ్య నిత్యం రాకపోకలు సాగించేందుకు రోడ్డు మార్గం మినహా మరో మార్గంలేదు. విచిత్రం ఏమిటంటే రైలు మార్గం ఉన్న రైళ్లు లేకపోవడం, రైలు సదుపాయం లేకపోవడంతో ప్రజలు గత్యంతరం లేక రోడ్డు మార్గంపై ఆధారపడి తమ తమ కార్యకలాపాలను రాకపోకలను కొనసాగిస్తున్నారు. పాకాల,చిత్తూరు,కాట్పాడి మీదుగా మనదపల్లి-చెన్నైల మధ్య రైలు సర్వీసులను నడిపితే ఇటు ప్రజలకు రైలు సదుపాయం కల్పించడంతో పాటు రైల్వేకు రెవెన్యూ ఆదాయం సైతం పెరుగుతుంది. స్వతహాగా సానుకూలస్వభావి అయిన ప్రస్తుత గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఈ విషయమై దృష్టి సారించాలన్నారు.

## క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో డిజిటల్ మార్పులు : డిజిపి హరీష్‌కుమార్

**విజయవాడ, ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:,** భారత ప్రభుత్వం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఇంటరాపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసిజెఎస్) 2.0 ను ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రారంభించింది.ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శనివారం లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.88.03 కోట్లు విలువైన ఈ ప్రాజెక్ట్ ద్వారా, క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలోని ముఖ్యమైన శాఖలైన పోలీస్, జైలు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్స్, కోర్టులు అనే 5 విభాగాల్లో ఆధునిక హార్డ్ వేర్ మరియు మౌళిక సదుపాయాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా డీజీపీ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం కాగితం లేని, సాంకేతికత ఆధారిత డేటా మార్పిడి ద్వారా న్యాయవ్యవస్థను సమర్థవంతంగా, పారదర్శకంగా, వేగవంతంగా చేయడం. ఇది క్రిమినల్ జస్టిస్ డెలివరీ విధానాన్ని సమూలంగా మార్చే విప్లవాత్మక చర్యగా నిలవనుంది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ దేశవ్యాప్తంగా ఒక రోల్ మోడల్ గా నిలిచింది, అత్యాధునిక హార్డ్ వేర్ ను అత్యంత పోటీతత్వ ధరలకు కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదా చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా కొనుగోలు చేసిన పరికరాలు ఉంటాయి.4,575 ఆల్‌ఇన్‌వన్ పీసీలు ప్రతి పోలీస్ స్టేషన్ కు 4 డెస్క్ టాప్‌లు, ప్రతి కోర్టు కాంప్లెక్స్ కు 2 డెస్క్ టాప్ లు, స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ కు 5 డెస్క్ టాప్ లు , రీజినల్ ఫోరెన్సిక్ ల్యాబ్ లు కు 3 డెస్క్ టాప్ లు, అలాగే జైళ్ల శాఖ,ప్రాసిక్యూషన్ కార్యాలయాల కోసం అదనపు పరికరాలు, ఇవన్నీ వేగవంతమైన డేటా ప్రాసెసింగ్ ను అందిస్తాయి1,259 వెబ్ క్యామ్ లు ,అన్ని శాఖల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ మరియు సాక్ష్యాల రికార్డింగ్ కోసం 520 హైఎండ్ ల్యాప్ టాప్ లు ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్/అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు ఒకటి (మొత్తం 465) , ఫీల్డ్ ఆఫీసర్లు మరియు పరిపాలనా పనుల కోసం అదనపు యూనిట్లు.1,483 మల్టీ ఫంక్షనల్ ప్రింటర్లు ఉంటాయి.అన్ని ఎండ్ పాయింట్ లు మరియు సున్నితమైన డేటా కోసం ఎఐ ఆధారిత తక్షణ ప్రమాద గుర్తింపు, సెంట్రలైజ్డ్ మానిటరింగ్, క్లౌడ్ పాలసీ మేనేజ్మెంట్ వంటి ఫీచర్లతో ఒక బలమైన ఎండ్ టు ఎండ్ భద్రతా పరిష్కారం, ఐసిజెఎస్ 2.0 ప్రారంభంతో, భారతదేశంలో డిజిటల్ పోలీసింగ్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందు వరుసలో నిలుస్తోంది. అత్యుత్తమ పరికరాలను పొందడమే కాకుండా, పోలీస్, జైళ్ల, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్స్, కోర్టుల శాఖలలో వినూత్న పరిష్కారాలను సమర్థవంతంగా అమలు చేసి, పారదర్శకత, భద్రత, వేగవంతమైన న్యాయనివేదిక కోసం కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ ప్రయోగం అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని బలపరిచేలా, ప్రజలకు వేగంగా విశ్వసనీయంగా న్యాయం అందించే దిశగా నడిపిస్తోంది.




ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఐసిజెఎస్ 2.0 ప్రారంభిస్తున్న డీజీపీ

## అన్నవరం దేవస్థానంలో సమస్యలపై ప్రక్షాళన చేపట్టాలి

### లేని పక్షంలో ఆలయం వద్ద ఆందోళన :బ్రాహ్మణ సంక్షేమ వేదిక అధ్యక్షుడు రామం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,ఆగస్టు 2( ప్రభాతవార్త ):** కాకినాడ జిల్లా పవిత్ర పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అవకతవకలు,వేద పాఠశాల విద్యార్థుల మౌలిక సదుపాయాలు, సమస్యలపై ప్రభుత్వం స్పందించి ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉందని బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆంధ్ర రాష్ట్ర జోనల్ అధ్యక్షులు మిర్తిపాటి రామం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నవరం దేవస్థానానికి ఒక విశిష్టత ఉందన్నారు. అటువంటి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, సమస్యలపై వస్తున్న పత్రికల వార్తా కథనాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని అధికార యంత్రాంగం పై చర్యలు చేపట్టాలన్నారు.ఇక్కడ వేద పాఠశాలలోని విద్యార్థులు అస్వస్థకు గురై, హాస్పటల్లో వైద్యం పొందుతున్నారనే వార్త విని చాలా బాధపడటం జరిగిందన్నారు.తల్లిదండ్రులు లేని పేద పిల్లలు వేద విద్యను నేర్చుకుని కుటుంబానికి ఆసరాగా నిలవాలనే సదుద్దేశంతో వేద పాఠశాలలో చేరడం జరుగుతుందన్నారు. అటువంటి వేదవిద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. వేద పాఠశాల విద్యార్థులకు సరైన పోషకాహారం అందించడం లేదనేది పత్రికలు వాస్తవాలు వెల్లడిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భోజనంను కాంట్రాక్టర్ కి అప్పగించడంతోనే ఆ విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందటం లేదన్నారు.అన్నవరం వేద పాఠశాలకు విశేషత ఉందని పేర్కొన్నారు.ఈ పాఠశాలలో వేద విద్య నేర్చుకున్న విద్యార్థి నేడు కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారని ఆయన వెల్లడించారు. అటువంటి వేద పాఠశాల రాజకీయ వ్యవస్థతో భ్రష్టు పడుతుందన్నారు. నెలరోజులు గడవకముందే వేద పాఠశాల విద్యార్థులు రెండుసార్లు అస్వస్థకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. కమిషనర్ విచ్చేసి విద్యార్థులను పరామర్శించడం కాకుండా అక్కడ బాధ్యులపై చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.ఒకటి , రెండు కాదు చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని..నెయ్యి డబ్బాలు తరలిపోతున్నాయి, శానిటేషన్ కార్మికుల పీఎఫ్ సొమ్ములు దారి మళ్ళాయి. వీటన్నిటి పైన తూతూ మంత్రపు చర్యలు కాకుండా అన్నవరం దేవస్థానం కి పట్టిన గ్రహణం ఎవరనేది పూర్తిస్థాయి విచారణ చేపట్టి ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు.తక్షణం ప్రభుత్వం స్పందించి ఆలయంలో జరిగిన అవకతవకలు, సమస్యలపై పూర్తి స్థాయి విచారణ

## భక్తుల భద్రత, వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి - సివిఎస్ఒ మురళీకృష్ణ

**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో సెప్టెంబర్ 23నుండి జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రతతోబాటు వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి తిరుమలలోని ప్రతి ప్రాంతంపై మరింత నిశితంగా టెక్నాలజీతో నిఘా ఉంచిభద్రతను పటిష్టంచేయాలన్నారు. బ్రహ్మోత్సవాల

సమయంలో తొలిరోజు ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పణ ఉంటుందని, ఆరోజు భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా పెద్దశేషవాహనం, గరుడవాహనం, రథోత్సవం, చక్రస్నానం రోజుల్లో మరింత అప్రమత్తత అవసరమన్నారు. బ్రహ్మోత్సవాల ముందస్తు భద్రతా ఏర్పాట్లు, అనుసరించాల్సిన వ్యూహంపై శనివారం అన్నమయ్యభవనంలో సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ విజిలెన్స్ అధికారులతో సమావేశమయ్యారు.

భారతదేశంలో నిరుద్యోగుల్లో అత్యధికంగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఉండటం బాధాకరంగా ఉంది. దేశంలో 83 శాతం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉంటున్నారు. ఇంజినీరింగ్‌లో కూడా కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎక్కువగా నిరుద్యోగులుగా ఉంటున్నారు. ఇంజినీరింగ్ నిరుద్యోగుల్లో 7.5 శాతంమంది కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు నిరుద్యోగులుగా ఉంటున్నారు. దీనివల్ల ఈ రంగం నిరుద్యోగ డిగ్రీ హోల్డర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఇంజనీరింగ్ వారి తరువాత 46శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన అర్హతలు ఉన్నప్పటికీ యువ నిపుణులు ఉపాధిని పొందేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఇక ఆర్ట్ హిస్టరీ చదివిన వారిలో 3శాతం మంది నిరుద్యోగులుగా ఉంటున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. సిఏ పూర్తిచేసిన వారు సైతం నిరుద్యోగులుగా ఉన్నారని ప్రజలు తరచుగా చెబుతుంటారు. దేశంలో సుమారు 20వేల మంది కొత్తగా అర్హత సాధించిన సిఏలు ఒకే ప్రయత్నంలోనే మార్కెట్‌లోకి ప్రవేశించారు వారు నిరుద్యోగులుగానే కొనసాగుతున్నారు. చివరికి ఐఐటీలు, ఎన్ఐటీల్లో చదువును పూర్తి చేసుకున్న వారు సైతం నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. గత సంవత్సరం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లలో 24,230 మంది ఐఐటి, ఎన్ఐటి విద్యార్థులల్లో దాదాపు 8వేల మంది విద్యార్థులకి ఉద్యోగాలు లభించలేదు. ఆంత్రోపాలజీ గ్రాడ్యుయేట్ల 9.4 శాతంమంది నిరుద్యోగులుగా ఉన్నారు. భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన వారిలో 7.8 శాతం మంది నిరుద్యోగులుగా మారుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరి కొన్ని రాష్ట్రాల్లోనూ ఇంజనీరింగ్ పూర్తి చేసిన గ్రామీణప్రాంతనిరుద్యోగులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారు.

# పెరుగుతున్న నిరుద్యోగం

భారతదేశం జనాభాలో ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరింది. జనాభాలోనే కాదు.. నిరుద్యోగంలో కూడా నంబర్ వన్ స్థానంలోనే ఉన్నట్టు కొన్ని సర్వేలను బట్టి చూస్తే తెలుస్తోంది. ప్రపంచంలోనే ఎక్కువ మంది జనాభా ఉన్న దేశంగా ఉన్న ఇండియాలో యువత కూడా ఎక్కువగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సందర్భాల్లో చెబుతూ వస్తోంది.. ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం భారతదేశమని.. ఇక్కడ ఏదైనా చేయడానికి సరిపడా యువత ఉన్నారని చెబుతోంది. ఇది వాస్తవమే. అయితే పనిచేయడానికి యువత సిద్ధంగా ఉన్నప్పటికీ వారికి పని కల్పించే వారు లేరు. దేశంలో ఉన్న యువతకు ఉపాధి లేక ఖాళీగా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగుల్లో కూడా రెండు రకాల నిరుద్యోగులు ఉన్నారు. వారిలో చదువుకుని ఎటువంటి ఉపాధి లేకుండా ఉన్న నిరుద్యోగులు ఒకరకమైతే.. చదువు లేకుండా చేయడానికి పనిలేకుండా ఉండే నిరుద్యోగులు మరోరకం. ఇలా రెండు రకాల నిరుద్యోగులతో భారతదేశం కొనసాగుతోంది. భారతదేశంలో నిరుద్యోగుల ఖచ్చితమైన సంఖ్యను గుర్తించడం కష్టమే అయినప్పటికీ, భారతదేశ గ్రాడ్యుయేట్ జనాభాలో గణనీయమైన భాగం నిరుద్యోగులుగా ఉన్నారని నివేదికలు సూచిస్తున్నాయి. 25 ఏళ్లలోపు వారికి ఇది 42.3 శాతం నుంచి 54.8 శాతం వరకు ఉంటుందని అంచనా. ముఖ్యంగా ఇంజనీరింగ్, వ్యాపారం(కామర్స్) వంటి రంగాలలో గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో డిగ్రీలు పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోందని ది వైర్ నివేదిక ప్రకారం తెలుస్తోంది. భారతదేశంలో దాదాపు 28మిలియన్ల మంది విద్యావంతులైన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం వెతుకుతున్నారు. దాదాపు 100 మిలియన్ల మంది వ్యక్తులు నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. ప్రధానంగా మహిళలు పనికోసం వెతకడం మానేశారని నివేదికలు చెబుతున్నాయి. భారత్‌లో నిరుద్యోగం తాండవిస్తోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో), మానవాభివృద్ధి సంస్థ(ఐహెచ్‌డీ) సంయుక్త అధ్యయనంలో వెల్లడైంది. 'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పలు కీలక విషయాలను వెల్లడించింది.

**నాగమణీంద్ర పల్లాపు**

ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ నివేదిక ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగాలు లేక ఈసురోమంటున్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83శాతం మంది యువతేనని ఆ అధ్యయనం పేర్కొంది. అంతేకాక మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000నాటికి 54.2 శాతం ఉండగా 2022 నాటికి అదికాస్త 65.7శాతానికి పెరిగింది. ఈ పరిస్థితి భారత్



వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి తీవ్ర ఇబ్బందేనని నివేదిక స్పష్టంచేసింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ విద్యావంతుల్లో మహిళలు 76.7 శాతంగా ఉంటే పురుషులు 62.2 శాతం మంది ఉన్నారు. కరోనా కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గి నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. 2000లో ఉద్యోగాలు పొందిన యువతలో సగం మంది స్వయం ఉపాధిని పొందినవారే. వీరిలో 13 శాతం మంది రెగ్యులర్, 37శాతం మంది తాత్కాలిక ఉద్యోగాలు దక్కించుకున్నారు. వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో 70 నుంచి 80 లక్షల యువశక్తి అందుబాటులోకి రానుంది. దేశంలో గణనీయమైన శాతంలో గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. ఇండియా టుడే ప్రకారం, ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2025 ప్రకారం భారతీయ గ్రాడ్యుయేట్లలో కేవలం 54.8 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారని సూచిస్తుంది. మెర్సర్, మెట్ల్స్ గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్- 2025 ఈ సంఖ్య ఇంకా తక్కువగా, 42.6 శాతం ఉంటుందని అంచనా వేసింది. చాలా మంది గ్రాడ్యుయేట్లు నిరంతర నిరుద్యోగం కారణంగా చురుకుగా ఉద్యోగాల కోసం వెతకడం మానేస్తున్నారు. దీని వలన వాస్తవ నిరుద్యోగ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆటోమేషన్, ఏఐ మూలంగా ప్రభావితమైన అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ మార్కెట్ నైపుణ్యాల అంతరాన్ని సృష్టిస్తోందని.. దీని వలన గ్రాడ్యుయేట్లకు తగిన ఉపాధి దొరకడం కష్టమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంజినీరింగ్, కామర్స్ వంటి రంగాలలో గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉంది. సుమారు 83 శాతం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, 46 శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ చేసిన వారే కాకుండా చాలా మంది గ్రాడ్యుయేట్లు కూడా నిరుద్యోగులుగా ఉన్నారు. వారి విద్యా అర్హతలు, నైపుణ్య సెట్‌లకు సరిపోని ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. వివిధ అంశాలు గ్రాడ్యుయేట్ నిరుద్యోగానికి దోహదం చేస్తాయి. నైపుణ్యాలు, ఉద్యోగ అవసరాల మధ్య అసమతుల్యత, ఆర్థిక మందగమనం, ఉద్యోగ మార్కెట్ అభివృద్ధి చెందుతున్న స్వభావం వంటివి నిరుద్యోగానికి కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో చదువుకున్న నిరుద్యోగులు ఎక్కువగానే ఉన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబిఏ, ఎంసిఏ వంటి ఉన్నత కోర్సులు చేసిన వారు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. వారితోపాటు పిహెచ్‌డిలు చేసిన వారు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. ప్రతి ఏడాది లక్షలాది మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు తమ చదువును ముగించుకొని నిరుద్యోగులుగా రోడ్లపైకి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఏడాదిలో సుమారు 50 వేల మంది ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేస్తున్నారు. అలాగే ఏపీలో ఇంతకంటే ఎక్కువగా సుమారు 60వేల మంది ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకుంటున్నారు. చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటారు. అవి కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఏవైనా బాగుంటుందని చూస్తారు. అయితే చదువుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారుతుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్లను జారీ చేస్తాయి. వాటి ద్వారా వచ్చే ఉద్యోగాలు తక్కువగానే ఉంటాయి. ఇక ప్రైవేటు ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఎక్కువగానే ఉంటాయి. వాటిలో కూడా చదువుకున్న వారందరికీ వచ్చే అవకాశం లేదు. చదువుకున్న వారిలోకూడా నైపుణ్యాలు(స్కిల్స్) ఉన్న వారికి ఉద్యోగవకాశాలు ఎక్కువగా ఉంటుండగా.. సాధారణ డిగ్రీ కోర్సులు చేసిన వారికి తక్కువగా ఉంటున్నాయి. చదువుకున్న వారిసంఖ్య లక్షల్లో ఉండటం.. పోస్టుల సంఖ్య వందల్లో ఉండటంతో పోటీ విపరీతంగా ఉంటుంది. చివరికి ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, ప్రైవేటు ఉద్యోగాలకి సైతం చిన్నస్థాయి ఉద్యోగాలకి సైతం ఉన్నత చదువులు చదివిన వారు పోటీపడుతున్న వైనం కనబడుతోంది. గతంలో తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్‌లోనూ కానిస్టేబుల్ పోస్టులకి పిహెచ్‌డీ చేసిన వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో నిరుద్యోగుల కోసం వయోపరిమితిని ప్రభుత్వం పెంచడంతో రిజర్వేషన్ పొందే అభ్యర్థులు 50సంవత్సరాలు పైబడిన వారు సైతం ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మధ్యకాలంలో ముంబయి పోర్టులో గ్రూప్-4 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేస్తే అందులో గ్రూప్-4 ఉద్యోగానికిసైతం పిహెచ్‌డీ, పీజీలు, ఇంజినీరింగ్ చేసిన వారు దరఖాస్తు చేసుకున్నారు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. దేశంలో నిరుద్యోగం ఏ మేరకు ఉందో. పీహెచ్‌డీ, డిగ్రీ కలిగి ఉండటం కేవలం ఒకప్రత్యేకత మాత్రమే కాదు. ఇది ఒక బలీయమైన ప్రయోజనం. ఒక సంస్థ నివేదించిన ప్రకారం పీహెచ్‌డీ హోల్డర్ల నిరుద్యోగిత రేటు 1శాతం కంటే తక్కువగా ఉండటంతో, జాతీయ సగటు 7శాతంతో పోలిస్తే, అధిక నైపుణ్యం కలిగిన వ్యక్తుల డిమాండ్ స్పష్టంగా ఉందని తెలుస్తోంది. ఇండియాలో ఎంబిబిఎస్ చదివితేఉద్యోగం వస్తుందనే అభిప్రాయం బలంగా ఉంటుంది. అయితే దేశంలో ఎంబిబిఎస్ పూర్తిచేసిన వారిలో సైతం 16 శాతం నిరుద్యోగులుగా ఉంటున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ●

శక్తి

కర్ణాటక

దాచేస్తే దాగని సత్యాలు మన చుట్టూ అనేకానేకం కనిపిస్తూంటాయి. అయితే అవి బహిర్గతం కాకుండా అనేక రకాల 'శక్తులు' కూడా పనిచేస్తుంటాయి. ఆ శక్తులు ఇవీ అని చెప్పలేం. కొన్ని సార్లు రాజకీయ శక్తులు, మరి కొన్ని సార్లు వ్యాపార శక్తులు, ఇంకొన్ని సార్లు ఇతర సామాజిక శక్తులు వాటిలో ఉంటాయి. కొన్ని సందర్భాల్లో అన్నీ కలిసి పనిచేస్తుంటాయి కూడా. కర్ణాటకలోని ధర్మస్థలలో ఇటీవల వెలుగులోకి వచ్చిన అసహజ మరణాల గురించి ఆరా తీస్తుంటే అక్కడ ఈ అన్నిశక్తులు కలగలిసి పనిచేశాయేమో! అనే అనిపిస్తుంది. ఒకరు, ఇద్దరు కాదు.. కొన్ని వందల మంది పురుషులు, మహిళలు ధర్మస్థల క్షేత్రంలో అసహజ మరణాలకు గురయ్యారనీ, వారిలో కొందరు స్థానికులుకాగా, కొందరు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారనీ తెలుస్తోంది. ధర్మస్థల ఒక పెద్ద పుణ్యక్షేత్రం గనుక నిత్యం ఎందరో భక్తులు, పర్యాటకులు వచ్చి వెళ్తూండడం సాధారణమే. అయితే వారిలో కొందరు అక్కడే అదృశ్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అలా అదృశ్యమైన వారిలో కొందరి మృతదేహాలను క్షేత్రం పరిసర ప్రాంతాల్లోనే ఖననం చేస్తున్నట్లు కూడా తెలుస్తోంది. తమవారి ఆచూకీ తెలియడం లేదనే ఫిర్యాదులు వచ్చినపుడు క్షేత్రంపై, అక్కడి పరిస్థితులపై బయటివారికి అనుమానాలు కలుగుతున్నాయి. లేదంటే గుట్టుచప్పుడు కాకుండా ఆ మృత దేహాలు 'భూస్థాపిత'మైపోతున్నాయి. దీని వెనుక గల మిస్టరీ ఏమిటన్నదే అంతుచిక్కకుండా ఉంది. చాలా కాలం నుంచి లెక్కలేనన్ని మృతదేహాలను అలా పూడ్చిపెట్టిన ఓ పారిశుధ్య కార్మికుడు దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ అరుణ్‌కు జూలై రెండోవారంలో రాసిన ఓ లేఖ తొలుత దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.' 1998 నుంచి 2014 మధ్య వందకు పైగా మృత దేహాలను ఖననం చేశాను. నా చేత ఆ పనులు చేయించిన కొందరు వ్యక్తులు మా కుటుంబానికి చెందిన యువతి పైనే అఘాయిత్యానికి పాల్పడడంతో బెదిరిపోయి మేము ఆ ప్రాంతం వదలి పారిపోయాం. కానీ పాప భీతితో వణికిపోతూ ఈ లేఖ రాస్తున్నా. తగిన రక్షణ కల్పిస్తే అన్ని నిజాలు బయటపెడతా ' అంటూ అతడు ఆ లేఖలో రాశాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. ప్రభుత్వానికి సమాచారం తెలియగానే జూలై 19న నలుగురు సీనియర్ ఐపిఎస్‌లతో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఆ కార్మికుడు ఇచ్చిన కొన్ని ఆధారాలతో 13 పాయింట్లను సిట్ గుర్తించి అక్కడ తవ్వడం మొదలు పెట్టింది. గత బుధ వారం (30,జూలై) ఒక పాయింట్ వద్ద తవ్వుతుం డగా ఓ అస్థి పంజరం అవశేషాలు పాక్షికంగా బయట పడినట్లు సమాచారం. కొంత దూరంలో కొన్ని ఎముకలు కూడా దొరికాయి. కొన్ని ఆధారాలను బట్టి ఆ అస్థి పంజరం పురుషునిదిగా భావించారు. మరో చోట ఓ పుర్రె కనిపించిందనీ, అది ఓ మహిళది కావచ్చనీ అంటున్నారు. అవశేషాలు ఎవరివనేది ఒక సందేహమైతే, అవి అసహజ మరణాలకు చెందినవేనా? అన్నది మరో సందేహం. పారిశుధ్య కార్మికుని లేఖవల్ల కొన్ని వందల అసహజ మరణాలు సంభవించాయనే విషయం స్పష్టమవుతోంది. అలా ఖననం చేసింది, చేస్తున్నది అతనొక్కడే కాదు. అతనికి ముందు, తర్వాత కూడా చాలా జరిగాయని సిట్ దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. దక్షిణ కన్నడ జిల్లాలోని ధర్మస్థల మంజునాథ స్వామి కొలువైన గొప్ప పుణ్యక్షేత్రం. ఆలయం మినహా ఇతర ఎలాంటి ప్రాధాన్యాలు ఆ ప్రాంతానికి లేవు. రాజ్యసభ సభ్యుడైన డా. వీరేంద్ర హెగ్డే ఐదు దశాబ్దాలుగా ఆలయం ధర్మాధికారిగా ఉంటు న్నారు. భక్తుల సంఖ్య రానురాను పెరుగుతున్న సమయంలో తాజాగా వచ్చిన ఆరోపణలు భక్తుల్లో తీవ్ర భయాందోళనలకు కారణమవుతు న్నాయి. గత పదేళ్లలో ధర్మస్థల చుట్టుపక్కల 450 మంది పైగా అదృశ్యమైనట్లు పోలీసు లెక్కల ప్రకారం తెలుస్తోంది. దానికి రెండు మూడు రెట్లు ఎక్కువే వాస్తవ సంఖ్యలుండొచ్చని స్థానికులు అంటున్నారు. నేత్రావతి నది ఇసుక పాయల్లో కలిసిపోయిన శరీరాలుఎన్నో, ఎన్నెన్నో! మంజునాథ ఆలయానికి సంబంధం ఉన్నవ్యక్తులే ఈ అదృశ్య మరణాల వెనుక కూడా ఉన్నారనీ, అందుకే తాను అక్కడి నుంచి పారిపోయాననీ పారిశుధ్య కార్మికుడు చెబుతు న్నాడు. అదే నిజమైతే ఇది చాలా పెద్దమిస్టరీయే అవుతుంది. గ్రామం నుంచి ఢిల్లీ దాకా ఎందరి పునాదులో కదులుతాయి. కానీ పాతికేళ్లుగా మిస్టరీని తొక్కిపెడుతున్నవారు ఇప్పుడు బయ టకు రానిస్తారా అన్నది మరో సందేహం. ఆ మృతదేహాలేగాక ఎన్నో నిజాలు కూడా అక్కడ భూస్థాపితమవుతున్నాయి. వాటిని బయటకు లాగాలంటే సిట్ దర్యాప్తు సరిపోతుందా! అన్నది మరోసందేహం. అసహజ మరణాలకు సంబం ధించిన ఆరోపణలు రావడంతో 2015లోనే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రప్ప కమిటీని ఏర్పాటు చేసింది. తర్వాత మూడేళ్లకు ఆ కమిటీ నివే దికను సమర్పించింది. యేడాదికి 300 మంది పురుషులు, మహిళలు, కొందరు బాలలు కూడా అక్కడ అసహజ మరణాలకు గురైనట్లుగా ఆ కమిటీ గుర్తించింది. కొందరు ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు కానీ అందుకోసం ఎవరైనా ధర్మస్థల దాకా వస్తారా? అన్నదీ సందేహమే. అక్కడ అదృశ్యమైన వారిలో కొందరు డాక్టర్లు, జర్నలిస్టులు కూడా ఉన్నారట. సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిపో తున్న ఈ ఉదంతంపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిగితేనే అసలు వాస్తవాలు వెలుగులోకి రావచ్చు. లేకుంటే ఉగ్రప్ప కమిటీ నివేదిక మూలపడినట్లు గానే సిట్ దర్యాప్తు కూడా ఏమీ తేల్చలేకపోవచ్చు. ఈ అసహజ మరణాల మిస్టరీ తేలకపోతే పుణ్య క్షేత్రమైన ధర్మస్థల చరిత్రలో అధర్మస్థలగా మిగిలిపోయే ప్రమాదం ఉన్నదని భక్తులు వాపోతున్నారు. మిస్టరీ వెనుక గల అదృశ్య హస్తాన్ని త్వరగా కనుగొనవలసిన అవసరం ఎంతైనా ఉంది. ●

# అ'ధర్మస్థల' మా?

**ఎ.వి.వి ప్రసాద్**



సిట్

దేశం

అమెరికా

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ శాంతి పురస్కారంపై మక్కువ రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది. ఏకంగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలని ప్రకటించారు. ప్రపంచ దేశాల్లో ఆరు శాంతి ఒప్పందాలకు ట్రంప్ దౌత్యం నెరపారని, అణు యుద్ధాలను సైతం విరమింప చేసారంటూలీవిట్ పేర్కొనడం గమనార్హం. గడచిన ఆరునెలల్లో నెలకొక వివాదం చొప్పున వివాదాలను పరిష్కరించారని, ఆరు శాంతి ఒప్పందాలు జరగడంలో ట్రంప్ ఎనలేని కృషి చేసారని లీవిట్ చెప్పుకొచ్చారు. అసలు ఇప్పటికే ట్రంప్ తాను స్వయంగా ఉక్రెయిన్, రష్యా, ఇరాన్-ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణలు తానే నివారించానని నోబెల్ శాంతి పురస్కారం అంటూ ఇస్తే తనకే ఇవ్వాలంటూ గతంలోనే ప్రకటించారు. అందుకు తగినట్లుగానే ఆయనకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలంటూ వివిధ దేశాధినేతలు కూడా ఎండార్స్‌మెంట్‌లు ఇస్తామని ప్రకటించారు. అధ్యక్షుడుగాపాలన పగ్గాలు చేపట్టిన ఏడాదిలోనే ట్రంప్ పాకిస్థాన్, ఇండియా, థాయిలాండ్ కాంబోడియా, ఇజ్రాయెల్ ఇరాన్, రువాండా, కాంగో, సెర్బియా కొసావో, ఈజిప్టు ఇథియోపియా దేశాలమధ్య రగిలిన రావణకాష్టాలన్నింటినీ విరమింపచేసి ఆదేశాల మధ్య సఖ్యతకు ఎంతో కృషిచేసారంటూ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ చెప్పుకొచ్చారు. ఇక ఇండియా పాకిస్థాన్‌లమధ్య ఆపరేషన్ సింధూర్‌ను విరమింపచేసింది తానేనని ట్రంప్ ఏకంగా 30సార్లు అయినా చెప్పి ఉంటారని భారత్‌లోని విపక్షాలు చెపుతున్న సంగతి తెలిసిందే. సింధూర్ ముగిసిన వెంటనే పాక్‌కు ఐఎంఎఫ్‌రుణం మంజూరులోను, యుద్ధ తాత్కాలిక విరమణలోను సాయం చేసారనుకుందో ఏమోకానీ పాక్‌తనంత తానుగా డొనాల్డ్‌ట్రంప్‌ను నోబెల్ శాంతిపురస్కారానికి ఎంపికచేయాలని తమ దేశం తరపున ఎండార్స్‌మెంట్ ఇస్తామని ప్రకటిచేసింది. ఇప్పటివరకూ ట్రంప్‌నకు నోబెల్‌శాంతి బహుమతి ఇవ్వాలంటూ ఇజ్రాయెల్, పాకిస్థాన్ ప్రధాన మంత్రులతోపాటు ఆఫ్రికన్ గ్రూప్ దేశాల నేతలు గాబన్, గెయినా బిస్సావు, లైబీరియా, మారుటేనియా, సెనెగల్ వంటి దేశాలు ట్రంప్‌నకు శాంతిపురస్కారానికి తాము ఎండార్స్‌మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాయి. రువాండా కాంగో శాంతి ఒప్పందంలో ట్రంప్ విశేష కృషిచేసారంటూ ఆదేశాలు ప్రస్తుతించాయి. కాంబోడియా డిప్యూటి పిఎం సున్ ఛాంథోల్ ఇప్పటికే ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తమ దేశానికి సుంకాలు తగ్గించడంలోను, పొరుగుదేశంతో ఉన్న వివాదాలు పరిష్కరించడంలోట్రంప్ కీలక పాత్రపోషించారని డిప్యూటి పిఎం చెప్పుకొచ్చారు. అలాగే అమెరికా కాంగ్రెస్ మాన్ బడ్డీ కార్టర్ ట్రంప్‌ను నామినేట్ చేస్తామని ప్రకటించారు. మరో కాంగ్రెస్ మ్యాన్ డారెల్ ఇస్సా కూడా తన నామినేషన్‌ను ట్రంప్‌కోసం పంపించారు. మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనేందుకు ట్రంప్ కీలక పాత్రపోషించారంటూ ఆయన తన నామినేషన్‌లో వివరణ ఇచ్చారు. వివిధ దేశాలు, ప్రముఖులు, సెనెట్, రిపబ్లికన్లు ఎండార్స్‌మెంట్ ఇవ్వడం అటుంచితే అసలు ట్రంప్‌కే నోబెల్ శాంతిపురస్కారంపై ఎనలేని మక్కువ ఏర్పడింది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. 2009లో అప్పటి డెమొక్రాట్ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు శాంతిపురస్కారం లభించింది. అలాగే 2002 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్‌కు నోబెల్ శాంతిపురస్కారాలు లభించాయి. ఒబామాకు అయితే గెలిచి పాలన పగ్గాలు చేపట్టిన తొమ్మిదినెలలకే ఆయనకు శాంతిపురస్కారం లభించింది. నోబెల్ పురస్కారాలకు గాను మరుసటి సంవత్సరం జనవరి 31 నాటికే దరఖాస్తులు పంపించాలి. ట్రంప్ తరపున వెళ్లాయోలేదో తెలియదు కాని ఈసారి తమ అధ్యక్షుడికే ఈ శాంతిపురస్కారం లభిస్తుందంటూ శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ ధీమాగా ఉన్నారు. ఓ పక్క వాణిజ్యఒప్పందాలకు రావాలంటూ ప్రపంచ దేశాలపై ఒత్తిడిని పెంచుతూ సామ, దాన దండోపాయాలను ఉపయోగించి తనదారికి తెచ్చుకుంటూ ఒప్పందాలు చేసుకుంటున్న ట్రంప్‌శాంతిపురస్కారానికి ఎలా అర్హులని డెమొక్రాట్లు ప్రశ్నిస్తున్నారు. ఇరాన్‌పై ఏకపక్షంగా చేసిన దాడి శాంతిపురస్కారానికి దోహదం చేస్తుందా అని నిలదీస్తున్నారు. ఉక్రెయిన్, రష్యాల మధ్య గడచిన నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధకాండను ఇప్పటికీ విరమింపచేయలేకపోయారని, పుతిన్‌తో శాంతిచర్చల్లో ఘోరంగా విఫలమైన ట్రంప్ శాంతిపురస్కారానికి ఎలా అర్హులు అవుతారన్న విమర్శలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. నిజానికి జీ7 దేశాలు కానీ, జీ20 దేశాల్లో ఏ ఒక్క అభివృద్ధిచెందిన దేశం కూడా నోబెల్ పురస్కారానికి ట్రంప్ పేరును ప్రతిపాదించలేదు, సరికదా సూచించను కూడా లేదు. ఉగ్రవాదంతో అట్టుడుకుతున్న దేశాల్లో ఏర్పడిన సరిహద్దు తగాదాలు పరిష్కరించడంలో ట్రంప్ అమెరికా ప్రయోజనాలను కాదని ఎప్పుడూ ముందుకుపోలేదన్న వాదన ఉంది. నోబెల్ ఎంపికలను పరిశీలిస్తే శాంతి పురస్కారానికి నార్వే పార్లమెంటు ఏర్పాటుచేసిన ఐదుగురు సభ్యుల కమిటీ నిర్ణయిస్తుంది. ప్రభుత్వ అధినేతలు, ప్రొఫెసర్లు, మాజీ పురస్కార గ్రహీతలు, శాంతిపరిశోధక సంచాలకులు వంటి వారి నామినేషన్లను మాత్రమే ఈఐదుగురు సభ్యుల కమిటీ అనుమతిస్తుంది. వాస్తవానికి నోబెల్ పురస్కారాలకు నామినేషన్లు ఈ ఏడాది జనవరి 31తోనే ముగిసాయి. మొత్తం 338 మంది ప్రముఖులు, 94 వివిధ సంఘాలు ఇందుకోసం దరఖాస్తులు చేసాయి. విజేతను అక్టోబరు నాటికి ప్రకటిస్తుంది. నార్వేలోని ఓస్లోలో డిసెంబరు 10వ తేదీ ఈ పురస్కారాల ప్రధానం ఉంటుంది. విజేతలకు బంగారుపతకం, డిప్లొమా, తొమ్మిది లక్షల అమెరికా డాలర్లు లభిస్తాయి. ఇప్పుడు ట్రంప్‌ను శాంతిపురస్కారం వరిస్తుందోలే ఆయన్ను పట్టిపీడిస్తున్నచిరకాల కోరికనెరవేరుతుందోలేదో చూడాల్సిందే. ●

# 'నోబెల్ శాంతి' కి ట్రంప్ తహతహ!

**గన్ని మోహన్**



డొనాల్డ్‌ట్రంప్

# వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది భర్తీలో జాప్యమెందుకు?

**మన్నారం నాగరాజు**

బ్రిటిష్ పాలకుల ఆలోచనలు, విధానాలు, స్వాతంత్ర్య పూర్వ భారత్లో ఆరోగ్య సంరక్షణ నమూనాలపైప్రత్యక్ష ప్రభావం చూపాయి. స్వాతంత్ర్యానికి పూర్వం, బ్రిటిష్ వారి ఏలుబడిలో భారతదేశ పురోగతిపై పెద్దఎత్తున చర్చజరిగేది. అభివృద్ధి సూచనలు దేశాన్ని దీనస్థితిలో చూపడంలో, దానిపై పలురకాల చర్చలు సాగేవి. మౌలిక విద్య, ఆరోగ్యం, సంక్షేమం మొదలైన వాటికి సంబంధించి ప్రజలు అభివృద్ధి చెందకపోవటానికి, భారతదేశపు వెనుకబాటు తనానికి వలస పాలకులు, వారు సాగించిన దోపిడీయే ప్రధాన కారణమని జాతీయ ఉద్యమ కోణంనుంచి అభిప్రాయం వ్యక్తమయ్యేది. వైద్య సేవల లభ్యతపై గ్రామీణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలు నెలకొని ఉన్నాయి. గ్రామీణ ప్రజలు స్థానికంగా వైద్యులుగా చలామణి అవుతున్న వారితో వైద్యం చేయించామంటున్నారు. మూఢనమ్మకాలతో, సహేతుకం కాని వ్యాధి నివారణ పద్ధతులను పాటిస్తున్నారు. గ్రామీణ పట్టణప్రాంత ప్రజల మధ్య అంతరానికి ఇది ఒక కారణం. భారతీయ ప్రజలు తక్కువ శక్తిమంతులుగా ఉండటానికి భారతీయ సమాజంలో వ్యవస్థలనే నిందించాల్సి ఉంటుందని వలస పాలకుల వాదం. భారత జాతీయ కాంగ్రెస్‌లోని ఆధునికులు, వామపక్షీయులు, తీవ్రవాదులు జాతీయ ఆరోగ్య విధానాలపై సలహా ఇచ్చారు. వలసపాలనతో రాజకీయంగా, సామాజికంగా, మేధాపరంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవటానికి భారతీయ మేధావి వర్గం జరిపే బహిరంగ చర్చల్లో ఆరోగ్యం, సామాజిక ఆచారాల అంశం కూడా భాగమైంది. ఆరోగ్య స్థితిగతులపై 1948లో సర్‌జాన్ భోరే కమిటీ నివేదిక వెలువరించింది. అప్పటినుంచి ఆరోగ్య రంగంలో, అందునా ప్రత్యేకించి గ్రామీణ భారతంలోని దీన పరిస్థితిని గురించి, జాతీయ వాదులే గాక బ్రిటిష్వారు కూడా బాహాటంగానే చర్చించడం మొదలైంది. బ్రిటిష్ భారత్లో ప్రతి వేయిమంది జనాభాకు మరణాల రేటు 22. అదే శిశువుల మరణాల రేటు ప్రతివేయి జనాభాకు 162గా కమిటీ నిర్ధారించింది. కమిటీ అంచనా సహేతుకంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. స్వతంత్ర భారతావనిలో ఆరోగ్య రంగంలో పురోగతి సాధనకు కమిటీ సిఫారసులు గొప్ప ముందడుగుగా పరిగణించారు. దేశం నలుమూలలా ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పాలి. ప్రతి పౌరుడికీ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తేవాలి. ఆరోగ్య సంరక్షణ ఖర్చు సామాన్యుడి తలకుమించిన భారంగా ఉండకూడదు. ప్రజానీకానికి ఉచితంగా ఆరోగ్య సంరక్షణను, రక్షిత తాగునీటిని, పారిశుద్ధ్యాన్ని, పౌష్టిహాకారాన్ని, మౌలిక విద్యను అందించాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది. ఖర్చు భరించలేని కారణంగా ఎవరూ తగిన వైద్య సంరక్షణకు దూరం కాకూడదు. ఆరోగ్య సంరక్షణను కల్పించే వారి పాత్ర గురించి కమిటీ ప్రస్తావిస్తూ, వైద్యుడనేవాడు సామాజిక ఫిజీషియన్ అనీ, రోగాలబారి నుండి ప్రజలను కాపాడటమే గాకఆరోగ్య కేంద్రాలకు మార్గనిర్దేశం చేయడం అతడి బాధ్యత అని తెలిపింది. భారత్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు, కేంద్రీకృత సంస్థాగత నిర్మాణానికీ భోరే కమిటీ సిఫారసులు ప్రాతిపదిక అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల పాలనలో వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల హామీల్లో గొప్పగా ప్రకటించిన ఆరోగ్య తెలంగాణ, కార్పొరేట్ వైద్యం అంతా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చేలా కేసీఆర్ కిట్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రారంభించినప్పటికీ, భద్రత కలిగిన మౌలిక సదుపాయాలు, అవసరమైన సిబ్బంది భర్తీ, సమయానుకూల బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల అవి నిరర్థకంగా మిగిలిపోయాయి. జిల్లా ఆసుపత్రులు వైద్యులేక, ఫార్మసిస్టులేక, సిబ్బందిలేక కష్టాల్లో కూరుకుపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్యకార్యకర్తలు తగిన పరిమాణంలో లేక, ఉండే వారికీ జీతాలు సకాలంలోరాక, ఒత్తిడి, ఆక్రోశానికి గురయ్యారు. వైద్యరంగంలో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను బీఆర్ఎస్ భర్తీ చేయకపోవడం ద్వారా ప్రజారోగ్యంపాడైంది. అత్యవసర చికిత్స అవసరమైన సమయానికి అందక



ప్రాణనష్టం చెందిన ఘటనలు పలుమార్లు వార్తలయ్యాయి. పల్లెల్లో ప్రసూతి సేవలు, ప్రాథమిక చికిత్సఅందే పద్ధతులు దారుణంగా నశించాయి. ఫార్మసిస్ట్‌లు, నర్సులు, మెడికల్ టెక్నీషియన్లు, డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం తగ్గింది. ఇదే సమయంలో ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకం ఎక్కువగా ప్రైవేట్ ఆసుపత్రులకు మళ్లడం, వాటికి బకాయిలు పెరగడం వల్ల సేవల్లో అంతరాయం కలిగింది. ఇక ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముందుగా సిబ్బంది నియామకాలపై స్పష్టతనిచ్చి, త్వరితగతిన ఉద్యోగాలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రజారోగ్యం పరిరక్షణే ప్రభుత్వ ధర్మంగా భావించి, ఆరోగ్య శాఖలో వృత్తిపరంగా నిష్ణాతులైన డాక్టర్లను, నర్సులను, ఫార్మసిస్టులను, ఇతర సిబ్బందిని నియమించడం అత్యవసరం. గ్రామీణ ప్రాంతాలకు మొదట ప్రాధాన్యతనిస్తూ మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. వైద్యరంగానికి బడ్జెట్లో కేటాయింపులు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమంగా తగ్గించింది. వైద్యానికి ఆదాయం కాదు, సేవ ధ్యేయంగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రాష్ట్ర బడ్జెట్‌లో 8శాతం వరకు కేటాయింపులు చేస్తేనే మార్పు కనిపిస్తుంది. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు నూతనంగా నిర్మించడం లేదా పునరుద్ధరించడం ద్వారా సేవా స్థాయిని మెరుగుపరచాలి. ఒక గొప్ప ఆరోగ్య వ్యవస్థకు మూలం వ్యవస్థాపిత నియామకాలూ, స్థిరమైన బడ్జెటు కేటాయింపులూ, ప్రజలపట్ల ఉన్నత నైతిక బాధ్యతగల పాలన. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి అవకాశం ఉంది. గత పాలకుల తప్పుల్ని పునరావృతం చేయకుండా, ప్రజల ఆరోగ్యాన్ని ప్రధాన కర్తవ్యంగా భావించి ముందడుగు వేస్తే, తెలంగాణలో ఆరోగ్య రంగానికి కొత్త శకం ప్రారంభమవుతుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్య సేవల విస్తరణకు క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్య సేవల అందుబాటుకు వైద్య ఆరోగ్య శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. అయితే, గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఈ విభాగాన్ని నిర్లక్ష్యం చేయడంతో అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందు తరాల పొరపాట్లను సరిదిద్దే బాధ్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న నర్సులు, ఫార్మసిస్టులు, ఫామ్ డి డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంల పోస్టుల భర్తీప్రక్రియలో వచ్చే సమస్యలు, ఆలస్యాలు ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేయడం గమనార్హం. ఈ రోజు ఆరోగ్య వ్యవస్థను ముందుకు నడిపించడంలో డాక్టర్లతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాత్రను విస్మరించలేం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. వీరి అందుబాటులోనే గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఆధారపడతారు. దీంతోపాటు, ఫార్మసిస్టులు మందుల సరఫరా నిర్వహణలో కీలకం కాగా, ల్యాబ్ టెక్నీషియన్లు పలు రకాల పరీక్షల ద్వారా డాక్టర్లకు కీలకసమాచారం అందిస్తారు. సుమారు 6,269పోస్టుల భర్తీ ప్రక్రియ, పరీక్షలు పూర్తై నెలలు గడిచినా ఫలితాల వెల్లడి లేదు. 2023లో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా 6,269 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసిస్టు, ఏఎన్ఎం పోస్టులే కాకుండా ఇతర అనుబంధ ఉద్యోగాలూ ఉన్నాయి. పరీక్షలు నవంబరు, డిసెంబరు 2023లో జరిగినా ఫలితాలు ఇప్పటివరకు విడుదల కాకపోవడం అభ్యర్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ల్యాబ్ టెక్నీషియన్ వేలమంది నిరుద్యోగ యువత పరీక్షలు రాశి, ఒక మంచి ఉద్యోగావకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం త్వరగా ప్రక్రియను పూర్తి చేస్తుందని ఆశించిన అభ్యర్థులు, నెలలుగడుస్తున్నా ఫలితాలపై స్పష్టత లేకపోవడంతో అయోమయంలో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనుకుంటే, మరోవైపుఅందుకు అవసరమైన మానవ వనరులను త్వరగా అందుబాటులోకి తేవాలి. అభ్యర్థులు న్యాయపరమైన అంశాలు పోరుపడుతుంటే, ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయాలు ఆలస్యంగా తీసుకోవడం మరింత సమస్యలను పెంచుతుంది. కనీసం ఇప్పుడైనా ఫలితాల ప్రక్రియపై స్పష్టమైన కాలపట్టికను విడుదల చేసి, నియామకాలను వేగంగా పూర్తి చేయాలి. ●



# ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

పనిమనిషిపై అత్యాచారం కేసు

### తనకు తక్కువ శిక్ష వేయాలంటూ కోర్టులో ఏడ్చేసిన రేవణ్ణ

### 14 నెలలుగా జైల్లో ఉన్న మాజీ ఎంపి

**బెంగళూరు,ఆగస్టు 2:** లైంగిక దాడి కేసులో మాజీ ఎంపీ, హెచ్‌డీ దేవేగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణకు కోర్టు జైలు శిక్షఖరారు చేసింది. ఆయనకు జీవితై ఖైదు విధిస్తూ తీర్పును వెలువరించింది. ఓ తనపై అత్యాచారం చేసి బెదిరింపులకు పాల్పడినట్లు మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రజ్వల్ రేవణ్ణను ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చింది. శనివారం ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్ రేవణ్ణపై నాలుగు అత్యాచార కేసులు ఉన్నాయి. ఈ కేసులో ప్రజ్వల్ ఇప్పటికే 14 నెలలుగా జైలు జీవితం గడిపారు. మైసూర్‌లోని కేఆర్‌ఎస్ నగర్‌కు చెందిన పని మనిషిపై అత్యాచారం కేసులో ప్రజ్వల్‌ను దోషిగా తేలుస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ తీర్పును వెలువరించారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది జగదీష్ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ చర్య నీచమైందని, జీవనోపాధి కోసం పని కోసం వచ్చిన చదువు రానివారిపై దారుణ చర్యకు పాల్పడ్డాడని, వీడియోలు చిత్రీకరించడం బాధితురాలిని మానసికంగా కూడా హింసించడమేనని,ఓ దశలో బాధితురాలు ఆత్మహత్యకు ప్రయత్నించిందని కోర్టుకు తెలిపారు. ప్రజ్వల్‌పై మరో మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాదనలు వినిపించారు. ప్రజ్వల్ రాజకీయాల్లోకి కేవలం డబ్బు కోసమే రాలేదని, ప్రజ్వల్ ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు వీడియోలు దురుద్దేశంతో లీక్ చేశారని, అతని రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసేందుకు ఈ చర్యకు పాల్పడ్డారంటూ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ ఏడాది జైలులో ఉన్నాడని, ఈ కేసుతో అతనికి తీవ్రమైన నష్టం జరిగిందని తెలిపారు.

అత్యాచారం కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ మనవడు.. హాసన్ నియోజకవర్గానికి చెందిన జనతాదళ్ పార్టీ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో శిక్షకు సంబంధించిన తుది తీర్పును కోర్టు నేడు వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని వేడుకుంటూ ఆయన ముందు బిగ్గరగా ఏడ్చినట్లు తెలిసింది. హాసన్ జిల్లాలోని హూలే నరసిరపురలోని గన్నికాడ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న 48ఏండ్ల పనిమనిషిపై రేవణ్ణ కొవిడ్ సమయంలో 2021లో రెండుసార్లు లైంగిక దాడి చేశారు. అంతేకాక ఆ దారుణాన్ని మొబైల్ ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. రేవణ్ణ 2024 లోక్‌సభ ఎన్నికల్లో హాసన్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆయన తరఫున ప్రధాని నరేంద్రమోదీ కూడా ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో మహిళలపై ప్రజ్వల్ సాగించిన లైంగిక దాడులకు సంబంధించిన వీడియోలు బయటకు రావడం, విస్తృతంగా ప్రచారం కావడం కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో రేవణ్ణపై లైంగిక దాడి, లైంగిక వేధింపులు తదితర నాలుగు వేర్వేరు కేసులను సిట్ నమోదు చేసింది. అప్పటికే ఆయన జర్మనీకి పారిపోయారు. జర్మనీ నుంచి వచ్చిన ఆయనను గత ఏడాది మే 31న అరెస్ట్ చేయడంతో గత 14 నెలలుగా ఆయన జైలులోనే ఉన్నారు. విచారణలో ఫోరెన్సిక్ నివేదికలు కూడా ఆ వీడియోలో ఉన్నది ప్రజ్వలే అని నిర్ధారించాయి. హాసన్ ఎంపీ సీట్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమైన రేవణ్ణను తర్వాత పార్టీ నుంచి సస్పెండ్‌చేశారు. పనిమనిషిపై అత్యాచార ఘటనేకాదు, ఆయనపై అశ్లీల వీడియోల కేసులు నమోదు అయ్యాయి. హాసన్‌లోని అతని ఫామ్ హౌస్‌నుంచి 2,900 వీడియోలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆయనపై మూడు కేసులు నమోదయ్యాయి.

## విచారించేందుకు జైలుకు వస్తే.. దుస్తులిప్పేసి యూన్ సుక్ నిరసన




**సియోల్, ఆగస్టు 2:** అనూహ్యంగా ఎమర్జెన్సీ ప్రకటించి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ జైలు పాలయ్యారు. ఆయనపై పలు కేసులు నమోదవగా అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ కేసులకు సంబంధించి విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరిస్తూనే ఉన్నారు. తాజాగా ఆయనను ప్రశ్నించేందుకు అధికారులు మరోసారి జైలుకు రాగా వారి ముందు దుస్తులు విప్పేసి అర్ధనగ్నంగా నేలపై పడుకున్నారు. ఎమర్జెన్సీ వివాదంతో ఈ యేడాది ఏప్రిల్‌లో యూన్ సుక్ యోల్ అభిశంసనకు గురై పదవి నుంచి దిగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనపై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. దీంతో గత నెల ఆయనను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన సియోల్‌లోని ఓ జైలులో ఉన్నారు. అవినీతి కేసుల్లో ఆయనను విచారించాలని కొత్త అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఆదేశించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక అధికారుల బృందం కోర్టు నుంచి డిటెన్షన్ వారెంట్ తీసుకొని జైలుకు చేరుకుంది. విచారణకు స్వచ్ఛందంగా రాకపోతే బలవంతంగానైనా ఆయనను డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్లేందుకు న్యాయస్థానం నుంచి అధికారులు అనుమతి తీసుకున్నారు. అయినప్పటికీ విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరించారు. అధికారులు రాగానే మాజీ అధ్యక్షుడు జైలు యూనిఫామ్ తొలిగించి అర్ధనగ్నంగా నేలపై పడుకొని నిరసన తెలిపారు. దీంతో చేసేదేంలేక,అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు.

## ఆమె ఓ మెషీన్‌గన్.. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు

**వాషింగ్టన్, ఆగస్టు 2:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. న్యూస్‌మాక్స్‌లో రాబ్ ఫిన్నెర్టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ అమెరికాకు అధ్యక్షుడిగా సేవలు అందించిన అందరూ అధ్యక్షుల్లో తనకు మాత్రమే అద్భుతమైన, ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఉందని అన్నారు. కరోలిన్ లీవిట్ మెషీన్‌గన్‌లా పని చేస్తూ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. అందం, హుందాతనంతో ప్రజల్లో ఓ స్టార్‌గా మారిపోయిందని పేర్కొ న్నారు. కరోలిన్ మాట్లాడేటప్పుడు ఆమె పెదాల కదలిక చాలా అందంగా ఉంటుందని పొడిగారు. అదే ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 2016 ఎన్నికల్లో తాను విజయం సాధించిన తర్వాత తన పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.



మరోవైపు కరోలిన్ లీవిట్ కూడా అమెరికా అధ్యక్షుడిపై ప్రశంసలు గుప్పించారు. ట్రంప్ ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన నేత అని కొనియాడారు. ఆయన భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణసహా ప్రపంచవ్యాప్తంగా థాయ్‌లాండ్-కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్-ఇథియోపియా, రువాండా-కాంగో డెమోక్రాటిక్ రిపబ్లిక్ వంటి అనేక యుద్ధాలను ముగించారన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకుగాను ఆయనకు నోబెల్‌శాంతి పురస్కారాన్ని అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## బోగస్ ఆధార్‌తో బంగ్లా నటి శాంతాపాల్ అరెస్టు

**కోల్‌కత్తా,ఆగస్టు 2:** నకిలీ పాస్‌పోర్టుతో భారత్‌లోకి వచ్చిన బంగ్లాదేశ్ నటి శాంతా పాల్(28)ని కోల్‌కత్తా డిటెక్టివ్‌పోలీసులు అరెస్టుచేసారు. అక్రమ విధానాల్లో భారతీయ ఓటరుకార్డు, ఆధార్‌కార్డులు పొందినట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. ఆమె విచారణలో చేసిన వ్యాఖ్యలు పొంతన లేకుండా ఉన్నాయని, అందుకే మళ్లీ సమగ్ర దర్యాప్తు చేస్తామని కోల్‌కత్తా పోలీసులు వివరించారు. ఈకేసులో ఆమె స్నేహితుడు సుమన్ చంద్రశీల్‌ను కూడా అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. విచారణలో ఆతడి ఎరును నటి వెల్లడించింది. అయితే దేశ సమాచారాన్ని మరే ఇతర దేశానికయినా పంపిస్తున్నదా అన్న కోణంలో కూడా దర్యాప్తుచేసారు. చూడటానికి మంచి విలాసవంతమైన జీవన శైలిలో ఉంటూ నాథూలాపాస్ వంటి కీలక ప్రాంతాల్లోకి కూడా వెళ్లింది. భారత్ చైనా సరిహద్దు, దిఘా, గ్యాంగ్‌టక్ వంటి ప్రాంతాల్లో ఆమె రీల్స్‌చేసింది. బంగ్లాదేశ్‌లోని బరిసాల్‌కు చెందిన ఆమె జాదవ్‌పూర్‌లో 2023నుంచి ఒక అద్దె అపార్టుమెంట్‌లో నివసిస్తోంది.ఆమెకు రెండు ఆధార్‌కార్డులున్నాయని చెపుతున్నారు. మొదటి ఆధార్ 2020లో ఉంటే అందులో జమ్ముకాశ్మీర్‌లోని బుర్ద్వాన్‌నుంచి తీసినట్లు చిరునామా ఉంది. మరో కార్డులో కోల్‌కత్తా అడ్రస్ ఉందని అధికారులు గుర్తించారు. ఆమె స్నేహితుడు చంద్రశీల్‌కోసం గాలింపు ప్రారంభించారు. నటి బ్యాంకు ఖాతాలను కూడా వివరాలు రాబట్టారు. బ్యాంకురుణం పొందేందుకు ఆమె బోగస్ పత్రాలుకూడా సమర్పించిందని చెపుతున్నారు. శాంతాపాల్ అనేక మోడలింగ్ పోటీల్లో కూడా పాల్గొంది. టాలివుడ్‌లో ఆమె ఒక చిత్రంలో పనిచేస్తోంది. మరో మూవీకోసం టాలివుడ్ నటుడితో సంప్రదింపులు జరుపుతున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు.

# అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్



**జమ్ము, ఆగస్టు 2:**రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జమ్ముకశ్మీర్‌లోనూ కుండపోత వర్షాలతో పలు నదులు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీనితో ఎంతో కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహిస్తున్న అమర్‌నాథ్‌యాత్రకు తాత్కాలిక బ్రేక్‌లు పడక తప్పడంలేదు. ఈ వర్షాలకు అమర్‌నాథ్ యాత్రకు మళ్లీ తాత్కాలిక బ్రేక్ పడింది. కశ్మీర్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను ఆగస్టు 3 వరకూ నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధురి ప్రకటించారు. పహల్గాం, బల్తాల్‌ఉంగా భక్తులను అనుమతించట్లేదని వెల్లడించారు. భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారికి నిర్వహణ అవసరంకావడంతో ఆ మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు తెలిపారు.

## బాత్‌రూమ్‌లో జారిపడ్డ జార్ఖండ్ మంత్రి



**రాంచి,ఆగస్టు 2:** జార్ఖండ్ మంత్రి ఒకరు ప్రమా దవశాత్తూ బాత్రూమ్‌లో జారి పడ్డారు. దీంతో బ్రెయిన్ ఇంజురీ(మెదాడుకు గాయం) తో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం మంత్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్ శనివారం ఉదయం తన ఇంట్లోని బాత్రూమ్‌లో జారిప డ్డారు. దీంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు మంత్రిని హుటాహుటిన జంషెడ్‌పూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంత్రి మెదడులో రక్తం గట్టకట్టినట్లు వైద్యులు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన్ని ఢిల్లీ ఆస్పత్రికి తరలించినట్లు జార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ తెలిపారు. మరోవైపు రాందాస్ సోరెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బీజేపీ సీనియర్ నాయ కుడు, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తెలిపారు.

## ఎన్నికల్లో బూత్‌లెవల్ అధికారులకు పారితోషికం రెట్టింపు

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలు, గౌరవభృతిని సవరించింది. 2015 తర్వాత ఈసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలను సవరించడం ఇదే తొలిసారి. తాజా సవరణ ప్రకారం బూత్ లెవల్ అధికారుల పారితోషికాన్ని ఈసీ ఏకంగా రెండింతలు చేసింది. 2015 నుంచి ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులకు పారితోషికంగా రూ.6 వేలు ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.12 వేలు చేసింది. అదేవిధంగా ఓటర్ల జాబితాను సరిచూసినందుకు బీఎల్‌వోలకు గతంలో రూ.1000 ఇన్సెంటివ్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ ఇన్సెంటివ్‌ను రూ.2వేలకు పెంచారు. ఇక బీఎల్‌వో సూపర్‌వైజర్లకు గతంలో రూ.12 వేలు పారితోషికంగా ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.18 వేలు చేశారు.

ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు గతంలో ఎలాంటి గౌరవభృతి ఇచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు ఈఆర్‌వోలకు రూ.25 వేలు, ఏఈఆర్‌వోలకు రూ.30 వేలు గౌరవభృతి ఇవ్వనున్నారు.అదేవిధంగా బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో జరిగిన ఓటర్ల జాబితా అత్యవసర సవరణ కోసం పనిచేసిన బూత్‌లెవల్ అధికారులకు కూడా ఎన్నికల సంఘం రూ.6 వేలు ప్రత్యేక ఇన్సెంటివ్‌గా ప్రకటించింది.

## ఓటర్ల జాబితా ముసాయిదాలో నా పేరు లేదు: తేజస్వియాదవ్

### పాతనంబరుతో చెక్ చేసుకుని ఉంటారన్న ఎన్నికల సంఘం!

**పాట్నా, ఆగస్టు 2:** బీహార్‌శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ స్పందిస్తూ ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా ఇపిఐసి నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కనిపించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్‌లెవల్ అధికారి నా వద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు అని తేజస్వి వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20 వేల మంది నుంచి 30 వేల వరకు ఓటర్లను తొలగించారని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. అయితే తేజస్వియాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడి నేత బహుశా తన పాత ఇపిఐసి నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కనిపించకపోయి ఉండవచ్చని ఇసి తెలిపింది. ఓటర్ల జాబితా



ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవటంతో ఇసి ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబర్ 1 వరకు ఇసి గడువు కల్పించింది. బీహార్‌లో ఈ యేడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

## పిఓకెలో 15పాక్ ఉగ్రశిబిరాలు: దాయాదిదేశం కొత్త వ్యూహం

### నిఘాకంటికి చిక్కకుండా సరిహద్దుల్లో నిర్మాణం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను మరోసారి పెంచేందుకు పాక్ భారీ వ్యూహాలు రచించిందని నిఘా వర్గాలకు సమాచారం అందింది. గత ఫిబ్రవరి నెలలో జరిగిన పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ చేబట్టిన ఆపరేషన్ సింధూర్ వల్ల పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం కావడం, పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమవడం తెలిసిందే. ఆపరేషన్ సింధూర్‌లో పిఓకెలోని బవహల్‌పూర్‌లో గల జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయం, మురిద్కేలోని లష్కర్ ఏ తోయిబా శిక్షణా కేంద్రం సహా పలు ఉగ్రవాదసంస్థల కార్యాలయాలు, ఆయుధ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. దీంతో తాత్కాలికంగా కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు బ్రేక్ ఇచ్చిన పాక్ తాజాగా మళ్లీ వీటిని పునరుద్దరించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 15ఉగ్రవాద శిబిరాలను నెలకొల్పింది. ఈ శిబిరాలు పిఓకెలో పాక్ మిలటరీ కేంద్రాలకు అతి సమీపంలో వున్నాయని నిఘా వర్గాలకు సమాచారం అందింది. చూసేందుకు ఉగ్రవాద శిబిరాలు కూడా మిలటరీ కేంద్రాలుగా భావించే విధంగా వున్నట్లు కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) కూడా నిర్ధారించింది. తాజాగా ఏర్పాటైన ఉగ్రవాద శిబిరాలు ఇదివరకు వున్న చోట కాకుండా పిఓకెలోని సైనిక స్థావరాలకు అతి సమీపంలో వున్నాయని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ శిబిరాలు భారత నిఘా వర్గాల రాడార్లకు చిక్కకుండా నూతన టెక్నాలజిని వాడి నిర్మించినట్లు తేలింది. ఇక ప్రతి శిబిరంలో 20 నుంచి 25 ఉగ్రవాదులు వుండే విధంగా జాగ్రత్త పడుతున్నారు. ఈ శిబిరాలలో లష్కర్ ఏ తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రవాద సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది.



## విమానంలో చెంపదెబ్బ తిన్న ప్రయాణికుడు అదృశ్యం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడు, మరో ప్రయాణికుడిపై భౌతిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో విమానంలో చెంపదెబ్బ తిన్న ప్రయాణికుడు అదృశ్యమైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులు తెలిపినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. చెంపదెబ్బ తిన్న వ్యక్తి అస్సాంలోని కాచార్ జిల్లాకు చెందిన హుస్సేన్ అహ్మద్ మజుందార్‌గా అతడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం అతడు ఇంటికి రాలేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. హుస్సేన్ ముంబయిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. పలుమార్లు ఇదే మార్గంలో ఇంటికి వచ్చేవాడు. ఎప్పటిలాగానే అతడి కోసం ఎయిర్‌పోర్టుకు వెళ్లాం. అయితే అతడు కనిపించలేదు. ఆ తర్వాత వైరల్ అయిన వీడియో ద్వారా గొడవ తెలిసింది. తర్వాత హుస్సేన్ ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినప్పటికీ తెలియలేదు అని హుస్సేన్ తండ్రి అబ్దుల్ మన్నన్ మజుందార్ పేర్కొన్నారు. విమానాశ్రయంలోని కేంద్రపారిశ్రామిక భద్రతాదళం అధికారులకు సమాచారం ఇచ్చామని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.




# 19వ పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని మోడీ

## 9.7 కోట్ల మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ

**వారణాసి,ఆగస్టు 2:** దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులకు ప్రధాని నరేంద్ర మోడీ శుభవార్త అందించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 20వ విడత ఆర్థిక సాయాన్ని శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని, వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడతలో భాగంగా సుమారు 9.7 కోట్ల మంది అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,500 కోట్లు జమ అయ్యాయి. రైతులకు పంట పెట్టుబడి ఖర్చుల భారాన్ని తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏటా రూ.6,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో, అంటే ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2,000 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. తాజా విడుదలతో అన్నదాతలకు వ్యవసాయ పనుల కోసం కీలకమైన పెట్టుబడి సాయం అంది నట్లయింది. ఈ పథకం కింద 19వ విడత నిధులను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసింది. ఆ సమయంలో బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో దాదాపు 9.8 కోట్ల మంది రైతులకు రూ.22 వేల కోట్లకు పైగా సాయాన్ని అందించింది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 19 విడతల్లో సుమారు 11 కోట్ల మంది రైతులకు రూ.3.46 లక్షల కోట్లకు పైగా ఆర్థిక చేయూత లభించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల సహారకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. మోడీ మాట్లాడుతూ, మీరు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు. మీ సంక్షేమం కోసం మేం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. రైతులకు నగదు విడుదల చేసిన సందర్భంగా మరో పథకం గురించి కూడా మోడీప్రస్తావించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన. ఈ పథకం ద్వారా పంటకు నష్టం జరిగితే బీమా సంస్థ పరిహారం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు రైతులకు రూ.1.75 లక్షల కోట్లకు పైగా విలువైన క్లెయిమ్‌లు ఇచ్చినట్లు ప్రస్తావించారు. పంట బీమా తీసుకోని వారు వెంటనే తీసుకోవాలన్నారు.

## అణు జలాంతర్గాముల మొహరింపునకు ట్రంప్ ఆదేశం



**వాషింగ్టన్, ఆగస్టు 2:** రష్యాకు చేరువలోని సముద్రజలా ల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరిం చాలని తమ నౌకాదళాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఆదేశించారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ చేస్తున్న హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఈ చర్యను చేప ట్టినట్లు ఆయన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. 'ఒకవేళ ఆ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ము ఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణ మాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాం టివి జరగవని ఆశిస్తున్నా' అని తెలిపారు. ఉక్రె యిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజు ల్లో ముం దు కు రావాలని ట్రంప్ రష్యా కు హెచ్చరిక చేసిన నేప థ్యంలో మె ద్వదేవ్ స్పందించారు. రష్యా వద్ద సోవియట్ హయాంనాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణుల ఉత్పత్తిని ప్రారంభించామని రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం తెలిపారు. వాటిని తమ సైన్యంలో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

# సంక్షిప్తంగా..

## హాస్టల్ పైనుంచి దూకి ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య



**ముంబై, ఆగస్టు 2:** మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటి బాంబేకు చెందిన విద్యార్థి హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో మరో విద్యార్థి అక్కడ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఢిల్లీకి చెందిన రోహిత్ సిన్హా (26) ఐఐటి బాంబేలో చదువుతున్నాడు. మెటలర్జికల్ ఇంజినీరింగ్,మెటీరియల్స్ సైన్స్ కోర్సు నాలుగో సంవత్సరంలో ఉన్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున 2.30గంటల సమయంలో హాస్టల్ భవనం టెర్రస్ పైనుంచి రోహిత్‌సిన్హా కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోహిత్ ఆత్మహత్యపై కేసు నమోదు చేశారు.అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

## జమ్ములో మరో ఎన్‌కౌంటర్, కీలక ఉగ్రవాది హతం

**జమ్ము, ఆగస్టు 2:** జమ్మూ కశ్మీర్‌లో మన భద్రతా బలగాలు మరోసారి తమ శక్తిని చూపించాయి. కుల్గాం జిల్లాలోని అఖల్ ప్రాంతంలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మన సైన్యం ఒక కీలక ఉగ్రవాదిని హతమార్చింది. దక్షిణ కశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో కొంతమంది ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కలిసి ఒక సంయుక్త ఆపరేషన్‌ను ప్రారం భించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా వారు అఖల్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చర్యలు చేపట్టారు. ఈ గాలింపు సమయంలో ఉగ్రవాదులు హఠాత్తుగా భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. మన సైనికులు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. వారు వెంటనే ప్రతిస్పందించి, ఒక ఉగ్రవాదిని హతమార్చారు. మరో ఇద్దరి నుంచి ముగ్గురు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో దాక్కుని ఉన్నారని అనుమానం ఉంది. ఈ క్రమంలో భద్రతా దళాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## మలయాళ నటుడు కళాభవన్ నవాస్ మృతి



**కొచ్చి,ఆగస్టు 2:** ప్రముఖ మలయాళ నటుడు, మిమిక్రీ కళాకారుడు కళాభవన్ నవాస్ (51) కొచ్చిలో నిన్న గుండెపోటుతో మరణించారు. 'ప్రకంబణం' అనే సినిమా షూటింగ్ నిమిత్తం చోటానికరలోని ఒక హోటల్‌లో బస చేసిన ఆయన, షూటింగ్ పూర్తయిన తర్వాత తన గదిలో అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటు కారణంగానే ఆయన మరణించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరణానికి కచ్చితమైన కారణం తెలుసుకోవడానికి నేడు కలమస్సేరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించనున్నారు. నిన్న సాయంత్రం 5.30 గంటలకు షూటింగ్ ముగించుకుని హోటల్‌కి వచ్చిన నవాస్, రెండు రోజుల విరామం ఉన్నందున ఇంటికి వెళ్లాలని అనుకున్నారు. అయితే, చెక్‌అవుట్ సమయానికి ఆయన గది నుంచి బయటకు రాకపోవడంతో, సిబ్బంది తలుపు తెరిచి చూడగా ఆయన స్పృహ కోల్పోయి ఉన్నారు. నవాస్ 1974లో కేరళలోని వడక్కంచెరిలో జన్మించారు. ఆయన తండ్రి అబూ బక్కర్ కూడా నటుడే.

## కేరళ క్రైస్తవ నన్స్‌కు షరతులతో బెయిల్



**నయారాయ్‌పూర్, ఆగస్టు 2:** మానవ అక్రమ రవాణాకు, బలవంతపు మత మార్పిడిలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో గత వారం ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన ఇద్దరు కేరళ సన్యా సినిలకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి చెందిన ప్రత్యేకకోర్టు షరతులతో కూడిన బెయిల్ మం జూరు చేసింది. అందుకు ఇద్దరు సన్యాసినిలు వారి పాస్‌పోర్టులను సరెండర్ చేయాలని, ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున పూచీకత్తు పెట్టాలని, ఒక్కొక్కరికి ఇద్దరు వ్యక్తుల చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు షరతులు విధించింది. కాగా కేరళకు చెందిన ఆ ఇద్దరు సన్యాసినిలు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడి చేయించేం దుకు ప్రయత్నించారని బజరంగ్‌దల్, హిందూ వాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో గత నెల 25న పోలీ సులు ఆ ఇద్దరు సన్యాసినులను అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం సన్యాసినిలు ముందు దుర్గ్‌లోని సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే వారి బెయిల్‌పిటిషన్‌లను సెషన్స్‌కోర్టు తోసిపుచ్చింది.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం అజెండా: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 2, ప్రభాతవార్త :** రైతులకు సహాయం భారం కాదు.. బాధ్యతగా గుర్తించిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అని , తెలుగుదేశం పార్టీ జెండాలోనే నాగలి ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని పీవీఆర్ కళ్యాణ మండపంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పాటుపడడం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కోవూరు నియోజకవర్గంలో 16938 రైతులకు వారి వారి ఖాతాల్లో 11,06,94000 రూపాయలు జమ కావడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా తొలి విడతగా రైతుల ఖాతాల్లో 7 వేలు నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. అర్హతగా ఉండి అన్నదాత సుఖీభవ అందని రైతులు ఏదైనా సాంకేతిక సమస్యల కారణంగా తమ ఖాతాలో డబ్బులు జమ కాకుంటే స్థానిక నాయకులు, వ్యవసాయాధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు సహాయ పడాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, యంత్ర పరికరాలను అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతులకు 12,500 ఇస్తామని ప్రకటించి కేవలం 7500 మాత్రమే ఇచ్చిందన్నారు. గతంలో ధాన్యం అమ్మిన డబ్బులు కోసం రైతులు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఉండేదని కూటమి ప్రభుత్వం వచ్చాక 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 18 ఏళ్ల తర్వాత జూలై నెలలోనే ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయన్నారు. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టు జులై నెలలోనే రెండు సార్లు నిండిపోయిందన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసి 2026 చివరికల్లా వెలిగొండ, 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో డ్రిప్ ఇరిగేషన్ రంగం నాల్గవ స్థానంలోకి పడిపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ దేశంలో మొదటి స్థానంలో ముఖ్యమంత్రి నిలబెట్టారన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి జీవితాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా 3826 కోట్లు పంట రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నెలలోనే మరో సూపర్ సిక్స్ హామీకి ముఖ్యమంత్రి శ్రీకారం చుడుతున్నారన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చి ఆ హామీని నెరవేరుస్తున్నారన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై రోజురోజుకూ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు భారీ చెక్కును అందజేశారు. అనంతరం రైతులకు శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానం చేశారు.

## బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి 13న సిఎం చంద్రబాబు శంకుస్థాపన

### హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

**విజయవాడ,ఆగస్టు 2,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోబసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేసినట్టు ఆ సంస్థ అధినేత,ఎంఎల్ఏ నందమూరి బాలకృష్ణ తెలిపారు.ఈ ఆస్పత్రి నిర్మాణానికి ఈ నెల 13న సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని తుళ్లూరు మండలం.అనంతవరంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటించారు. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల భూమిని ఆయన స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బాలకృష్ణ మాట్లాడుతూ భగవంత్ కేసరి సినిమాకి ఉత్తమ తెలుగు చిత్రం విభాగంలో జాతీయ అవార్డు రావడం గర్వకారణమని చెప్పారు. మహిళా సాధికారతపై బలమైన సందేశం ఇచ్చే చిత్రంగా భగవంత్ కేసరి నిలిచిందని పేర్కొన్నారు.

## నేటి నుంచి ఎన్ఎస్ యులో భాషోత్సవ జాతీయ సదస్సు

**- వర్సిటీలో 14వరకు దేస్ స్కాలర్స్ కు స్పాట్ అడ్మిషన్లు - ఈ యేడాది వర్సిటీలో ఐకేఎస్ నూతన కోర్సు ప్రారంభం - మీడియాతో విసి జీఎస్ఆర్ కృష్ణమూర్తి**



**తిరుపతి విద్య ఆగస్టు 2 ప్రభాత వార్త** జాతీయ సంస్కృత వర్సిటీ,ఉత్కల పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ప్రస్థానత్రయంలో భాషోత్సవం పేరుతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు.శనివారం వర్సిటీలో ఆయన " మీడియాతో మాట్లాడుతూ సంస్కృత విద్యాపీఠం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ విశ్వవిద్యాలయంగా అవతరించిందన్నారు. వర్సిటీలో ఎన్ఈపి2020 విధానాన్ని అమలు చేస్తూ పలు నూతన కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. డిగ్రీ ఆనర్స్ తో పాటు రీసెర్చ్ ఓరియెంటెడ్ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు నడుపుతున్నామన్నారు.అలాగే వర్సిటీలో యూజీ,పీజీ కోర్సులలో పదుల సంఖ్యలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 14వ తేదీ వరకు కేవలం దేస్కాలర్స్ కి స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు.స్థానిక విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాటే ఎన్ ఎస్ యూలో ఈ ఏడాది నుంచి యూజీ, పీజీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) కోర్సును నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.వర్సిటీలో నిర్మించిన శ్రీ స్వామినారాయణ సంప్రదాయ అక్షరపురుషోత్తమ మందిరాన్ని సైతం ఆదివారం జాతీయ సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు ఆవిష్కరిస్తారని తెలిపారు.అలాగే సదస్సుకు వీసీలు, ఒరిస్సా గవర్నర్,ఉత్తరాఖండ్ సీఎం హాజరవుతారని చెప్పారు.అలాగే స్వామి నారాయణ సంప్రదాయ సంస్థలతో విశ్వవిద్యాలయం పరస్పర అవగాహనా ఒప్పందం చేసుకుని అమెరికా,ఇగ్లండ్, అబుదబి,నేపాల్లో ఉన్నటువంటి సంస్థలతో కలసి విశేష పరిశోధనలు జరపనున్నట్లు తెలిపారు.

## వివిధ సమస్యలపై 7 నుంచి దశల వారి ఆందోళన

### డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జెఎసి

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ సమస్యలపై దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జేఏసీ పిలుపునిచ్చింది. ఈనెల 7న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, 11వ తేదీ నుంచి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, 18న విజయవాడలోని ధర్నాకు హాజరుకావాలని లెక్చరర్లను కోరింది.‘ఎన్నిసార్లు అడిగినా డిగ్రీ అధ్యాపకుల బదిలీలు చేపట్టడంలేదు. గతంలో ఎయిడెడ్ కాలేజీలకు గ్రాంట్ నిలిపివేసినప్పుడు జీవో 42 తీసుకొచ్చిన ప్రభుత్వ లెక్చరర్ పోస్టుల్లో ఎయిడెడ్ లెక్చరర్లను నియమించింది. అనంతరం ఎయిడెడ్ కాలేజీలకు గ్రాంట్ పునరుద్ధరించినా వారిని అక్కడే కొనసాగిస్తోంది. దీనిపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా స్పందించలేదు' అని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 26 రాష్ట్రాల్లో డిగ్రీ అధ్యాపకులను అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లుగా మార్చారని, ఏపీలో ఇప్పటికీ అధ్యాపకులుగానే కొనసాగిస్తున్నారని తెలిపారు.

## దేశంలోనే విశిష్ట నమూనాగా ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ

### స్నాతకోత్సవంలో ప్రభుత్వ గౌరవ సలహాదారు డా. సతీష్‌రెడ్డి



**సత్యవేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఇండస్ట్రియల్ కేంద్రం నడుమ ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ వంటి జాతీయ విద్యా సంస్థ ఏర్పాటు కావడం, దేశంలోనే ఓ విశిష్ట నమూనాగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు(ఏరోస్పేస్, డిఫెన్స్) డాక్టర్ జి.సతీష్ రెడ్డి వ్యాఖ్యనించారు. ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ 2025(9వ బ్యాచ్) స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 318 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తికేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గవర్నింగ్ బోర్డు సభ్యుడు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ట్రిపుల్ ఐటీ-తిరుపతి డైరెక్టర్ డాక్టర్ కె.ఎన్.సత్యనారాయణ, ఇతర సెనేట్ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. సతీష్‌రెడ్డి స్నాతకోత్సవ ప్రసంగంలో ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ కోయంబత్తూరు టెక్స్‌టైల్స్ క్లస్టర్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉంది. ఇక్కడ విద్యాసంస్థ, పరిశ్రమ కలసి అభివృద్ధి చెందుతాయి. ఈ వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఉపయోగించుకోవాలని, వికసిత్ భారత్‌ను నిర్మించడంలో అందరూ భాగస్వాములు కావాలని, ఆవిష్కరణ, పరిశోధన, పరిశ్రమ స్థాపన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ స్నాతకోత్సవంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో 309 మందికి బీటెక్ పట్టాలను, 9 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో 18మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు ప్రదానం చేయగా, మరో ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో పట్టభద్రులు తమ అధ్యాపకులను, స్నేహితులు, జూనియర్లను ఆత్మీయంగా కలసి గత స్మృతులను స్మరించుకున్నారు.

## ఉమ్మడి పాలమూరులో 8 మంది పంచాయతీ సెక్రెటరీల సస్పెన్షన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎనిమిది మంది పంచాయతీ సెక్రెటరీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే..వనపర్తి జిల్లా పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు విధులకు హాజరయ్యే సమయానికి ఇష్టానుసారంగా వ్యవహరించడం పట్ల జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పంచాయతీ సెక్రెటరీలను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పలుమార్లు ఫేక్ అటెండెన్స్ చేయొద్దని ఫిజికల్‌గా ఉండి ఫొటో అప్లోడ్ చేయాలని ఎన్నోసార్లు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని గతంలో ఉన్నటువంటి యాప్ పాత పద్ధతి ప్రకారంగానే ఫోటో క్యాప్చరింగ్ చేసి అప్లోడ్ చేస్తున్నారని అలా చేయొద్దని కొత్తగా వచ్చిన యాప్‌లో ఫేక్ అటెండెన్స్ చేసినట్లయితే తెలిసిపోతుందని పలుమార్లు హెచ్చరించిన జిపి సెక్రెటరీ మానకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఏదుల మండలం రేకులపల్లి తండా, గోపాల్పేట్ మండలం ఏదుట్ల గ్రామం, పానగల్ మండలంలోని షాగాపూర్ తాండ, పెబ్బేరు మండలంలోని కొత్త సూగురు గ్రామపంచాయతీ. మదనాపూర్ మండలంలోని గోవన్ పేట్, అమరచింత మండలంలోని నందిమల్ల జిపి సెక్రటరీతో కలిపి ఆరుగురిపై సస్పెన్షన్ వేటు పడినట్లు డిపిఓ తెలిపారు. అదేవిధంగా నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తెలిపారు.

## శ్రీకాళహస్తి రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించండి:

### కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి



కేంద్ర మంత్రికి కలంకారి కళాఖండాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక చింతనతో పాటు కళల్లో కూడా రాణిస్తుందని ఇందుకు నిదర్శనం 'కలంకారి కళ' అని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ కేంద్ర రహదారులు,భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కారికి వివరించారు. శనివారం కేంద్ర మంత్రిని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కలసి వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రోజు రోజుకు ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు.ఈ ఆలయానికి నిత్యం తమిళనాడు నుంచి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు.అంతేకాక చెన్నై విశాఖ కారిడార్ వెళుతుందని అయితే తడ-శ్రీకాళహస్తి మధ్య సింగిల్ రోడ్డు ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని మంత్రికి వివరించారు. ఈ మర్గాన్ని ఆరు లేన్ల నిర్మాణంతో పాటు జాతీయ రహదారిగా మార్చాలని అభ్యర్థించారు. కాగా నాయుడుపేట-రేణిగుంట ఆరు లేన్లు చేయటంతో తిరుపతి-శ్రీకాళహస్తి రాకపోకలకు అంతరాయంగా ఉందని కాబట్టి తిరుపతి-రేణిగుంట-శ్రీకాళహస్తి మధ్య ప్రత్యేక రోడ్డును మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని అభ్యర్థిస్తూ వినతి పత్రాన్ని అందించారు. శ్రీకాళహస్తిలో హస్తకళలకు నిలయమని ఇక్కడి కలంకారి కళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని ఎంఎల్ఏ మంత్రికి వివరించారు. కాబట్టి ఇక్కడి కలంకారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుటకు మంత్రిని కోరారు.ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. కలంకారి కళ ప్రచారానికి పార్లమెంటు సమావేశాల్లో మహిళా ఎంపిలు కలంకారి చీరలు, మగ ఎంపిలు కలంకారి కండువాలను ధరించి హాజరైతే ప్రచారం ఉంటుందని మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా కలంకారి కళాఖండాన్ని మంత్రికి సమర్పించారు.

## సింగరేణి బొగ్గుగనుల్లో గోడ కూలి కార్మికుడి మృతి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** సింగరేణి బొగ్గుగనుల్లో తీవ్ర విషాదం జరిగింది. సైడ్ గోడ కూలి ఓ కార్మికుడు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోల్‌మైనింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాచపల్లి శ్రవణ్ కుమార్ (32) మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే 5 గనిలో సెకండ్ షిఫ్ట్‌లో సైడ్ గోడ కూలిపోయి బొగ్గుపెల్లలు పడడంతో కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు అప్రమత్తమై రామకృష్ణాపురంలోని ఆస్పత్రికి తరలించగా... అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు.అధికారుల నిరక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, శ్రవణ్ మృతి చెందాడని పలు యూనియన్లు మండిపడ్డాయి.

# దుర్గమ్మవారి సేవలో కేంద్రమంత్రి గడ్కరి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 2, ప్రభాతవార్త** దుర్గమ్మ వారిని శనివారం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎంపిలు సిఎం రమేష్, టి కృష్ణ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్య కుమార్ యాదవ్, బిసి జనార్ధనరెడ్డి, ఎమ్మెల్యే డా పార్ధసారధి, ఏపి బిజెపి నేత పి మాధవ్, టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాష్, ఇతర బిజెపి నేతలు కూడా దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ ఆలయంలో జరిగే ఉచిత ప్రసాదం పంపిణీకి రు.1,01,116లను గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బి విశ్వనాథ శాస్త్రి, మహాలక్ష్మి దంపతులు విరాళంగా శనివారం అందించారు. వరంగల్‌కు చెందిన ఎం జయలక్ష్మి కుటుంబీకులు రు.1,01,116ల విరాళాన్ని ఆలయాధికారులకు అందించారు. దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# అలిపిరి 'ఆర్చి'పై అసత్యాలు!

### - పాతరంగులున్న ఆర్చితో హల్‌చల్



**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాత వార్తప్రతి నిధి:** ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొన్ని వందల సంవత్సరాల క్రిందట నిర్మించిన అలిపిరి ప్రధాన ప్రవేశమార్గం ఆర్చిపై భాగంలో గంధర్వులు పుష్పమాలలు చేతబట్టిన రూపంలో ఉన్నవాటిని "అన్యమతబొమ్మలు" గా ఇప్పుడు అసత్యాలు ప్రచారం జరిగింది. అసలు ఎవరూ ఊహించని రీతిలో అక్కడ ఎలాంటి మార్ఫింగ్ చేయడానికిగానీ, ఇతరులు ఎవరూ కనీసం గుర్తులు చెరిపివేయడానికి గానీ అవకాశం లేదు. 24గంటలూ నిఘా నేత్రాల పర్యవేక్షణతోబాటు విజిలెన్స్ సిబ్బంది పహారా ఉంటుంది. ఆర్చిపై భాగంలో ఈ గంధర్వుల బొమ్మలు రూపం మార్చడానికి ఇనుప నిచ్చెనలుగానీ, ఎత్తయిన బల్లలు గానీ వాడాల్సి ఉంటుంది. అలాంటిది ఏ మాత్రం నమ్మశక్యంలేని ఈ దుష్ప్రచారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో టిటిడి అధికారులు స్పందించారు. పైగా అలిపిరి ప్రవేశమార్గం ఆర్చి లేతనీలం బూడిదరంగు కలసిన రంగులతో ఉంటుంది. కానీ సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడో రెండు దశాబ్దాల క్రిందట ఉన్న లైట్‌ఆరంజ్‌రంగున్న ఆర్చిని పెట్టి అన్యమత బొమ్మలంటూ దుష్ప్రచారం చేశారు. ఇదీ కొన్నినిమిషాల్లోనే పెద్ద దుమారం రేగింది. ఇప్పుడు అలిపిరి ప్రవేశమార్గం ఆర్చి ఉన్న రంగుకు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన రంగుకు తేడా ఉండటంతో ఎవరో పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారనేది టిటిడి విజిలెన్స్ అధికారులు తేల్చేశారు. అలిపిరి ప్రవేశమార్గంలో ఆర్చిపై అన్యమత బొమ్మలున్నట్లు అసత్యప్రచారం చేయడం బాధాకరమని టిటిడి ఖండించింది. ఆర్చిపై భాగంలో గంధర్వులు చేతిలో పూలమాలలు ధరించిన బొమ్మలు ఉన్నాయి. సప్తగిరి తనిఖీకేంద్రానికి ముందే అలిపిరి గరుడ కూడలి దాటిన తరువాత వచ్చే ప్రధాన ప్రవేశమార్గం ఆర్చి కొన్ని వందల సంవత్సరాల క్రిందట నిర్మించింది. సనాతన హైందవ ధర్మాన్ని ప్రతిబింబించే శిల్పాల రూపంలో ఎస్వీశిల్పకళాశాల నిపుణుల సూచనలతో తీర్చిదిద్దారు. అన్యమత శిల్పాలూ చిత్రీకరించి అవాస్తవాలు ప్రచారం చేయడం విచారకరమని టిటిడి తెలిపింది. భక్తుల మనోభావాలను గాయపరిచే విధంగా అసత్యకథనాలను ప్రసారం చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టిటిడి హెచ్చరించింది.

# రైల్లో గంజాయి చాక్లెట్లు పట్టివేత

### - ఒరిస్సా నుంచి బెంగళూరు వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం

**అనంతపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త బ్యూరో** ఒడిస్సా నుండీ బెంగుళూరుకు అక్రమంగా తీసికెళ్తున్న గంజాయి చాక్లెట్లు పట్టుకుని ఒకరి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు..జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో రైళ్లలో త్రీటౌన్ పోలీసులు, ఈగల్ సెల్, జీఆర్పీ, రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు అనంతపురం జిల్లాలో ప్రత్యేక గంజాయి చెకింగ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఈగల్ సెల్, అనంతపురం 3 టౌన్ పోలీస్, రైల్వే పోలీస్ బృందాలు సంయుక్తంగా పాల్గొన్నాయి. ఈ తనిఖీలు అనంతపురం నుండి ధర్మవరం వెళ్ళే 18463 నెంబర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (ఆరంభ సమయం ఉదయం 6:20 గంటలకి)లో చేపట్టారు. తనిఖీల సందర్భంగా ఒడిషాకు చెందిన సాల్మన్ అనే ప్రయాణికుడి వద్ద గంజాయి పదార్థం కలిగిన 219 చాక్లెట్లు పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి వద్దగల గంజాయి పదార్థం కలిగిన చాక్లెట్లు రైల్వే పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ప్రస్తుతం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు. గంజాయి వంటివి మానసిక ఆరోగ్యానికి హానికరమైనవిగా ఉండటంతో, వాటి వినియోగాన్ని, రవాణాను నిరోధించేందుకు ఈగిల్ సెల్ నిరంతరం చర్యలు తీసుకుంటోంది. ప్రజలు కూడా ఇలాంటి నేరాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# వృద్ధుల నేత్ర సంరక్షణ కేంద్రం ప్రారంభం



**విజయవాడ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోదె వెంకటాద్రి చౌదరి క్యాంపస్ వద్ద నున్న ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలలో కె సూర్య నారాయణమ్మ, డా కె ఎల్‌వి ప్రసాద్ పేరిట వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రం శనివారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాసరనేని దమయంతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎల్‌విపిఈఐ వ్యవస్థాపక చైర్మన్ డా జిఎన్ రావు, వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రం నెట్వర్క్ ఇన్చార్జ్ డా అవినాష్ పతంగి ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల విజయవాడ క్యాంపస్ హెడ్ డా అనసువా కపూర్ మాట్లాడుతూ ఈ వృద్ధుల కేంద్రం విశాఖపట్నంలోని సంధ్యా మెరైన్స్ సామాజిక సేవా బాధ్యత ప్రేరణగా అందిస్తున్న మద్దతుతో సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబం సంధ్యా మెరైన్స్ లిమిటెడ్ యాజమాని ఆనంద కుమార కొంద్రగుంట, వారి తండ్రి డా కెవి ప్రసాద్ లు పాల్గొన్నారు.

# మంచి పుస్తకంతో మార్పు సహజం

### - విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



**విజయవాడ, ఆగస్టు2, ప్రభాత వార్తప్రతినిధి:** మంచి పుస్తకంతో మార్పు సహజంగా వస్తుందని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం విజయవాడ కొత్తపేట కెబిఎన్ కళాశాల లైబ్రరీ రీడింగ్ హాలులో యేమినేని వెంకటరమణ రచించిన ఖరమణీయమ్ల పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంచి పుస్తకాలు జీవితాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయన్నారు. చిరిగిన చొక్కా అయినా వేసుకో మంచి పుస్తకం కొని చదువు అని విజ్ఞులన్నారన్నారు.పుస్తకం చేతిలో ఉంటే ఎంతో ఉపశమనం అన్నారు.అయితే ఇటీవల వస్తున్నకొన్ని పుస్తకాలు చదవడం వల్ల భావోద్రేకాలు కలుగుతాయని, అలాంటి పుస్తకాల జోలికి యువత వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. ఎస్ కె పి వి వి విద్యాసంస్థల ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. వి. నారాయణరావు పుస్తకాన్ని సమీక్షిస్తూ అర్ధపర్థం లేని రచనలు విస్తృతంగా వస్తున్న నేటి తరుణంలో రమణ రాసినరమణీయం పుస్తకంలో అర్థం పరమార్థం వున్నాయన్నారు. ఇందులోని రచనలన్నీ సమకాలీన సమస్యలపై ఎక్కుపెట్టిన బాణాలేనన్నారు. అందుకే ఈ రచయితను సామాజిక రచయితగా నేను ప్రకటిస్తున్నానన్నారు. కెబిఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాసు జ్యోతి ప్రజ్వలన చేసిన ఈ సభకు సుప్రసిద్ధ రచయిత డా. యం. ప్రభాకర్ అధ్యక్షత వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, వ్యాపారవేత్తలు చెవులు ఆంజనేయులు, చింతలపూడి సత్యనారాయణ, గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎన్.సూర్యారావు పాల్గొన్నారు. శ్రీదేవీ కరుమారి అమ్మన్ శక్తిపీఠం పీఠాధిపతులు కరుమారి దాసు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, వెస్ట్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే ట్రూ యా ప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారు

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ.ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే ట్రూ అప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు దారుణమన్నారు. తక్షణం దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ట్రూ అప్ ఇంధన సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు వద్దని ఈ నెల 5న ప్రజావేదిక ఆధ్వర్యాన జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసిందని తెలిపాఉ. 2019- 20 నుంచి 2023- 24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపార లోటు రూ.12,771 కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయని తెలిపారు. రాష్ట్రప్రభుత్వానికి తెలియకుండా ఇది జరగదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఛార్జీల పెంపుదలను నిలిపేయాలని కోరారు. గత 36 నెలల నుంచి 2014- 19 కాలానికి సంబంధించి రూ.3 వేల కోట్లు ట్రూఅప్ వసూలు చేశారని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2022- 23, 2023-24 సంవత్సర కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు ఛార్జీల భారం మోపారని పేర్కొన్నారు. అదీగాక 2024- 25 సంవత్సరానికి ప్రతినెలా యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఒక్క సంవత్సరం లోనే రూ.2,787 కోట్లు వసూలు చేశారని వివరించారు. స్మార్ట్‌మీటర్ల వల్ల అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం వేసిన విధంగా విద్యుత్ భారాలు వేయబోమని, తగ్గిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాయని పేర్కొన్నారు. కూటమి సర్కార్ మాట తప్పి భారాలు మోపిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఇటీవల రూ.449 కోట్లు ట్రూడౌన్ ద్వారా ఛార్జీలు తగ్గిస్తామని ప్రచారం చేశారు. మూడు డిస్కంల పరిధిలో సగటున మిగులు ఉందని కూడా చూపెట్టారు.

## ఎస్సీ, ఎస్టీ బాధితుల హక్కుల పరిరక్షణ - నిందితులకు కఠిన శిక్షల విధింపు

### డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు




సమీక్షా సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ బాధితుల హక్కుల పరిరక్షణ - నిందితులకు కఠిన శిక్షల విధింపులో ప్రాసిక్యూషన్ కీలక భూమిక పోషించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు అన్నారు.ఆయన నేతృత్వంలో రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో, 2025 జనవరి నుండి జూన్ నెలల వరకూ ఎస్సీ, ఎస్టీ (అణచివేత అరికట్టే) ప్రత్యేక న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులపై రాష్ట్రస్థాయిలో సమీక్షా సమావేశం శనివారం డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.బాధితులకు ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ,“ప్రతి కేసులో బాధితునికి గౌరవనీయమైన న్యాయం కల్పించడం, నిందితుడికి చట్టపరంగా గట్టి శిక్ష విధించడం ద్వారా సమాజానికి స్పష్టమైన హెచ్చరిక ఇవ్వడం ప్రాసిక్యూషన్ విభాగం యొక్క ప్రాధాన్యమైన బాధ్యత” అని స్పష్టంగా తెలిపారు.



# రైతును రాజును చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం



**కోనసీమ బ్యూరో , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో మరొక సూపర్ సిక్స్ పథకం అన్నదాత సుఖీభవ రాష్ట్రవ్యాప్తంగా సుమారురూ 4650 కోట్లు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది. అలాగే అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 9 కోట్లు రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భంగా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి లో ఏర్పాటు చేయబడిన అన్నదాత సుఖీభవ మొదటి విడత కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి చిత్రపటానికి శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అభిషేకంచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ కంకటాల రామం, రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి, జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు పిచ్చెట్టి విజయలక్ష్మి, రోళ్ళపాలెం సొసైటీ అధ్యక్షులు మట్టమహాలక్ష్మి ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మిబాబ్జి, భీమనపల్లి సొసైటీ అధ్యక్షులు ఆకేటి పెద్ద, ఉప్పలగుప్తం మండలం టిడిపి అధ్యక్షులు అరిగెలా నానాజీ, గొల్లవిల్లి టిడిపి గ్రామకమిటీ అధ్యక్షులు చీకట్ల ఏసుబాబు, జనసేనా నాయకులు కల్వకోలను తాతాజీ, రఘుబాబు, లింగోలు పండు, నాగ మానస, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎరుబండి వెంకటేశ్వరరావు, అల్లవరం సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపి, గోపవరం సొసైటీ అధ్యక్షులు సాకా రాంబాబు, మంచెం బాలకృష్ణ, ఆకుల సూర్యనారాయణ మూర్తి, దున్నాల దుర్గ, నిమ్మకాయల రాము, బండారి సాయిబాబు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, యాళ్ల బ్రహ్మానందం, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, రవణం మధు, వలవల శివరావు, గంధం శ్రీను మరియు వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలోరైతులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం : సీడీపీఓ మమ్మి



**గోపాలపురం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త )**
తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం వంటిదని గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ డీ.మమ్మీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గోపాల పురంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద తల్లులకు, అంగన్వాడి కార్యకర్తలకు శనివారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మమ్మీ మాట్లా డుతూ.. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కర మన్నా రు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన వారి మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. కొంతమంది తల్లులు బిడ్డకు డబ్బా పాలు పడతారని, అవి ఆరోగ్యవంతం కాదన్నారు. తల్లిపాలు తాగిన పిల్లలకు ఐక్యూ లెవెల్స్ పెరుగుతాయని చెప్పారు. పుట్టిన బిడ్డకు తల్లి ముర్రిపాలు ఇవ్వడం వ్యాధి నిరోధక టీకా తీసుకోవడంతో సమానమన్నారు. బిడ్డకు ముర్రు పాలు దివ్య ఔషధం వంటిదని పేర్కొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శారీరిక, మానసిక ఎదుగుదలకు ఎంతో తోడ్పడ తాయని తెలిపారు. తల్లిపాలు మించిన సమతుల ఆహారం మరొకటి లేదని చెప్పారు. అనంతరం తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను తెలిసేలా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్వైజర్లు జేవి.రమణ ఎం.విజయ కుమారి, ఎంఎల్హెచ్పీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించాలి : ఎంపీపీ దొమ్మేటి



**అంబాజీపేట , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోగులకు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర రావు అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత వాతావ రణంలో ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి ఏఎన్ఎం, ఆశాలచే వైద్య సేవలు అందించా లన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యహరిస్తూ వైద్యం చేయాల న్నారు. ఆస్పత్రి భవనం చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని త్వరలో తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో వచ్చే రోగుల సంఖ్య, మందుల వివరాలను వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్ ను ఎంపీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సిహెచ్ఓ బి. అప్పారావులు ఉన్నారు.

# దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి : ఎమ్మెల్యే గిడ్డి



**మామిడికుదురు , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రముఖ వైద్యులు భూపతి నాగేశ్వరరావు స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన రూ.35లక్షల వ్యయంతోనిర్మించిన డైనింగ్ హాల్ ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు.

ఈకార్యక్రమంలో ఎంపిపి కుసుమ వనజ కుమారి, ఏఎంసి చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్,ఏంపిటీసీ లు వర్ధినేని రాము,నైనాల సీతా మహాలక్ష్మి, డివైఈఓ సూర్యప్రకాష్, ఎంఈఓ మోకా వెంకన్నబాబు ,ప్రధానో పాధ్యాయులు బి.చరంజీవి ,సిహెచ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో బూత్ కమిటీలను పూర్తి చేయాలి



**కోనసీమ బ్యూరో , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ పదాదికారులు, కార్యవర్గ సభ్యులు సమావేశం కాటన్ గెస్ట్ హౌస్ లో బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పదాధికారులు, కార్యవర్గ సభ్యులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రతీ బూత్ సభ్యుడు వద్దకు వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసు కోవాలి. ప్రజలకు భారతీయ జనతా పార్టీ నాయకులు అందుబాటు లో ఉండాలి. ప్రతీ గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలి. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో కూటమి ధర్మం పాటిస్తూ బీజేపీ సత్తా చాటేలా కార్య కర్తలు కృషి చేయాలి. ప్రతి గ్రామంలో బూత్ కమిటీ లు అన్నీ పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ సమా వేశంలో జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే మానే పల్లి అయ్యాజీ వేమా, జిల్లా ఇన్చార్జి పొట్లూరి రామ్మోహన్ రావు, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, పూర్వపు జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాసరావు, కొప్పాడి దత్తాత్రేయ, సలాది వీరబాబు, పార్టీ పదాది కారులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వీర మహిళలకోసం హరి హర వీరమల్లు..ప్రారంభించిన జనసేన పార్టీ ఇంచార్జి బండారు శ్రీనివాస్




**రావులపాలెం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతంగా ప్రదర్శింప బడుతున్న నేపథ్యంలో వీర మహిళలు అభ్యర్థన మేరకు కొత్తపేట నియోజక వర్గం ఇంచార్జి బండారు శ్రీనివాస్ శనివారం రావులపాలెం పద్మశ్రీ థియేటర్లో మహిళలు కోసం ప్రత్యేకంగా మ్యాట్నీ షో ఏర్పాటు చేయించారు. ఈ చిత్రాన్ని అధిక సంఖ్యలో మహిళలు తిలకించారు. ఈ సందర్భంగా బండారు శ్రీనివాస్ వీర మహిళలతో కలిసి కేక కట్ చేసి చిత్రాన్ని ప్రారంభించారు. మన చరిత్ర మరియు హిందూ ధర్మ గురించి సంబంధించి నేపథ్యంలో సాగే చిత్రంగా ఈ చిత్రం ఉంటుంది అని ఆయన అన్నారు. మా చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అలాగే పేటిఎం మూకలు మా అధినేత పవన్ కళ్యాణ్ మీద అక్కసుతో చిత్రం మీద దుష్ప్రచారం చేస్తున్న కారణంగా మహిళలు కోసం ప్రత్యేకంగా ఈ చిత్రం ప్రదర్శన నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట స్వామి, బండారు బాబీ, అంబటి కిషోర్, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# పి.గన్నవరంలో అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే



**అంబాజీపేట , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
రైతు సంక్షేమానికే కూటమి ప్రభుత్వం అంకితమైనదని, రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చేస్తున్న సేవా దృక్పథానికి ఇది నిదర్శనమని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి గన్నవరం మండల పరిషత్ కార్యా లయంలో మండల వ్యవసాయాధికారి,ఇన్చార్జి ఏడిఏ సిహెచ్.డి.విజయ్ కుమార్ అధ్యక్షతన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం తొలి విడత కార్యక్ర మాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద పి.గన్నవరం నియోజవర్గం లోని అంబాజీపేట,పి.గన్నవరం, మామిడి కుదురు,అయినవిల్లి మండలాలలోని 23,727 మంది రైతుల ఖాతాలకు రూ.16.31 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, పీఎం కిసాన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలుతో కలిపి మొత్తం రూ.7 వేలను రైతులు ఖాతాలో జమ చేశామన్నారు. మూడు విడతల్లో ప్రతి రైతు ఖాతాలో రూ.20 వేలు జమ అవుతుందన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న టెక్నాలజీని మారుమూల గ్రామాలకు తీసుకెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సాయంతో రైతులు విత్తనాలు,ఎరువులు, కొనుగోలు చేసుకోగలరని, డ్రోన్ల సహాయంతో పంటలపై మందులు చల్లించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడుల నేతృత్వంలో రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేశారు.అనంతరం రూ.16.31 కోట్ల చెక్కు నమూనాను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి తిరువీధుల జయచంద్ర గాంధీ,జిల్లా వనరుల కేంద్రం అధికారి ఏబిఎస్ రాజశేఖర్, శాస్త్రవేత్త ఎం. నందకిషోర్, అంబాజీపేట, మామిడి కుదురు, అయినవిల్లి ఏవోలు కె.ధర్మ ప్రసాద్, ఎన్.వి.వి. సత్యనారాయణ,వై. శోభ, సర్పంచి బొండాడ నాగమణి ,ఏఎంసి చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ జమ



**మామిడికుదురు , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల కు లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం విడుదల చేయడం జరిగిందని,కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో భాగమైన అన్నదాత సుఖీభవ ప్రతి రైతుకి కేంద్రం ఇచ్చే రూ.ఆరువేలతో పాటు కూటమి ప్రభుత్వం రూ 14 వేలు కలిపి రూ.20 వేలు మూడు దపాలుగా రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ సభ్యులు హాజీ ముకర్రం హుస్సేన్ పేర్కొన్నారు. మొదటి విడతగా సార్వా పంటకు సహాయంగా శనివారం కేంద్రం పీఎం కిసాన్ రూ.2 వేలు,రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవం రూ.5 వేలు కలిపి రూ.7 వేలు చొప్పున మూడు విడతలుగా రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా త్వరలో కౌలు రైతులకు ఏడాదికి రెండు విడతల్లో రూ.20 వేలు జమ చేయడం జరుగుతుందని ముఖర్రం తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి కూటమి ప్రభుత్వానికి కోనసీమ ముస్లిం మైనారిటీస్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆత్రేయపురంలో ఉచిత వైద్య శిబిరం



**ఆత్రేయపురం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
మెదడు వెన్నుపూస వ్యాధుల నిపుణులు, డాక్టర్ జి రోహిత్ కుమార్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ హర్ష కుమార్ జనరల్ మెడిసిన్,డాక్టర్ పి వి చంద్రకాంత్ వర్మ ల పర్యవేక్షణలో మండల కేంద్రమైన ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్ నందు అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ శ్రీకర మల్టీ స్పెషాలిటీ, రోబోటిక్స్ హాస్పిటల్ రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఈసీజీ, షుగర్, బిపి, వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి 140 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని లాంచనంగా ముదునూరు వెంకటరాజు (గబ్బర్ సింగ్) మరియు పి ఎన్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ గాదిరాజు ప్రసాదరాజు శిబిరంలో పాల్గొన్న సూపర్ స్పెషాలిటీ వైద్యులకు సహాయ సిబ్బందికి ఎన్ఆర్ఐ డాక్టర్ రాజు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో 226 మందికి కొత్త పెన్షన్లు పంపిణీ



**జగ్గంపేట , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జగ్గంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో భర్త చనిపోయిన భార్యలకు 226 మందికి నూతన పెన్షన్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయిం చారని అయినా ఇచ్చిన మాట కట్టుబడి పార్టీలు కులాలకతీతంగా వృద్ధులకు, వితంతువులకు 4000 రూపాయలు, వికలాంగులకు 6000 రూపాయలు, తల సేమియా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పదివేల రూపాయలు, సంపూర్ణ వికలాంగులకు 15వేల రూపాయలు పెన్షన్లు ప్రతి నెల ఒకటవ తేదీనే వారి ఇంటికి వెళ్లి అధికారులు ప్రజాప్రతినిధులు అందిస్తున్నారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో 5 57 మంది మండలంలో భర్త చనిపోయిన మహిళలకు పెన్షన్ ఇవ్వవలసి ఉండగా 226 మందికి కొత్త పెన్షన్ పంపిణీ చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగిలినవారికి న్యాయం చేసే విధంగా వచ్చే నెలలో పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, భర్త రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎంపీపీ నాగబాబు, మారిశెట్టి భద్రం, జగ్గంపేట, రాజపూడి సొసైటీ చైర్మన్లు బుర్రి సత్తిబాబు, ఉప్పలపాటి బుల్లబ్బ, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, ఎమ్మార్వో రమేష్, రేఖ బుల్లి రాజు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, కంటే రామారావు, వేములకొండ జోగారావు, సర్పంచ్ లు భూసాల విష్ణుమూర్తి, సర్వసిద్ధి లక్ష్మణరావు, నీలం శ్రీను, ఎంపిటిసిలు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం మొబైల్ షాప్ అండ్ యూనియన్ సమావేశం



**ఏలేశ్వరం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
ఏలేశ్వరం మొబైల్ షాప్ అండ్ యూనియన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి నెల యూనియన్ మీటింగ్ ద్వారా యూనియన్ సభ్యుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించి చుట్టుపక్కల ఉన్న అన్ని మొబైల్ షాప్స్ యూనియన్ రూల్స్ పాటించాలని,యూనియన్ రేట్లు నిల బెట్టాలని,నియమ నిబంధనలను తెలియజేశారు. ఏలే శ్వరం మండలంలో ఉన్న అన్ని మొబైల్ షాప్స్ యూ నియన్ రూల్స్ అన్నీ పాటించాలని వారికి ఏమైనా సమ స్య వస్తే యూనియన్ దృష్టికి తీసుకురావాలన్నారు. మొబైల్ షాప్ యూనియన్ ప్రెసిడెంట్ ఫణి,సెక్రెటరీ శివ, రాము, మెసెంజర్ అంజి యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో అన్నదాత సుఖీభవ..
# పీఎం కిసాన్ నిధుల చెక్కును విడుదల చేసిన ఎమ్మెల్యే



**ప్రత్తిపాడు , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
దేశానికి అన్నం పెట్టే రైతన్న సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు.శనివారం నియోజవర్గ కేంద్రమైన ప్రతిపాడులో ఏవో జోకా అమృత ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ,సీఎం నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ధాన్యంతో అభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు.ప్రత్తిపాడు నియోజవర్గంలో 31 వేల 634 మంది రైతులకు గాను,రూ.21 కోట్ల 32 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.గతంలో ఏ ప్రభుత్వము చేయని విధంగా కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలిచిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో రైతులు దిక్కుతోచని స్థితిలో గడిపారన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పిఎం కిసాన్,అన్నదాత సుఖీభవ పథకాలు పేరుతో ఏడాదికి రూ.20 వేలు చొప్పున రైతు ఖాతాల్లోకి మూడు విడతలగా జమ చేస్తామన్నారు .కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం,రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో ఏడిఏ జి.శ్రీనివాస్,జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబి, బిజెపి కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు,రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు వెన్నా శివ,సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,సీనియర్ నాయకులు కొమ్ముల కన్నబాబు,ఉత్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, ఓమ్మంగి సొసైటీ అధ్యక్షులు సత్యం శెట్టి సీతారామం ధర్మవరం సొసైటీ చైర్మన్ దాసం శేషారావు,రాష్ట్ర టీడీపీ యూత్ కార్యదర్శి లొండ లోవరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి సుభాష్,కూటమి నాయకులు ఇటంశెట్టి సూర్యభాస్కర్,పంచాది వీరబాబు,గాబు సుభాష్, కరణం సుబ్రహ్మణ్యం,యర్రాబత్తుల గోవింద్ నాయుడు,వెలుగుల నాని,సాదనాల లక్ష్మీబాబు, పోలినాటి భగవాన్, మండల వివిధ శాఖల అధి కారులు, వ్యవసాయ శాఖా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానంలో

# అవకతవకలు సమస్యలపై ప్రక్షాళన చేపట్టాలి

- ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి
- లేని పక్షంలో ఆలయం వద్ద ఆందోళన
- బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆంధ్ర రాష్ట్ర జోనల్ అధ్యక్షులు రామం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా పవిత్ర పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అవకతవకలు,వేద పాఠశాల విద్యార్థుల మౌలిక సదుపాయాలు, సమస్యలపై ప్రభుత్వం స్పందించి ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉందని బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆంధ్ర రాష్ట్ర జోనల్ అధ్యక్షులు మిర్తిపాటి రామం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నవరం దేవస్థానానికి ఒక విశిష్టత ఉందన్నారు. అటువంటి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, సమస్యలపై వస్తున్న పత్రికల వార్తా కథనాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని అధికార యంత్రాంగం పై చర్యలు చేపట్టాలన్నారు.ఇక్కడ వేద పాఠశాల లోని విద్యార్థులు అస్వస్థకు గురై, హాస్పటల్లో వైద్యం పొందుతున్నారనే వార్త విని చాలా బాధపడటం జరిగిందన్నారు. తల్లిదండ్రులు లేని పేద పిల్లలు వేద విద్యను నేర్చుకుని



కుటుంబానికి ఆసరాగా నిలవాలనే సదుద్దేశంతో వేద పాఠశాలలో చేరడం జరుగు తుందన్నారు. అటువంటి వేదవిద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. వేద పాఠశాల విద్యార్థులకు సరైన పోషకాహారం అందించడం లేదనేది పత్రికలు వాస్తవాలు వెల్లడిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భోజనంను కాంట్రాక్టర్ కి అప్పగించడంతోనే ఆ విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందటం లేదన్నారు.అన్నవరం వేద పాఠశాలకు విశేషత ఉందని పేర్కొన్నారు.ఈ పాఠశాలలో వేద విద్య నేర్చుకున్న విద్యార్థి నేడు కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారని ఆయన వెల్లడించారు. అటువంటి వేద పాఠశాల రాజకీయ వ్యవస్థతో భ్రష్టు పడుతుందన్నారు. నెలరోజులు గడవకముందే వేద పాఠశాల విద్యార్థులు రెండుసార్లు అస్వస్థకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. కమిషనర్ విచ్చేసి విద్యార్థులను పరామర్శించడం కాకుండా అక్కడ బాధ్యులపై చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.ఒకటి , రెండు కాదు చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని..నెయ్యి డబ్బాలు తరలిపోతున్నాయి, శానిటేషన్ కార్మికుల పీఎఫ్ సొమ్ములు దారి మళ్ళాయి. వీటన్నిటి పైన తూతూ మంత్రపు చర్యలు కాకుండా అన్నవరం దేవస్థానం కి పట్టిన గ్రహణం ఎవరనేది పూర్తిస్థాయి విచారణ చేపట్టి ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు.తక్షణం ప్రభుత్వం స్పందించి ఆలయంలో జరిగిన అవకతవకలు, సమస్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆలయం వద్ద ఆందోళన చేపడతామని రామం హెచ్చరించారు.

# పిహెచ్ డి పొందిన ఆదిత్య ప్రొఫెసర్లకు ఘన సన్మానం

**గండేపల్లి , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఇటీవల వివిధ యూనివర్సిటీ ల నుండి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందిన ప్రొఫెసర్లకు విభాగాధిపతి డాక్టర్ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అభినందన సత్కారం జరిగింది.పనిచేస్తున్న డా. పవన్ జొన్నలగడ్డ , అసిస్టెంట్ ప్రొఫెసర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు మధ్యప్రదేశ్‌లోని రవీంద్రనాథ్ ఠాగూర్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టభద్రత లభించింది. అంతేకాకుండా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ ఐ. వెంకట వీరాంజనేయులు, డాక్టర్ రాజేష్ నెక్కంటి, డా. ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ యూనివర్సిటీ నుండి తమ పి.హెచ్.డి. పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భ ంగా ప్రో ఛాన్సలర్ డా. ఎన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి, వైస్ చాన్సలర్ డా. ఎం. బి. శ్రీనివాస్ ప్రో వైస్ ఛాన్సలర్లు డా. ఆదిరెడ్డి. రమేష్, డా. ఎస్. రమా శ్రీ, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, డా. వి.శ్రీనివాస రావు సన్మానించారు. వీరి శిక్షణ లో విద్యార్థులు మంచి నాణ్యమైన విద్యను అభ్యసించి భావిత రాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమా నికి డీన్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు బోధన సిబ్బంది హాజరయ్యారు.వారి సేవలను కొనియాడుతూ అభినందించారు.



# కోనసీమ తిరుమలకు..

# వాడవాడాల నుండి వేలాది మంది భక్తులు రాక

- భక్త జనసంద్రం వాడపల్లి క్షేత్రం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ 67.67లక్షలు

**ఆత్రేయపురం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలంగా భక్తుల గోవింద నామస్మరణతో కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం భక్త జనంతో శోభిల్లింది. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రం లో శ్రావణమాసం రెండు శనివారం కావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రం గా మారాయి. ఏడు వారాలు నోము ఆచరించే భక్తులతో పాటు శ్రావణమాసం రెండవ శనివారం కావడంతో సుమారు 80వేల నుండి తొంబై వేలవరకు భక్తులు తరలివచ్చినట్లు అంచనా. దీంతో తెల్లవారు జాము నుండి ఆలయ పరిసరాలన్నీ కిక్కిరి సాయి ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, తొలి హారతితో ప్రారంభమైన భక్తుల రద్దీ రద్దీ.. రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, బెంగళూరు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రావడంతో తొంబై వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 35వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రత్యేక దర్శనాలు తదితర ద్వారా స్వామివారికి రూ, 67,67,790/- లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా చలువ పందిళ్ళు, క్యూ లైన్ లలో కూలర్స్, ఫ్యాన్ లు, చంటిపిల్లలకు పాలు, బిస్కెట్స్, చల్లని త్రాగు నీరు,రూ 200/-లు, రూ, 50/-లు, ఉచిత క్యూ లైన్ లలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరు గా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.



వివిధ జిల్లాల నుండి ఆర్టీసి అధికారులు ఈ ఆలయానికి ప్రత్యేక బస్సులను నడిపారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ . కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు, సూపరింటెండెంట్ లు పులపర్తి రాంబాబు, రాపాక శ్రీనివాస్, కుమార్, ప్రసాద్,వై, శ్రీనివాస్, నారాయణ, నందిశ్వరుడు, గ్రామస్తులు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.సాయంత్రం విశాఖపట్నం వాస్తవ్యులు కళారాధన కళాశాల వారి కూచిపూడి నృత్య ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.








# గండేపల్లిలో ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్లు పంపిణీ : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
భర్త చనిపోయిన భార్యకి కూటమి ప్రభుత్వం స్పౌజ్ పెన్షన్లు అందచేస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన ఎంపిడివో కర్రి చంద్రరావు పర్యవేక్షణలో జరిగిన స్పౌజ్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిధిగా పాల్గొని మండలంలో 168 మంది లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని,అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీలకతీతంగా వృద్ధులకు, వితంతువులకు 4వేల రూపాయలు, వికలాంగులకు 6వేల రూపాయలు,తల సేమి యా, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 10 వేల రూపాయలు, సంపూర్ణ వికలాంగులకు 15వేల రూపాయలు పెన్షన్లు ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అధికారులు, ప్రజాప్రతినిధులు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కర రావు, పోతుల మోహనరావు, పరిమి బాబు,కందుల చిట్టిబాబు,ఎమ్మార్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నల్ల తాచు హల్చల్



**అంబాజీపేట , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త )**
మండలంలోని ఇసుకపూడి గ్రా మంలో తాటి కాయల నాగేశ్వర రావు ఇంటిలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నల్లతాచు హల్ చల్ చేసింది. దీంతో నాగేశ్వరావు కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు.వంట గదిలో నల్లతాచు బుసలు కొడుతూ కనిపించడంతో కంగారుపడ్డారు. దాంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించారు. వర్మ పామును చకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించి జనసంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు. వర్షాకాలం కావడంతో పాములు నివాస గృహాల లోకి, పశువుల కొట్టాములలోకి వచ్చేస్తాయని ప్రజల ప్రమాదంగా ఉండాలన్నారు. పామును చూసిన వెంటనే తనకు సమాచారం అందివ్వా లని గణేష్ వర్మ సూచించారు.

## పెన్షన్ల దుర్వినియోగ సొమ్ము రూ.3 లక్షలు జమ

**ప్రత్తిపాడు , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
మండలంలో పెన్షన్ల సొమ్ము దుర్వినియోగంపై ఎంపీడీవో ఐవి కుమార్ బాబు పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి కి షో కాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. దీనిపై శని వారం వొమ్మంగి పంచాయతీ కార్యదర్శి మూడు లక్షలు సొమ్మును ఖజానాకు జమ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల నుండి ఐదు లక్షల వరకు సొమ్ము సోమవారం రికవరీ జరగచ్చునని ఎంపీడీవో కుమార్ బాబు తెలిపారు.మొత్తం సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయించి బాధ్యులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## బాలబాలాజీ స్వామికి రూ. 2.78 లక్షల ఆదాయం

**మామిడికుదురు ,ఆగష్టు 02, ( ప్రభాతవార్త )**
మామిడికుదురు మండలం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి ఆలయంలో శనివారం వివిధ అర్జిత సేవల ద్వారా రూ. 2,78,17 ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో సత్య నారాయణ రాజు తెలిపారు.నిత్య అన్నదానం ట్రస్టు కు భక్తులు రూ.77,978 ల విరాళాలు సమర్పిం చారన్నారు.ఈరోజు సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 2,800 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఈవో వెల్లడించారు.

# సామర్లకోట రైల్వే స్టేషన్లో స్వచ్ఛత అభియాన్ పరిశుభ్రత కార్యక్రమాలు

**సామర్లకోట , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
సామర్లకోట రైల్వే స్టేషన్లో భారతీయ రైల్వేలు మరియు రైల్వే బోర్డు ఆదేశాల మేరకు శుక్రవారం స్వచ్ఛత అభియాన్ (పరిశుభ్రత కార్యక్రమాలు) ఆగస్టు ఒకటవ తేదీ నుండి నుండి ఆగస్టు 15 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల (ఆగస్టు 15) సందర్భంగా స్వచ్ఛత అభియాన్ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం. రమేష్ తెలిపారు. రైల్వే ఉద్యోగులతో స్టేషన్ లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు అనంతరం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్స్పెక్టర్ కళ్యాణి, స్టేషన్ సూపరింటెండెంట్ అనంత లక్ష్మీ, టికెట్ చెకింగ్ ఇన్స్పెక్టర్లు చైతన్య,రమణ, రిజర్వేషన్ సూపర్వైజర్ రాజు, ఆర్ పి ఎఫ్ మరియు జి ఆర్ పి సిబ్బంది , హౌస్ కీపింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిస్వార్ధకళా సేవకుడు బళ్లారి రాఘవ : అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ



**రాజమహేంద్రవరం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఐ.పి.ఎస్. ఆదేశాల ప్రకారము భారతీయనాటక రచయిత మరియు నటుడు స్వర్గీయ బళ్లారి రాఘవ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా తూర్పుగోదావరి జిల్లా పోలీసు లు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలపై అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. బి ఎం. మురళి కృష్ణ , అడిషనల్ ఎస్పీ( క్రైమ్స్) ఎల్. అర్జున్, అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) ఎల్. చెంచి రెడ్డి ఇతర అధికారులు మరియు సిబ్బంది బళ్లారి రాఘవ చిత్రపటానికి పుష్ప మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూతెలుగు నాటకరంగ పితామహుడు, గొప్ప న్యాయవాది మరియు నిస్వార్థ కళా సేవకుడు బళ్లారి రాఘవ అని కొనియాడారు. తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతికోసం వెచ్చించిన మహోన్నత వ్యక్తి అని, ఆయన చేసిన సేవలు నేటితరం యువతకు ఆదర్శంగా నిలుస్తాయి అని బళ్లారి రాఘవ సేవలను ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, ఇతర అధికారులు మరియు డిపిఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల బాలాజీ స్వామికి రూ. 2.78 లక్షల ఆదాయం

**మామిడికుదురు , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు మండలం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి ఆలయంలో శనివారం వివిధ అర్జిత సేవల ద్వారా రూ.2,78,17 ల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవోసత్యనారాయణ రాజు తెలిపారు.నిత్యఅన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.77,978ల విరాళాలు సమర్పించారన్నారు.ఈరోజు సుమారు ఐదువేల మందిభక్తులు స్వామివారిని దర్శించుకోగా2,800మంది అన్నప్రసాదంస్వీకరించారనిఈవో వెల్లడించారు.



# వైభవంగా శ్రీ సత్యదేవుని తిరుచ్చి సేవ



**అన్నవరం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం తిరుచ్చి వాహనం పై శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ వైభవంగా నిర్వహించారు.ముందుగాఆలయ అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళ,వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు,వ్రత పురోహితులు మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీతానగరంలో బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం

**సీతానగరం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
సీతానగరం జీవీకే ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. తల్లికి వందనం ఒకరిద్దరికి ఇచ్చారని, రైతు భరోసా కింద కేవలం ఐదు వేల రూపాయలు మాత్రమే వేస్తున్నారన్నారు. చేయూత, కాపు నేస్తం వంటి పథకాలు నిలిచిపోయాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు కాలేదని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపై ఉందని రాజా పిలుపునిచ్చారు. అంతేకాకుండా, తాను అప్పుల్లో ఉన్నానని చెప్పే ఎమ్మెల్యే రెండు కోట్ల రూపాయలు విలువైన డిఫెండర్ కారులో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ముద్రగడ ఆరోగ్యం కోసం సర్వమత ప్రార్ధనలు

**రౌతులపూడి , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి పొలిట్ బ్యూరో సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యవంతంగా ప్రజల ముందుకు రావాలని కోరుతూ మండల వైఎస్ఆర్సిపి శ్రేణులు శనివారంసర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ముందు గా శివాలయంలో ఆయన పేరున అభిషేకం చేయించారు. అనంతరం మసీదు, చర్చిలో ప్రార్ధన చేయించారు. పద్మనాభనికి భగవంతుడు ఆయురారోగ్యాలు కల్పించాలని పురోహితుడు సుబ్రమణ్యం,మసీదు పెద్దలు, చర్చి పాస్టర్ ప్రార్థించారు.

# బహిరంగ చర్చలకు మేము సిద్ధం..వైస్సార్సీపీ నాయకులపై కూటమి నేతల సవాల్

**ఆత్రేయపురం , ఆగష్టు 02 , ( ప్రభాతవార్త ) :**
వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మీకు ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రండి. మేము సిద్ధంగా ఉన్నామని కూటమి నాయకులు తోట వెంకట రమణ,పాలంగి రవిచంద్ర అన్నారు. ఆత్రేయపురం మండలం తాడిపూడి గ్రామంలోని టీడీపీ కార్యాలయం నందు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. దీంతో మండలంలో రాజకీయ వేడి పెరిగింది . ఈ సమావేశంలో కూటమి నేతలు వైసీపీ నాయకులపై తీవ్ర విమర్శలు చేస్తూ, బహిరంగ చర్చకు సవాల్ విసిరారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దళితులపై పెట్టిన అక్రమ కేసులు, వారి భూముల లాక్కోవడం వంటి ఘటనలను గుర్తు చేస్తూ, "ఇవన్నీ మర్చిపోయి



నేడు నైతికత గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు" అన్నారు అలాగే, వైసీపీ పాలన సమయంలో మట్టి, ఇసుక మాఫియా ఎలా పెరిగిందో ప్రజలకు స్పష్టంగా తెలుసునని, 2019 నుండి 2024 వరకూ నదులను ఎలా కొల్లగొట్టారో పూర్తి సమాచారం తమ వద్ద ఉందని వెల్లడించారు. "ప్రజలకు నేడు అందుబాటు ధరలకే మట్టి, ఇసుక, మద్యం లభ్యమవుతున్నా, ఆ విషయాల్లో మా నాయకులను విమర్శించేందుకు మీకు హక్కు లేదు అని విమర్శించారు.వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆదాయాన్ని మద్యం అమ్మకాల ద్వారా ఎలా వృద్ధి చేసిందో, ఆ లాభం ఎంత ప్రభుత్వానికి వచ్చిందో, ఎంత మంది నేతల జేబుల్లో పడిందో తమ వద్ద పూర్తి లెక్కలున్నాయని పేర్కొన్నారు. శాసనసభ్యులు బండారు సత్యానందరావు చేసిన సేవలు ప్రజలందరికీ తెలుసు. ఆయన అభివృద్ధి పనుల గురించి మాట్లాడే హక్కు మీకు లేదు. మేము మాట్లాడాల్సిన అవసరం లేదు, ప్రజలే నిజానిజాలు తేల్చుకుంటారు అని వ్యాఖ్యానించారు. మట్టి, ఇసుక మాఫియాలో కూడా వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అవకతవకలను వివరించే సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.ఇప్పటికైనా ధైర్యం ఉంటే మీ నాయకులు స్థలం, సమయం చెబితే మేమే అక్కడికి వచ్చి బహిరంగ చర్చ చేద్దాం" అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు.ఈ సమావేశంలో కూటమి నేతలు పాలంగి రవిచంద్ర, కుసంపూడి రమేష్ రాజు,అంబుల రామకృష్ణ, జోగి ప్రసాద్, మిద్దె పాపారావు గుడెల నాగేంద్ర, మిద్దె గోపాలకృష్ణ, నాగిరెడ్డి సత్యనారాయణ, చల్లపూడి పవన్, తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# రాబడి సాగు



అల్లూరి సీతారామరాజు జిల్లా, డంబ్రిగుడ మండలం, బలియగూడకు చెందిన పాంగి వినీత కుటుంబానికి ఎకరా భూమి ఉంది. రాళ్లు నిండి, నీరు లేని ఆ భూమిని సాగులోకి తీసుకురావాలని నాలుగేళ్ల కిందట సంకల్పించారామె. 'అక్కడ సేద్యమంటే కొండని తవ్వి ఎలుకని పట్టడమే' అన్నారంతా. నేడు ఆ రాళ్ల భూమిలోనే రతనాలు పండిస్తున్నారీ ఆదివాసీ మహిళ. భర్త సహకారంతో రాళ్లను తొలగించారు. కొండ పైనుంచి వస్తున్న ఊట నీటిని పొలానికి మళ్లిస్తున్నారు. ఏడాది పొడుగునా ఆదాయం వచ్చేలా కూరగాయల పెంపకంపై దృష్టి సారించారు. టొమాటో, వంగ, ముల్లంగి, కొత్తిమీర, బెండ, మిరప, మొక్కజొన్న, బీన్స్, తోటకూర, క్యాబేజీ వంటి కూరగాయలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో రాగులు, సామలను పండిస్తున్నారు. గులి విధానంలో రాగు సాగు చేసి ఎకరాకు 700 కిలోల మేర దిగుబడిని సాధించారు. ఈ పొలం నుంచి ఏటా రూ.2.50 లక్షల ఆదాయాన్ని పొందుతున్నారు. సేంద్రియ విధానంలోనే సేద్యం చేస్తున్న వినీత... ఆవు, మేకల విసర్జితాలను ఉపయోగించి సొంతంగా ఎరువులు తయారు చేసుకుంటున్నారు. గ్రామంలో 20 కుటుంబాల భూములన్నీ రాళ్లతో నిండినవే వినీత చూపిన బాటలోనే వాళ్లూ నడుస్తున్నారు. స్థానిక, నాటు విత్తన రకాలకుతోడు ఒడిశ నుంచి కొన్నింటిని సేకరించారు. ఏళ్ల నుంచి చీడపీడలకు గురికాని కూరగాయలు, ఇతర సంప్రదాయ పంటల విత్తనాలను కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు. ఏటా పంటలో కొంత విత్తనాలకే దాచి పెడతారు. వాటిని గ్రామాల్లోని ఇతరులకు అందిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి తగ్గడమే కాదు. నాణ్యమైన, నమ్మకమైన విత్తనాలను నాటుకోగలుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ మహిళా రైతు అవార్డు అందుకున్నారు వినీత. □

# పిల్లల్లో చెవి ఇన్ఫెక్షనా..?



పసి తనంలో పిల్లలకు అప్పుడప్పుడూ చెవి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. అవి సాధారణమే అని తేలిగ్గా తీసుకుంటున్నారా.. కానీ అవి పిల్లల్లో భాషా నైపుణ్యాలు కొరవడేలా చేస్తాయని మీకు తెలుసా! పసి పిల్లలు ముఖ్యంగా మూడేళ్లలోపు వారిలో తరచూ చెవి ఇన్ఫెక్షన్లు వస్తుంటే.. వాటిని తేలిగానతీసుకోవద్దని పరిశోధకులు చెబుతున్నారు. ఎందుకంటే అవి వారిలో తాత్కాలికంగా వినికిడి లోపించేలా చేసి, భాషా నైపుణ్యాలు మెరుగుపడకుండా చేస్తాయట. 5-10ఏళ్ల పిల్లలను పరిశీలించినప్పుడు వాళ్లలో మూడేళ్లలోపు ఎవరికైతే ఎక్కువ చెవి ఇన్ఫెక్షన్లు వచ్చాయో, వాళ్లలో పద ఉచ్చారణ సరిగా లేనట్లు గుర్తించారు. ఈ ఇన్ఫెక్షన్లు వారి కర్ణభేరిలో ఒక రకమైన ఫ్లూయిడ్ ఏర్పడేలా చేస్తాయట. ఇది శబ్దాలు వినపడకుండా అడ్డుకుంటుందట. అందుకే చెవి ఇన్ఫెక్షన్లు ప్రమాదకరమైనవనీ, గుర్తించిన వెంటనే చికిత్స చేయించాలనీ చెబుతున్నారు. □

# ఇంటర్వ్యూకు వెళ్తున్నారా!

**అమ్మాయిలు ఎన్నో ఇంటర్వ్యూ వెళుతుంటారు. ఈ సారైనా ఉద్యోగాన్ని సంపాదించగలనో లేదో అని భయపడు తుంటారు. ఇటువంటప్పుడు జాబ్‌కు సంబంధించిన విషయాలతోపాటు బాడీ లాంగ్వేజ్‌లో పొరపాట్లుంటే సరిదిద్దుకొని వెళ్లడం మంచిది.**


♦ ఇంటర్వ్యూ చేస్తున్నవారికి ఎదురుగా ఒంటి కూర్చోవడం, కాలుపై కాలువేసుకొనో.. లేదా టేబుల్‌కు దూరంగా కుర్చీకి జారగిలపడటం వంటివి చేయకూడదు. ఇవన్నీ మీలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్నట్లు, ఉద్యోగం పట్ల ఉత్సాహం లేదన్నట్లుగా చూపిస్తాయి. ఈ కదలికలు అవతలివారి ఏకాగ్రతను దూరం చేస్తాయి. స్ట్రెయింగ్.. మీ గంభీరతను చాటుతూ ప్రొఫెషనలిజాన్ని చూపెడుతుంది.

♦ చేతులు కట్టుకొని కూర్చోవడం కూడా సరైనది కాదు. ఈ భంగిమ స్వీయరక్షణగా అనిపిస్తుంది. అలాగే మీరు చెప్పగలిగేది ఇకపై ఏదీ లేదనే సంకేతాన్ని అవతలివారికి ఇస్తుంది. అలాకాకుండా చేతులు రెండూ ఫ్రీగా ఉంచికూర్చోవడం మేలు. అప్పుడే ఎదుటివారు చెప్పేదానిపై మీ శ్రద్ధతోపాటు వారిపట్ల మీరు పాటిస్తున్న మర్యాద కనిపిస్తుంది.

♦ ముఖంపై పడిన జుట్టు సర్దుకోవడం, గోళ్లరంగు చూస్తూ.. కాళ్లూపడం, నిమిషానికొకసారి ముఖంపై చేతితో రుద్దుకోవడం వంటివి చేయకూడదు. దాన్ని మీ నిరాసక్తత లేదా భయంగా ఎదుటివారు భావిస్తారు. ఇంటర్వ్యూలో ఎటువంటి కదలికలను ప్రదర్శించకుండా అవసరమైనంత మనరకు జవాబు చెబుతూ, వారు చెప్పేది పూర్తిగా వినడంపై ఏకాగ్రత ఉంచితే మేలు. ౖఅడుగడుక్కీ చేతి వాచీ, గోడ గడియారం లేదా ఫోన్‌లో సమయం చూడటం మీ అసహనాన్ని ప్రదర్శిస్తుంది. ఆ ఇంటర్వ్యూపై మీకు ఆసక్తిలేదనే తప్పుడు సంకేతాన్నిస్తుంది. సమయం పూర్తవుతుందనే కంగారు మీకు ఉండి ఉండొచ్చు. అలాకాకుండా ఎదుటకూర్చుననవారు మీ కోసం కేటాయించిన సమయానికి మర్యాదనివ్వగలిగితే చాలు.

♦ బలపై ఉన్న పేపర్‌వెయిట్, పెన్ లేదా కీచెయిన్ వంటి వస్తువులను కదపడంవల్ల మీరు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు లేదా బోర్ ఫీలవుతున్నట్లు ఎదుటివారికి అనిపిస్తుంది. కాబట్టి సౌకర్యంగా కూర్చొని పూర్తిగా అవతలివారు అడిగే ప్రశ్నలమీదే దృష్టిని కేంద్రీకరించి ఆత్మ విశ్వాసంతో సమాధానం చెప్పగలిగినప్పుడే మంచి ఫలితాలొస్తాయి. □

# దేవుడిలో నిలిచి ఉంటే భయముండదు..



క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్లిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయపునరుత్థానమును గూర్చి చెప్పెను. ఈ యేసును దేవుడు లేపెను, దీనికి మేమందరము సాక్షులము (అపొస్తలుల కార్యములు 2: 31. 32). ఈ సాక్ష్యాన్ని యేసుక్రీస్తు 12 మంది శిష్యులలో ఒకడైన పేతురు చెప్పాడు. ఈ పేతురు ఒకప్పుడు యేసుక్రీస్తు ఎవరోతనకు తెలియదని మూడు సార్లు అబద్ధం చెప్పాడు. యూదులు తనను చంపుతారనే భయంతో అబద్ధాలు చెప్పాడు కానీ, అనంతరం ప్రభువు మరణించి, పునరుత్థానమైన తర్వాత పేతురును దర్శించాడు. అప్పుడు పేతురులో ఎక్కడలేని ధైర్యంవచ్చింది. జీవిస్తే ప్రభువు కోసమే జీవించాలి లేదంటే ప్రభువుకోసమే చావాలి అనే తెగింపు వచ్చింది. యూదులమధ్యలో నిలబడి బహిరంగంగా యేసుక్రీస్తును గురించిన సత్యాన్ని ధైర్యంగా చెప్పాడు. మీరు క్రీస్తును సిలువలో హతమార్చారు. అయితేఆయన(ప్రభువు) మూడవరోజు మరణం నుంచి లేచాడు. అందుకు మేమే సాక్షులమని చెప్పాడు. ఈ మాటల్ని విన్న యూదులు తమ హృదయంలో గుచ్చుకుని, అప్పుడే యేసుక్రీస్తును తమ సొంతరక్షకుడిగా అంగీకరించి, బాప్తిస్మం తీసుకున్నారు. నిజమేదేవుడిని యధార్థంగా సేవించేవారు భయపడరు. పరిస్థితులు ఎలా ఉన్నా దేవుడిపై తమ విశ్వాసాన్ని ఉంచుతారు. ఖివారుపేతురు, యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులని గ్రహించి, ఆశ్చర్యపడి, వారు యేసుతో కూడా ఉండినవారని గుర్తెరిగిరిఖి (అపొస్తలుల కార్యములు 4:13). పేతురు, యోహానులు దేవుడి గురించి ధైర్యంగా, బహిరంగంగామాట్లాడుతుంటే యూదులు విస్మయం నొందారు. వీరు యేసుతో కూడా ఉండినవారని గుర్తించారు. అవును వారి నడవడి, భక్తిజీవితం ఆవిధంగా ఉంది. దేవుడికి మనం సాక్షులుగా ఉండాలి. సాక్షులు అంటే ఏదో తెల్లటి వస్త్రాలను ధరించి చేతిలో బైబిల్ పట్టుకుని ఉండడం కాదుకానీ, మన మాటతీరు, ప్రవర్తనలో పరిశుద్ధత, ప్రేమ, క్షమ, అనురాగం, దీర్ఘశాతం ఇవన్నీ ఉండాలి. అలాగని మనలో భావోద్వేగాలు ఉండవని కాదు. కోపపడడంలో పాపం లేదుకానీ, ఆ కోపంలో పాపం చేయకూడదు. నొప్పించేలా ప్రవర్తిస్తే క్షమాపణ అడిగేందుకు జాగుచేయకూడదు. చివరికి పేతురు యేసుక్రీస్తు కోసం తలకిందులుగా సిలువ వేయించుకుని మరణించాడు. నేటికి ప్రభువు శిష్యుడిగా మనకందరికీ ఆదర్శంగా నిలిచాడు.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# స్నేహబంధం మధురాతి మధురం






**స్నేహ బంధము ఎంత మధురము/ అది తరిగిపోదు చెరిగిపోదు జీవితాంతము అన్నారు ఓ సినీ మహాకవి. మరి నిజమే కదండీ స్నేహబంధం ఎంతో మధురాతి మధురంగా ఉంటుంది. జీవితకాలం అది మన వెన్నంటే ఉంటుంది. ఆ ఒక్క పదమే స్నేహం, ఆ పదం ఆనందాన్ని ఇస్తుంది. మండుటెండలో చల్లని ఐస్ క్రీమ్‌ని తింటున్నాను అనుభూతినిస్తుంది స్నేహం. నిర్వచనానికి అందని గొప్ప పదం. ఇంకా చంద్రుడి వెన్నెలలా చల్లదనాన్ని ఇస్తుంది. స్నేహమంటే ఓ నమ్మకం, ఓ ఆహ్లాదం. రెండు మనసులను కలిపే తీయని బంధం.**

స్నేహం జీవితానికి ఓ గమ్యం చూపేది. స్నేహం స్నేహితునితో ఉంటే ప్రతి రోజు పండగే. కానీ దీనికి ప్రత్యేకంగా ఓ రోజు ఉంది. అదే అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం. ఈ స్నేహితుల రోజు వెనక ఓ పెద్ద కథే ఉంది. 1935 ఆగస్టు మొదటి శనివారం అమెరికా ప్రభుత్వం ఓ వ్యక్తిపై కాల్పులు జరిపింది. ఈ విషయం తెలిసి తట్టుకోలేక ఆ మరుసటి రోజు కాల్పుల్లో చనిపోయిన వ్యక్తి స్నేహితుడు ఆత్మహత్య చేసుకుంటాడు. దీనికి చలించిపోయిన అమెరికా ప్రభుత్వం ఆగస్టు నెలలో వచ్చే తొలి ఆదివారం స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. ఈ విధంగా ఇది ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హాల్‌మార్క్ కాల్స్ ఫౌండర్ జాయబ్ హాల్ ఈ కార్డ్స్ కాన్సెప్ట్‌ని మొదటిసారిగా పరాగ్వేలో ప్రతిపాదించారు. 1958 నుంచి అధికంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. 'దోస్త్ మేరా దోస్త్ తుమ్హే మేరీ జాన్/ వాస్తవంగా దోస్త్ నువ్వేరా నా ప్రాణం/ అన్నారు ఓ సినీ కవి అన్నారు. అవును కదండీ చిన్న-పెద్ద, ఆడ-మగ తేడా లేకుండా అందరినీ ఒకటిని చేస్తుంది. ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో తెలియదు. స్నేహమనే చిన్న బంధం వారిని 'నువ్వే నా ప్రాణం' అంటూ ఒకటిగా ఉంచుతుంది. ఇలా ఉన్న స్నేహితులంతా ఈ రోజున తమ స్నేహితులపై ఉన్న ప్రేమను వ్యక్తపరచడానికి తమ స్నేహితులతో ఆనందంగా డోలికల్లో తేలి ఆడతారు. ఈ సందర్భంగా పూలు, కార్డులు, మణికట్టు బ్యాండ్లు వంటివి ఇచ్చి పుచ్చుకుంటారు. అలాగే ఈ రోజు పార్టీలు చేసుకోవడం, విహారయాత్రలకు వెళ్లడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం వంటివి చేస్తారు. ఇలా విభిన్న సంస్కృతుల మధ్య ఐక్యత అవగాహన శాంతిని పెంపొందించేందుకు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ ప్రపంచంలో బంధాలను బలోపేతం చేసుకోవడానికి సంఘీభావం పెంపొందించుకోవడానికి ఈ రోజును ఘనంగా జరుపు కుంటారు. అమ్మ ఒడి వీడాక, నాన్న చెయ్యి వదిలాక దొరికే తోడు స్నేహితుడు. కష్టమైనా కన్నీళ్ళయినా పంచుకునేది ప్రియనేస్తమే అడుగున అండగా నిలిచే ఆత్మబంధు స్నేహితుడు. నిజమే కదండి స్నేహితుడు సంతోషాన్ని పంచుకుంటాడు. భావాలను పంచుకుంటాడు. గతాన్ని గుర్తు చేస్తాడు. వర్తమానాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాడు. అందుకే స్నేహానికి వున్న గొప్పతనం వర్ణించడం ఎవరితరం కాదు. స్నేహాన్ని స్వయంగా అనుభవిస్తే దానిలోని మాధుర్యం అర్థమవుతుంది. ఎవరి మాటలు వింటే ఆనందం కలుగుతుందో, ఎవరు దూరమైతే కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయో, ఎవరు పక్కన లేకుంటే తీరని వెల్తిగా ఉంటుందో, ఆ వ్యక్తే అసలు సిసలైన ఫ్రెండ్ అని చెప్పవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎలా బతకాలో, ఎంత అందంగా జీవించాలో స్నేహం నేర్పుతుంది. అందుకే ఓ మంచి మిత్రుడు మనతో ఉంటే లెక్కలేనంత సంపద మనతో ఉన్నంత ఆనందం కలుగుతుంది. ప్రతి మనిషికి తన భావం స్వేచ్ఛగా వ్యక్తపరచుకోవడానికి ఓ మంచి స్నేహితుడు/ స్నేహితురాలు అవసరం. అలాంటి స్నేహాల్లో ఎలాంటి స్వార్థం ఉండకూడదు. ఒకరినొకరు మోసం చేసుకోకూడదు. ఒక స్నేహంలో పరస్పరం ఎన్నో నేర్చుకోవాలి. విభిన్న అభిప్రాయాలు కలిగి ఉన్నా ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు సాగాలి. ఇవే అసలైన స్నేహానికి నిర్వచనం. ఒక వ్యక్తి గుణగణాలను అతని ఎంచుకున్న స్నేహితుణ్ణి బట్టి నిర్ణయించగలం. నిజమైన స్నేహితుల మధ్య రహస్యాలు ఉండకూడదు. సమయానికి తగినట్లుగా తమ కష్టాలను ఒకరితో ఒకరు పంచుకోవాలి. స్నేహంలో సుఖాలు పంచాలి. దుఃఖాలు దూరమవ్వాలి. కష్ట సమయంలో కలత చెందిన మనసుకి శాంతికి కలిగించే దివ్య ఔషదం స్నేహం. అందుకే కవి గారు అంటారు స్నేహమేరా జీవితం/స్నేహమేరా నా శాశ్వతం అని. అవసరమైనప్పుడు సహకరించడానికి ఆప్త మిత్రులు ఉన్నారని భావన కష్టాలను దూరం చేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇద్దరు వ్యక్తుల మధ్య స్నేహం తెరిచిన పుస్తకం లాంటిది. ఈ సృష్టిలో నా అనే వారు బంధువులు లేని వారు ఉంటారేమో కానీ స్నేహితులు లేని వారు ఉండరు. అలాంటి స్నేహం ప్రకృతి వంటిది. అది ఆహ్లాదంతోపాటు హాయిని ఇస్తుంది. జీవనయాలలో స్నేహం శ్వాస వంటిది. అమ్మ ప్రేమ, స్నేహం ఈ రెండు ఎంతో పవిత్రమైనవి. ఈ పాట చూడండి. ఎంత మధురంగా అద్భుతంగా ఉందో ' ఫ్రెండ్షిప్పే తీయని పుష్పం/ఫ్రెండ్షిప్ దే గుండెల శ్వాసం/ ఫ్రెండ్షిప్పే ఎప్పుడు ఆనందం/ఏటికి ఒకటో రెండో పండగలేమో ఊరికి వస్తాయి/ కానీ చెలిమిలో మాత్రం రోజురోజుకీ సందడులు ఉంటాయి. ఇలా రెండు శరీరాలు ఒకటే ఆత్మ అనే కవుల కలాలతో 'స్నేహానికన్న మిన్న ఈ లోకాన లేదురా' అన్న మధుర గానాలతో స్నేహం నిత్య నూతనంగా ధ్రువతారలా, నిండు చందమామలా ఈ భూమ్యాకాశాలు ఉన్నంతవరకు వెలిగిపోవాలని కోరుకుంటూ.. ప్రియనేస్తాలందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు జేజేలు వందనాలు.





- పింగళి భాగ్యలక్ష్మి

# నచ్చే బ్రేక్‌ఫాస్ట్ రెసిపీ

**టేస్ట్ ఆఫ్ అట్లాస్ తాజాగా ఎంపిక చేసిన 50 బెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ రెసిపీల్లో మూడు మనవే ఉండటం విశేషం. నిజానికి ఊతప్పం, పనియారం, అక్కీ రోటీ, థేప్లా.. ఇలా మన ఫలహారాలెన్నిటినో విదేశీయులు కూడా ఇష్టంగా తింటున్నారు. ఈ సందర్భంలో ఎంపిక చేసిన మిసల్ పావ్, పరోటా, భోలే భటూరేలతో పాటు ఇంకొన్ని వంటకాలు మీ కోసం..**

## మిసల్ పావ్



**కావలసినవి:** పెసలు, శనగల్లాంటి మొలకెత్తిన గింజలు 2 కప్పులు, ఉల్లి తరుగు కప్పు, టొమాటో ముక్కలు ముప్పావు కప్పు, ఉప్పు రుచికి తగినంత, కొత్తిమీర తరుగు అర కాపు పసుపు పావు చెంచా, కారంన్నర చెంచా, మిసల్ మసాలా 3 టేబుల్ స్పూన్లు, బెల్లం టేబుల్ స్పూన్, చింతపండు గుజ్జు చెంచా, నూనె 4 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు 4, కొబ్బరి ముద్దలు, చెంచాలు, 2 టేబుల్ స్పూన్లు, కొబ్బరి తురుము, 2 టేబుల్ స్పూన్లు ముప్పావు చెంచా చొప్పున, కరివేపాకు 2 రెబ్బలు, ఇంగువ పావు చెంచా, పావ్ 8, వెన్న 2 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ 1, సన్న కారప్పూస అర కప్పు 30

**తయారీ:** కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువ ఒక్క దాని తర్వాత ఒక్కటి వేయాలి. అవి వేగాక ఉల్లి తరుగు జోడించాలి. అది గోధుమరంగులోకి మారే వరకూ వేయించి టొమాటో ముక్కలు, అల్లం ముద్ద, కొబ్బరి తురుము జతచేయాలి. టొమాటో ముక్కలు మెత్తబడ్డాక కారం, మీసల్ మసాలా, పసుపు, మొలకెత్తిన గింజలు, ఐదు కప్పుల నీళ్లు, చింతపం గుజ్జు వేసి ఉడికించాలి. గింజలు మెత్తగా ఊడికి, చిక్కగా అయ్యాక కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి దించేసి సన్న కారప్పూస చల్లాలి. పెనం మీద వెన్నతో పావ్లను వేయించుకోవాలి. ఇక వేడివేడిగా మిసల్ పావ్ తిని ఆనందించటమే తరువాయి.

## దలియా ..



**కావలసినవి:** గోధుమ రవ్వ అర కప్పు, పెసరపప్పు 2 టేబుల్ స్పూన్లు, బెల్లం పొడి 4 టేబుల్ స్పూన్లు, చిక్కటి పాలు ఒకటిన్నర కప్పు, పిస్తా, కిస్మిస్, బాదం, జీడిపప్పులు గుప్పెడు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి అర చెంచా,

**తయారీ:** కుంకుమపువ్వు కొద్దిగా బెల్లంపొడిలో కొన్ని నీళ్లు చేర్చి వేడిచేయాలి. పొంగు వచ్చాక వడకట్టి పక్కనుంచాలి. ఫ్యాన్‌లో నెయ్యి వేడిచేసి గోధుమ రవ్వ, పెసరపప్పులను కలియతిప్పుతూ వేయించాలి. రవ్వ, పప్పురెండూ చక్కగా వేగి మంచి వాసన వస్తున్నప్పుడు కిస్మిస్, పిస్తా, బాదం, జీడిపప్పులు వేసి.. కొన్ని క్షణాలు వేయించాలి. అందులో రెండు కప్పుల పోసి, మూత పెట్టేసి సన్న సెగ మీద నీళ్లు ఉడికించాలి. మెత్తగా ఊడిన తర్వాత పాలు, కుంకుమ పువ్వు, యాలకుల పొడి జతచేయాలి. చిక్కగా అయ్యాక దించాలి. చల్లారిన తర్వాత బెల్లం పాకం కలపాలి. వేడిగా ఉన్న పృుడు కలిపితే విరిగి నట్లవుతుంది.

## ఛోలే భటూరే ...



**కావలసినవి:** పసుపు ఛోలే కోసం: శనగలు 2 కప్పులు, ఉల్లి తరుగు, టొమాటో ముక్కలు ముప్పావు కప్పు చొప్పున, అల్లం అంగుళం ముక్క, వెల్లుల్లి రెబ్బలు 5, ఎండు కొబ్బరి పొడి టేబుల్‌స్పూన్, నూనె 2 టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకు, స్టార్ మొగ్గ ఒక్కొకటి, యాలకులు 2, లవంగాలు, లవంగాలు, 4, లవంగాలు, పొడి, లవంగాలు, 4, లవంగాలు, చోలే మసాలా చెంచా చొప్పున, కొత్తిమీర తరుగు గుప్పెడు, నిమ్మకాయ 1 **తయారీ:** శనగలను ముందు రోజు రాత్రి నానబెట్టి, ఉదయం ఆ నీళ్లు తీసేసి కుక్కర్లో నాలుగు విజిల్స్ వచ్చేదాకా ఉడికించాలి. అల్లం, వెల్లుల్లి, కొబ్బరి పొడి, ఉల్లి, టొమాటో ముక్కలను మిక్సీ జార్లో వేసి గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఆవాలు, జీలకర్ర, బిర్యానీ ఆకు, స్టార్ మొగ్గ, యాలకులు, లవంగాలను వేయించాలి. అందులో గ్రైండ్ చేసిన మసాలా చేర్చాలి. పచ్చి వాసన పోయే వరకూ కలియబెట్టి ఉడికించిన శనగలు, పసుపు, ఉప్పు, తగినన్ని నీళ్లు జతచేయాలి. మధ్యమధ్యలో కలియతిప్పుతూ సన్న సెగ మీద 20 నిమిషాలు ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి దించాలి. నిమ్మకాయను ముక్కలుగా కోసి గార్నిష్ చేయాలి. వెడల్పాటి పాత్రలో మైదా, అర కప్పు వేడి నీళ్లు, రవ్వ, పంచదార, నెయ్యి వేసిమెత్తగా అయ్యే వరకూ కలిపి రెండు గంటలు పక్కనుంచాలి. ఈ పిండితో ఐదారు అంత వెడల్పు ఉండేలా భటూరాలు చేయాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో లేత గోధుమ రంగు వచ్చే వరకూ వేయించాలి. అంతే.. నోరూరించే ఛోలే భటూరే సిద్ధం.

## సాబూదానా కిచిడీ..

**కావలసినవి:** సగ్గుబియ్యం (సాబూదానా) కప్పు, పల్లీలు పావు కప్పు, ఉప్పు రుచికి తగినంత, పంచదార చెంచా, నూనె 2 టేబుల్ స్పూన్లు, బంగాళదుంప 1, పచ్చిమిర్చి 3, కొత్తిమీర తరుగు గుప్పెడు, అల్లం తరుగు, నిమ్మరసం చెంచా చొప్పున, ఒక కరివేపాకు



**తయారీ:** బంగాళదుంప చెక్కు తీసి సన్నగా ముక్కలు కోసుకోవాలి. సగ్గుబియ్యం కడిగి, మునిగే వరకూ నీళ్లు పోసి నానబెట్టాలి. రెండు గంటల తర్వాత ఆ నీళ్లు వడకట్టేయాలి. పల్లీలను వేయించి, చల్లారాక కచ్చాపచ్చాగా దంచాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. జీలకర్ర, కరివేపాకు చేర్చాలి. అవి వేగాక బంగాళదుంప ముక్కలను వేయించాలి. రెండు నిమిషాల తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగు జోడించి కాస్త వేగనివ్వాలి. అందులో సగ్గుబియ్యం, పల్లీలు, ఉప్పు, పంచదార జతచేసి మధ్యమధ్యలో కలుపుతుండాలి. చివర్లో కొత్తిమీర తరుగు, నిమ్మరసం చల్లి దించాలి. ఇది పల్లీ లేదా కొబ్బరి పచ్చడితో తింటే సూపర్‌గా ఉంటుంది. □


## ఎండబెట్టడం ఎంత తేలికో !



చారులో నంజుకోవడానికి వడియాలుంటే ఎంత బాటుంటుంది కదూ! కానీ వాటిని ఎండబెట్టడం పెద్ద ప్రహసనమే. దుమ్మూధూళీ పడుతుంది. కాకులు, పిల్లలు వంటి జీవాలు వస్తాయనే బెంగ ఉంటుంది. ఇక అలాంటి భయాలేమీ అవసరం లేదు. నైలాన్ నెట్టింగ్ ఫోల్డర్ కొనుక్కుని.. ఎండ తగిలే చోట కొక్కేనికి తగిలించేయొచ్చు. వీటిలో 3 నుంచి 5 వరకూ అరలుంటాయి. వడియాలు, చల్ల మిరప కాయలు, ఎండు మిరపకాయలు, మాగాయ పచ్చడికి ముక్కలు, పొడి చేసుకునేందుకు కూరగాయలు.. ఇలా వేటినైనా భేషుగ్గా ఎండబెట్టుకోవచ్చు. ముఖనయంగా అపార్ట్‌మెంట్‌లో ఎండబెట్టేంత చోటు లేనివారికి ఇది మరింత ఉపయోగపడుతుంది. □

# ‘వార్ 2’ సంచలనం..

వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి రాబోతోన్న వార్ 2 చిత్రంపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి ఉన్న భారీ హైప్, క్రేజ్‌ని చాటేలా ప్రీ సేల్స్ జరుగుతున్నాయి. వార్ 2 సినిమాకు సంబంధించి నార్త్ అమెరికాలో ఇప్పటికే 100కె డాలర్ల క్రాస్ రికార్డులు క్రియేట్ చేస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. ఉత్తర అమెరికా మార్కెట్లో యుఎస్‌డి 100,000 ముందస్తు టిక్కెట్ల అమ్మకాలను దాటిన అత్యంత వేగవంతమైన భారతీయ చిత్రంగా వార్ 2 నిలిచింది. కేవలం ఏడు గంటల్లోనే ఈ ఘనతను వార్ 2 సాధించింది. హృతిక్ రోషన్ ఎన్టీఆర్ క్రేజ్‌కు ఇదే నిదర్శనం అని చెప్పుకోవచ్చు. ఇక ఇదే మైలురాయిని చేరుకోవడానికి ఎన్టీఆర్ దేవరచిత్రానికి 11గంటల 37 నిమిషాలు పట్టింది. అయితే ఇప్పుడు మళ్లీ వార్ 2తో ఎన్టీఆర్ తన రికార్డును తానే తిరగ రాశారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన వార్ 2లో కియారా అద్వానీ కథానాయికగా నటించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఊపిరి ఊయల లాగా అనే పాట సోషల్ మీడియాని ఊపేస్తోంది. ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాష ల్లో వార్2 భారీఎత్తున విడుదల కాబోతోంది. ప్రీ సేల్స్‌తోనే వార్ 2 సరికొత్త అయింది.



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన కింగ్‌డమ్ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన కింగ్‌డమ్ చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది.

# అభిమానుల కళ్లల్లో ఆనందం ‘కింగ్‌డమ్’

తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. **కింగ్‌డమ్ సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఏమనిపిస్తుంది?** చాలా చాలా సంతోషంగా ఉంది. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాలలో, ఓవర్సీస్‌లో విశేష స్పందన లభిస్తుంది. **ఇంతటి విజయం దక్కడంపై మీ స్పందన ఏంటి?** కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. **దర్శకుడు గౌతమ్ తిన్ననూరి గురించి?** గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్‌ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. **రెండవ భాగం ఎలా ఉండబోతుంది?** ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. **ఈ సినిమాలో ఆయుధాలతో ఓటింగ్ వేసే సన్నివేశాలకు మంచి స్పందన వస్తోంది. ఆ సీన్స్ చెప్పినప్పుడు మీ రియాక్షన్ ఏంటి?** గౌతమ్ కథ చెప్పినప్పుడు ఓటింగ్ వేసే సన్నివేశాల గురించి చెప్పాడు కానీ, ఆ ప్రాసెస్ ఎలా ఉంటుందో చెప్పలేదు. ఆ తర్వాత ఇలా గన్‌లు, కత్తుల వంటి ఆయుధాలతో ఓటింగ్ ఉంటుందని చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆ కొత్తదనమే ప్రేక్షకుల మెప్పు పొందడానికి కారణమైంది అనిపిస్తుంది. **కింగ్‌డమ్ కోసం మీరు ఎలాంటి హోం వర్క్ చేశారు?** ఈ కథ విన్న తర్వాత అసలు ఆ కాలంలో ఎలా మాట్లాడేవారు, ఎలాంటి దుస్తులు వేసుకునేవారు వంటి విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాను. **ఈ సినిమాకి మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?** ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమాపై కురిపిస్తున్న ప్రేమనే నా దృష్టిలో బెస్ట్ కాంప్లిమెంట్. **ఈ చిత్రంలో మీరు షిప్ ను లాగే సీన్ జెర్సీ మూమెంట్ లాంటిదని చెప్పవచ్చు. ఆ షూటింగ్ సమయంలో మీ ఫీలింగ్ ఏంటి?** మే నెలలో మండు టెండలో ఆ సీన్ షూట్ చేశాము. చిత్రీకరణ సమయంలో ఓ మంచి సన్నివేశం చేస్తున్నామన్న సంతృప్తితో చేశాము. **సినీ పరిశ్రమ నుంచి ఎలాంటి ప్రశం సలు వచ్చాయి?** సినిమాచూసి సుకుమార్ ఫోన్ చేశారు. సినిమా తనకు ఎంతగానో నచ్చిందని చెప్పారు. నాకు సుకుమార్ అంటే ఎంతో ఇష్టం.



# ‘ఓజీ’ నుంచి ఫస్ట్ సాంగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ శక్తి వంతమైన పాత్ర ఓజాస్ గంభీరగా అలరించనున్న చిత్రం ఓజీ. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీప్రియుల్లో ఈ చిత్రంపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఓజీ చిత్రం నుంచి మొదటి గీతం ఫైర్ స్టార్మ్ విడుదలైంది. ఈ గీతం నిజంగానే ఓ అగ్ని తుఫానులా ఉంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఓజీ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తు న్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ భీకరమైన గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హాష్మి, ప్రియాంక మోహన్, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీత సంచల నం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాకుడిగా రవి కె చంద్రన్, ఎడిటర్‌గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. తమన్ స్వరపరిచిన ఫైర్ స్టార్మ్ గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తోంది. ఓజాస్ గంభీర పాత్ర ఏ స్థాయిలో ఉండబోతుందో తెలిపేలా తమన్ సంగీతం ఎంతో పవర్ ఫుల్‌గా ఉంది. అదిరిపోయే ఎలక్ట్రానిక్ బీట్స్, భారీతనం, రా ఇంటెన్సిటీని మిళితం చేస్తూ సాగిన ఈ గీతం అగ్ని తుఫానుని తలపిస్తోంది. పవన్ కళ్యాణ్ యొక్క వ్యక్తిత్వానికి నివాళి అన్నట్టుగా ధైర్యంతో నిండిన ఈ పాట సాహిత్యం కూడా అద్భుతంగా ఉంది. ప్రముఖ నటుడు శింబు ఈ పాటకు తన శక్తివంతమైన గాత్రాన్ని అందించారు. విడుదలైన క్షణం నుండే సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది.



నేడు ప్రకటించిన 71వ జాతీయ అవార్డ్స్‌లో “బేబి” సినిమా సత్తాచాటింది. ఈ చిత్రానికి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్ ఎస్ రోహిత్(ప్రేమిస్తున్నా పాటకు) అవార్డ్ గెల్చుకున్నారు. “బేబి” సినిమాకు సాయి రాజేశ్ రాసిన హృద్యమైన కథనం జాతీయ స్థాయిలో పురస్కారం సాధించింది. అలాగే ఈ చిత్రంలో ప్రేమి స్తున్నా అనే పాటను మనసుకు హత్తుకునేలా పాడిన సింగర్ పీవీఎన్ ఎస్ రోహిత్ ప్రతిభను నేషనల్ అవార్డ్ వరిం చింది. “బేబి” సినిమాకు సైమా, గామా, ఫిలింఫేర్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డ్స్ దక్కగా, రెండు జాతీయ అవార్డ్స్ అత్యున్నత గౌర వాన్ని అందిం చాయి. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన

# ‘జాతీయ అవార్డ్స్‌లో సత్తాచాటిన ‘బేబి’

పాత్రల్లో మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్‌కేఎన్ నిర్మాణంలో దర్శకుడు సాయి రాజేశ్ “బేబి” చిత్రాన్ని రూపొం దించారు. కల్ట్ బ్లాక్ బస్టర్‌గా ప్రేక్ష కుల మనసుల్ని గెల్చుకున్న ఈ సినిమా...



బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల గ్రాసర్‌గా నిలిచింది. ప్రస్తుతం “బేబి” సినిమా హిందీ రీమేక్ చిత్రీకరణ సన్నా హాలు జరుగుతున్నాయి. అలాగే కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా “బేబి” సినిమా కాంబినేషన్‌లో ఎస్ కేఎన్ నిర్మాతగా, సాయి రాజేశ్ నిర్మాత, రైటర్‌గా, రవి నంబూరి దర్శకుడిగా “చెన్నై లవ్ స్టోరీ” రూపొందుతోంది.



అనన్య నాగళ్ల నయా లుక్

# 29న ‘పరమ్ సుందరి’

‘జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటించిన పరమ్ సుందరి మూవీ ఆగస్టు 29న విడుదల కాబోతోంది. బాలీవుడ్ జనాలు ప్రస్తుతం వార్2 మూవీ గురించి వేచి చూస్తున్న తరుణంలో తన సినిమా డేట్‌ని అనౌన్స్ చేసి అందరికీ షాక్ ఇచ్చారు డైరెక్టర్ ఎన్నో అంచనాలతో పరమ్ సుందరి మూవీని విడుదల చేయడానికి రెడీ అయిపోయారు చిత్ర యూనిట్. ఈ నేపథ్యంలోనే పరమ్ సుందరి మూవీలో జంటగా నటించిన జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రాల ఏజ్ గ్యాప్‌పై ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ వస్తున్నాయి. చాలామంది ఈ జంటను టార్గెట్ చేస్తూ ఎక్స్ వేదికగా ట్రోల్స్ చేస్తున్నారు. తుషార్ జాలోట డైరెక్షన్లో రాబోతున్న ఈ సినిమాకి సంబంధించిన మ్యూజిక్, టీజర్ అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కానీ ఒకే ఒక్క అంశం మాత్రం సోషల్ మీడియాలో భారీ ట్రోలింగ్‌కి గురవుతోంది. అదే హీరో, హీరోయిన్ మధ్య ఏజ్ గ్యాప్.. జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా మధ్య 12 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉండడంతో చాలామంది ఈ విషయాన్ని వైరల్ చేస్తున్నారు. అంటూ చాలా దారుణంగా ట్రోల్స్ చేస్తూ ఉండడం గమనార్హం. వీబి ఫస్ట్ సాంగ్ రిలీజ్.. థియేటర్లలో ఫ్యాన్స్‌కు పూనకాలే వాస్తవానికి ఈ మధ్యకాలంలో చాలా సినిమాల్లో నటించిన హీరో హీరోయిన్ల మధ్య ఏజ్ గ్యాప్‌పై ట్రోల్స్ వినిపిస్తున్న సంగతి మనకు తెలిసిందే. అయితే అటు ఈ ఏజ్ గ్యాప్‌పై వచ్చిన ట్రోలింగ్‌ని హీరో, హీరోయిన్లు తిప్పికొట్టే ప్రయత్నం చేసినా ట్రోల్స్ మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా ఈ సినిమాలో హీరో, హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ అస్సలు బాలేదని, ఏజ్ గ్యాప్ స్పష్టంగా తెలిసిపోతోందని, ఇద్దరితో బలవంతంగా కెమిస్ట్రీ పండించినట్టు స్పష్టంగా అర్థం అవుతోందంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు. అంతేకాదు వీరిద్దరి ఏజ్ గ్యాప్ వల్ల సినిమాలోని ప్రేమ కథకి కూడా దెబ్బ పడుతుంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరు అచ్చం అన్నా చెల్లెళ్లలాగే ఉన్నారని కూడా అంటున్నారు. మేకప్ వేసి ఇద్దరి మధ్య వయసు వ్యత్యాసం ఎంత తగ్గించాలనుకున్నా కూడా చూసే ఆడియన్స్ ఇట్టే కనిపెట్టే స్తారు అని, ఈ సినిమా నటీనటుల ఎంపిక చాలా దరిద్రంగా ఉంది అంటూ కామెంట్లు పెడుతున్నారు.



# పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్ ‘బకాసుర రెస్టారెంట్’

వినోదంతో పాటు ఎమోషన్‌ను మేళవించి.. ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్‌టైన్ చేయడమే ధ్యేయంగా రూపొందిన చిత్రం బకాసుర రెస్టారెంట్. ఈ సినిమా చూసిన వాళ్లకు ఓ మంచి విందు భోజనం ఆరగించిన ఫీల్ కలగబోతుందని చెబుతోంది చిత్ర టీమ్. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతుంది.

ఇటీవల విడుదలైన ఈ చిత్రంలోని పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈవేడుకకు హీరో సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ, ప్రవీణ్ నాకు వన్‌ఆఫ్ ఫేవరేట్ యాక్టర్. నన్ను ఏ దర్శకుడు అడిగినా నేను ప్రవీణ్ పేరు చెబుతాను. ఏ సినిమా అయినా ఎలా సక్సెస్ చేయాలో తపన పడుతుంటాడు. ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నాడు. మంచి నటుడే కాదు మంచి వ్యక్తి కూడా. అందరి మంచి కోరుకుంటాడు. అందరికి మర్యాద ఇచ్చే వ్యక్తిఅన్నారు. నిర్మాత జనార్థన్ మాట్లాడుతూ, ఈ సినిమాకు కథే హీరో.. మంచి కథను దర్శకుడు చాలా బాగా తెరకెక్కించాడు. నటుడు ప్రవీణ్, వైవా హర్ష.. ఇలా అందరం కలిసి బకాసుర రెస్టారెంట్‌లో మంచి డిష్‌ను ప్రిపేర్ చేశాం. అందరికి మా డిష్. అంటే మా సినిమా నచ్చుతుందని అనుకుంటున్నాను. మా సినిమాను దిల్ రాజు బ్యానర్ ఎస్‌వీ ద్వారా విడుదల చేస్తున్నాం అన్నారు. దర్శకుడు ఎస్ జే శివ మాట్లాడుతూ, విరూపాక్షకు దర్శకత్వ శాఖలో పనిచేశాను. ఆ సినిమా వల్లే నేను దర్శకుడినయ్యాను. వికాస బడిస భవిష్యత్‌లో పెద్దసంగీత దర్శకుడవుతాడు అన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ, మా జీవితాలకు టర్నింగ్ పాయింట్‌గా నిలిచిన ప్రేమకథా చిత్రమ్ హీరో అతిథిగా రావడం ఆనందంగా ఉంది.

నన్ను నమ్మి కథలో నన్ను ప్రధాన వస్తువుగా సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. వికాస బడిస సంగీతం టాక్‌ఆఫ్ ది టౌన్, టెక్నిషియన్స్ అందరూ ది బెస్ట్ ఇచ్చారు. శివ కథ చెప్పినప్పుడే గ్యారంటీగా బాగా తీయగలడు అనే నమ్మకం కలిగింది. బకాసుర రెస్టారెంట్ ఇంటిల్లాపాఇది చూడాల్సిన ఎంటర్‌టైనర్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం రాజేష్, షైనింగ్ ఫణి, వివేక్ దండు, అమర్, రామ్ పటాస్, రమ్య ప్రియ, ప్రాచీ ఠాకూర్, డిఓపీ బాల సరస్వతి, సంగీత దర్శకుడు వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వినయ్ కొట్టి తదితరులు పాల్గొన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య ప్రియ, ప్రాచీ ఠాకూర్, జబర్దస్త్ అప్పారావు తదితరులు.



# ‘త్రిబాణధారి బార్బరిక్’లో అదరగొట్టేసిన ఉదయభాను

వెర్సటైల్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం త్రిబాణధారి బార్బరిక్. కొత్త పాయింట్, కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యులాయిడ్ బ్యానర్‌పై విజయ్‌పాల్ రెడ్డి అడిదాల నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలైన పాటలు ఇప్పటికే ప్రేక్షకులను అలరించాయి. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఓ మాస్ నంబర్‌ను వదిలారు. ఈ స్పెషల్ సాంగ్‌లో ఉదయ భాను అందరినీ ఆకట్టుకున్నారు. ఇస్కితడి ఉస్కితడి అంటూ సాగే ఈ పాటను రఘు రామ్ రచించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన ఈ పాట అందులోనూ ఉత్సాహాన్ని నింపేలా ఉంది. ఇంఫ్యూజన్ బ్యాండ్ ఇచ్చిన బాణీకి బీ, సీ సెంటర్లు ఊగిపోయేలా ఉన్నాయి. ఇక ఇందులో ఉదయ భాను స్టెప్పులు స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. ఇప్పటి వరకు వదిలిన నీ వల్లే నీవల్లే, అనగనగా కథలా, బార్బరిక్ థీమ్ సాంగ్ అందరినీ మెప్పించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. రిలీజ్ కోసం చిత్రయూనిట్ ప్రమోషన్ కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. ఈ చిత్రంలో సత్యరాజ్, సత్యం రాజేష్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, క్రాంతి కిరణ్ వంటి వారు నటించారు. ఇక ఉదయ భాను పాత్ర మరింత ప్రత్యేకంగా ఉండబోతోందని తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీని టీం ప్రకటించనుంది. తారాగణం: సత్యరాజ్, సత్యం రాజేష్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, క్రాంతి కిరణ్, విటివి గణేష్, మొట్టా రాజేంద్రన్, మేఘన తదితరులు. రచన, దర్శకత్వం: మోహన్ శ్రీవత్స.



# అందంతో అలరిస్తున్న ‘ఆషిక’

కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. తెలుగులో అమిగోస్, నా సామి రంగ సినిమాలతో అలరించిన ఈ అమ్మడు ఆ సినిమాలు నిరాశ మిగల్చడంతో మళ్లీ కన్నడంలో బిజీ అయింది. అక్కడ నుంచి తిరిగి టాలీవుడ్‌లో విశ్వంభర సినిమాతో ఎంట్రీకి సిద్ధంఅయింది. విశ్వంభర సినిమాలో త్రిష మెయిన్ లీడ్ కాగా, ఆషికా సెకండ్ హీరోయిన్‌గా కనిపించబోతున్నట్లు సమాచారం అందుతోంది. వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర సినిమా ఈ అక్టోబర్ లేదా నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ వర్క్ చివరి దశలో ఉన్నట్లు దర్శకుడు వశిష్ట ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. విశ్వంభర సినిమాపై ఆషికా చాలా ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. సింపుల్ లుక్‌లో ఆషికా రంగనాథ్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆషికా స్కిన్ షో చేయకుండానే చాలా అందంగా కనిపిస్తూ ఉంటుంది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే ఆ ఫోటోలకు రీచ్ ఉంటుంది. కానీ ఆషికా ఇలా పద్ధతైన ఔట్ ఫిట్‌లోనూ చాలా అందంగా కనిపించడం ద్వారా ఎక్కువ రీచ్‌ను సొంతం చేసుకుంటుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసిన ఆషికా రంగనాథ్ ఆకట్టుకునే అందం కారణంగా మరిన్ని ఆఫర్లు సొంతం చేసుకుంటుంది. సింపుల్ పాత్రలకు మోస్ట్ వాంటెడ్ ఛాయిస్ ఆషికా అనడంలో సందేహం లేదు. అందుకే ఆమెను మళ్లీ మళ్లీ పలువురు ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాల్లో నటింపజేయడం చూస్తూ ఉంటాం. ముందు ముందు టాలీవుడ్‌లో ఈమె బిజీ స్టార్‌గా మారడంఖాయం. తాజాగా ఈమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన అందమైన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. నా సామి రంగ ఏం అందం అన్నట్లుగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ పంజాబీ డ్రెస్‌లో వెనుక నుంచి నడుము అందం చూపించడం ద్వారా కవ్విస్తుంది. సింపుల్‌గా ఉన్నా ఈ లుక్‌లో ఆషికా అందం ఓ రేంజ్‌లో ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆషికా ఇంత అందంగా ఉండటం వల్లే కెరీర్ ఆరంభం అయ్యి పదేళ్లు అయినా వరుస ఆఫర్లు దక్కించుకుంటూనే ఉంది. ప్రస్తుతం కన్నడ సినిమాలతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ నటిస్తుంది.



# యువశాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతున్న వ్యవసాయ వర్సిటీ



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్, ఉపకులపతి అల్దాస్ జానయ్య

### భవిష్యత్‌లో నం-1 స్థానానికి వర్సిటీ: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### ఘనంగా 55వ స్నాతకోత్సవం

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 2, ప్రభాతవార్త:** దేశ వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంతో కీలకంగా పని చేస్తుందని, ఎంతో మంది యువశాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగింది. 2021-22 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యూజీ, పీజీ, పిహెచ్‌డి విద్యార్థులకు విశ్వవిద్యాలయ కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అధ్యక్షతన స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేశారు. తొలుత పిజెటిఎయు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పించారు. విశ్వవిద్యాలయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందుతున్నాయని అల్దాస్ జానయ్య తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని జానయ్య తెలిపారు. అగ్రి హబ్, ఇతర ల్యాబ్‌ల్ని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఐసీఎఆర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని జానయ్య వివరించారు. అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ మాట్లాడుతూ...విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందన్నారు. దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ, ఇతర రాష్ట్రాల కారణంగా దేశం వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని జాట్ అన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని 2047 నాటికి 'వికసిత్ భారత్'గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పిజెటీఏయూ ఈ మధ్య నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం, ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు. వాతావరణమార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని.. యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ పిలుపు నిచ్చారు. ఈ స్నాతకోత్స వంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీ హెచ్. విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మం డలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధి కారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐసీఎఆర్ సంస్థల ప్రతి నిధులు, అధికారులు వివిధ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఎడ్‌సెట్-2025 వెబ్‌ఆప్షన్లు

### 9న సీట్ల కేటాయింపు

### 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా రేపటి(సోమవారం) నుంచి అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 9న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎడ్ సెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను జూలై 14న జారీ చేయగా.. జూలై 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఎడ్ సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి జూలై 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జూలై 23 నుంచి 26 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు అర్హులైన వారి జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పొందు పరిచారు. కౌన్సెలింగ్‌కు అర్హత సాధించిన వారు ఈ నెల 4(సోమవారం), 5(మంగళవారం) రెండు రోజులు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 6న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఎడ్ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 9న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్‌తో ఈ నెల 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్లు అధికారులు కౌన్సెలింగ్‌లో ప్రకటించారు.

## బిసిలను మోసం చేసిందే బిజెపి

### జనహిత పాదయాత్రతో సంక్షేమ పథకాలపై ప్రజలకు చైతన్యం : ఎమ్మెల్యే బాలునాయక్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవితో బిసిల పట్ల ఆ పార్టీ చిత్త శుద్ధి తేలిపోయింది బిజెపి బిసిలను మోసంచేసే పార్టీ అని ఎమ్మెల్యే బాలునాయక్ ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో అందు బాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని ప్రజలు, స్థానికుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు జనహిత పాదయాత్ర చేపట్టారని ఆయన వివరించారు. బడుగు బలహీనవర్గాలు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ 42శాతం రిజర్వేషన్ బిల్లు తెస్తే బిసి రిజర్వేషన్లకు బిజెపి నేతలు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. దళిత బిడ్డను పార్టీ అధ్యక్షుడిని చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బిసి 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని ప్రధానిని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు బిఆర్ఎస్ హయాంలో ప్రారంభించారని, నీటి వాటాను తాకట్టు పెట్టింది బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే లంబాడా, తెలంగాణ లంబాడీలు జీవితాంతం ఇందిరాగాంధీకి రుణపడి ఉంటారని ఆయన అన్నారు.

## ముస్లింల పేరిట రిజర్వేషన్లను బిజెపి అడ్డుకునే యత్నం

### బలహీనవర్గాల వ్యతిరేకి రామచందర్‌రావు

### బిజెపి నేతల ధర్నాపై మంత్రి పొన్నం ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ముస్లింల పేరు చెప్పి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కడుపులో కత్తులు పెట్టుకొని అదుముకున్నవిధంగా బిసి రిజర్వేషన్లపై ధర్నా చేస్తున్న బిజెపి నేతల తీరు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ నుండి మొదలు కులగణన చేసి న్యాయ పరమైన చిక్కులు లేకుండా బిసిలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ చట్టంచేసి గవర్నర్‌కు పంపించి అక్కడినుండి రాష్ట్రపతికి పంపించడం వరకు తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన ఈ బిల్లుపై బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండి హైదరాబాద్‌లో ధర్నా చేయడాన్ని ప్రజలు నవ్వు కుంటు న్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభ లో బిసిలకు రిజర్వేషన్లపై మద్దతు ఇచ్చి ముస్లింల పేరు మీద అడ్డుకుం టున్నారని అవేదన చెందారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తప్పులు ఉంటే సవరించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు.

బిసిలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. బలహీనవర్గాల వ్యతిరేకి రామచంద్రరావు చేసే ధర్నాలో మీరు పాల్గొని మీరు కూడా బల హీన వర్గాల వ్యతిరేకిగా మారుతున్నారని ఆయన అన్నారు.

బిజెపి నేతలు బిసిలు రిజర్వేషన్లు సాధించాలనుకుంటే ఈ ధర్నా ఢిల్లీలో చేయాలి ప్రధాని మోడీని ఒప్పించండి అని ఆయన కోరారు. సోమవారం అందరం కలిసి ఢిల్లీ వెళ్దాం రండి మన రిజర్వేషన్లు సాధించుకుందామని ఆయన అన్నారు. బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ధర్నా చేయాల్సింది హైదరాబాద్‌లో కాదు ఢిల్లీలో అని ఆయన హితవు చెప్పారు. బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు పక్కా బిసిల వ్యతిరేకి మంత్రి పొన్నం పునరుద్ఘాటించారు. బిజెపి నేతలు మీ స్థాయిని ధర్నాచౌక్ వరకు కాకుండా మాతో కలిసి ఢిల్లీ రండి అని మంత్రి పొన్నం కోరారు.



అభివాదం చేస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌మార్‌గౌడ్, కూరెళ్ల వేములయ్యగౌడ్, అనంతరాజుగౌడ్ తదితరులు

## లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లును నిషేధించే కుట్ర

### మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగా లిక్కర్ మాఫియాకు తలొగ్గి హైదరాబాద్‌లో కల్లును నిషేధించే కుట్రలు చేస్తుందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఎక్కడో కల్లు కల్తీ ఘటన జరిగితే దాని బూచిగా చూపి కల్లును నిషేధించడం కుట్రగా కనిపిస్తుందని లిక్కర్ మాఫియానే కల్లులో ఏమైనా కలిపిందనే అనుమానాలు వ్యక్తమవుతునాయని అన్నారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఐలి వెంకన్నగౌడ్, గౌడజనహక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎలికట్టె విజయకుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై నెలకొన్న సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన కల్తీ కల్లుఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షులు దుర్గయ్య గౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ లీగల్ అడ్వైజర్ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమగ్రాభివృద్ధికి కృషి

### రూ.20,500 కోట్లతో పిఎం కిసాన్ నిధి

### ఆర్థికంగా మూడో స్థానంలోకి భారత్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**యాచారం, ఆగస్టు 2, ప్రభాతవార్త :** భారత దేశంలో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ రైతు సమగ్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉత్తర ప్రదేశ్ వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సమ్మేళనం కార్యక్రమాన్ని యాచారం మండల కేంద్రంలోని రైతు వేధిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌సిఎఆర్ క్రీడా జోన్ ఎక్స్ డైరెక్టర్ వికేసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి ఉష, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, ఆర్డిఓ అనంతరెడ్డి, వివిధ గ్రామాల నుండి విచ్చేసిన రైతులు కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా 20,500 కోట్ల రూపాయలు విడుదల చేసి 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా పిఎం కిసాన్ నిధి ప్రారం భించినట్లు తెలిపారు. ప్రపంచ ఆర్థిక గణాంకాల ప్రకారం భారతదేశము నాలుగో స్థానంలో ఉందని నేడు మూడో స్థానానికి చేరే ప్రయత్నం కృషి జరుగుతుందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వర కు వ్యవసాయంపై మక్కువతో దేశంలో గణనీయంగా వృద్ధి జరిగిందని మన దేశం నేడు ఇతర దేశాలకు ఆహార ఉత్పత్తులు సరఫరా చేసే స్థాయికి అగ్రగామిగా నిలిచింద న్నారు. ఇతర దేశాలకు భారతదేశం అభివృద్ధి మింగుడు పడడం లేదన్నారు.140 కోట్ల మంది జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తులు చేస్తూ ఇతర దేశాలకు ఎగుమతులు చేసి స్థాయికి వెళ్లి అగ్రస్థానం నిలుస్తూ శత్రుద్దేశం గుండెల్లో గుబులు పుట్టించే స్థాయికి చేరుకున్నామన్నారు. కరోనా కష్టకాలంలో కరోనా వ్యాక్సిన్ తయారుచేసి హైదరాబాదు నుండి 45 దేశాలకు ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ను అందించిన ఘనత మనదే అన్నారు. పూర్వం మన దేశంలో పాల ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండేదని నేడు దేశంలో పాల ఉత్పత్తుల్లో ఎంతో అభివృద్ధి సాధించి మెరుగైన పోషకాహారాలను అందిస్తున్నామన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ బడుగు బలహీన వర్గాల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతుల అభ్యున్నతి కోసం దాన్యం మద్దతు ధర 2380 అందజేస్తూ రైతుకు ఎంతో బసటగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్ర ఏర్పడిదని నేడు రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని, రాష్ట్రం అప్పుల్లో ఉందని భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధిచేసి చూపిస్తామన్నారు. కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ఎంసి డైరెక్టర్లు మస్కి నర సింహ, గులాం అక్బర్, పిఎస్‌సిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, కొప్పు సుకన్య భాష్యం,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు మాజీ సర్పంచ్లు అంజయ్య యాదవ్, దేరంగుల రాజు, విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, మూడేడ్ల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ నాయక్, వరికుప్పల సుధాకర్, నెర్రె శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



యాచారంలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు

## గోదావరి, కృష్ణా జలజగడం పరిష్కారానికి ప్రభుత్వం కృషి

### బిసి ద్రోహుల పార్టీ బిజెపి: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** గోదావరి, కృష్ణా నది జలజగడాల శాశ్వత పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని బిఆర్ఎస్ నాయకగణం వీలైతే సహకరించండి లేదంటే తప్పుడు ప్రచారాన్ని మానుకోండి అంటూ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హితవు చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ లాగా దొంగతనంగా ఢిల్లీకి పోయే పద్ధతి రేవంత్ రెడ్డికి తెలియదుహైదరాబాదులో పుట్టిన మీ పార్టీ ,మీరు దొంగ సాటుగా ఢిల్లీ పోయి మోడీని,అమిత్ షా, సిఎం రమేష్‌ను కలిసినట్లు రేవంత్ రెడ్డి కలవట్లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ సమాజం కోసం రేవంత్ రెడ్డి 100 సార్లు కాదు 500 సార్లు అయినా పోతడు అని ఆయన చెప్పారు. నీళ్లను, నిధులను నియామకాలను మొత్తాన్ని తన కుటుంబానికి మలుపుకున్న కెసిఆర్ కుటుంబానికి శ్రీనివాస్ గౌడ్ వత్తాసు పలుకుతుండని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బనకచర్ల అప్పుడు శ్రీనివాస్ గౌడ్ మంత్రిగా ఉండు ఏం చేసిండని ప్రశ్నించారు. గోదావరి మీద కాళేశ్వరం కట్టి నిధులను దోచుకున్నప్పుడు శ్రీనివాస్ కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రామచంద్ర రావు స్టేట్మెంట్లు తన అజ్ఞానాన్ని తానే చెప్పుకుంటట్లుగా కనిపిస్తుందని అన్నారు. పార్టీ అధ్యక్షుడు బిసి ఉంటేనే ఆయన మార్చి రామచంద్ర రావు అధ్యక్షుడు అయిండు అని అన్నారు. బిసి గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయన కోల్పోతుండు అని అన్నారు. బిజెపి బిసి ద్రోహ పార్టీ అని రామచంద్ర రావు గుర్తిస్తే మంచిదని అన్నారు. మేము మంత్రివర్గంలో, కార్పొరేషన్ లో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చినం రేపు పార్టీలో కూడా ఇవ్వబోతున్నామని అన్నారు.

## డిఇఒలుగా అదనపుబాధ్యతల కేటాయింపులో సర్వీస్ నిబంధనలు పాటించాలి

### ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వినతి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ అధికారులు(డిఈవో)గా అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసి) అప్పగించే సందర్భంలో తప్పకుండా సర్వీస్ నిబంధనలు పాటించాలని కరీంనగర్- ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కె రామకృష్ణారావుకి శనివారం వినతిపత్రం సమ ర్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి(డిఈవో), ఉపజిల్లా విద్యాధికారులు (డిప్యూటీ. డిఈవో)లుగా తాత్కాలిక బాధ్యతలు (ఎఫ్ఏసి) అప్పగించడంలో విద్యా అర్హతలను, ఉన్నతాధికారుల నియామక నిబంధనలను పక్కనపెట్టి తీసుకుంటున్న నిర్ణయాలను ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సర్వీస్ నియమావళి ప్రకారం డిఈవో, డిప్యూటీ డిఈవో పోస్టులకు కనీస అర్హతగా సాధారణ డిగ్రీతోపాటు బిఎడ్ ఉండాలన్నారు. కానీ బిఎడ్ అర్హతలు లేని అధికారులకు ముఖ్యంగా ఏఐఎస్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించడం నింధనలకు విరుద్ధమన్నారు. అంతేకాకుండా విద్యా రంగంలో నైపుణ్యాలు, విద్యాపరమైన అనుభవం అవసరమైన చోట పరిపాలనా కోణంతో తీసుకునే నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందన్నారు.వారి స్వతంత్ర పరిపాలనా పాత్రకు విఘాతం కలగవచ్చని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అభిప్రాయపడ్డారు.

## విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా పంపిణీ చేయాలి

### ఎస్ఎఫ్ఐ విద్యార్థినుల సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చదువుకుంటున్న విద్యార్థినులకు అవసరమైన వారికి శానిటరీ నాప్కిన్స్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గతంలో అమ్మాయిల హాస్టల్, కాలేజీలలో శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా ఇచ్చేవారని.. కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదని ప్రతి గురుకులంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సిటి సిఐటియు కార్యలయంలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విద్యార్థినిల రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినుల కన్వీనర్ పూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రం లో అమ్మాయిల పైన అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బేటి బచావో, బేటి పడావో అని చెప్పే ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశంలో ఒక గంటకి కొన్ని వేల అత్యాచారాలు, కొన్ని వేల మందిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. చట్టం ఉన్నవారికి చుట్టంలాగా లేని వారికి ఎటువంటి చట్టం వర్తించకపోవడం చాలా బాధాకరమన్నారు. మహిళలు ఉపయోగించే నిటరీ నాప్కిన్స్ పైన జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లు, గురుకులాలు, కెజిబివిల్లోని అమ్మాయిలకు సరైన సదుపాయాలు లేక సరిపడ గదులు, వాష్రూమ్స్ లేక అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశరు. వాటిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలు సరైన ఆహారం తీసుకోక అనారోగ్య బారిన పడుతున్నారని, రక్తహీనతకు గురవుతున్నారని, అందుకే అమ్మాయిలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. విద్యార్థులందరూ మహనీయుల చరిత్రలు తెలుసుకొని మహనీయుల అడుగు జాడల్లో నడవాలని, వారి ఆశయదారుల్లో కొనసాగాలని సూచించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీల కంటెంట్, డబుల్ మీనింగ్ వీడియోలు, డ్రగ్స్, గంజాయి, మద్యం, సిగరెట్ లాంటి సంస్కృతి విద్యార్థి నుల్లో కూడా రుద్దబడుతుందని.. వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు.


## ట్రంప్‌కు ప్రధాని మోడీ ఊడిగం.. ప్రజలకు అవమానకరం

### మోడీ, కెసిఆర్ అందంగా అబద్ధాలు చెబుతారు

### పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది?

### సెప్టెంబరు 22 నుంచి చండీగఢ్‌లో జాతీయ మహాసభలు

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధానిమోడీ బాని సత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవమా నకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. అబద్దాలను అందంగా, అవలీలగా చెప్పే వ్యక్తులు ఈ దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్నారని, వారు ఒక్కరు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కాగా, మరొక్కరు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అని అన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నారాయణ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, తెలంగాణ అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవని అబద్దాలేనని ఎద్దెవా చేశారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని మోడీ బానిసత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవమానకరమని.. ట్రంప్ నిరాశ, నిస్పృహాలతో ఇష్టానుసారంగా వ్యవరిస్తుండగా, మన దేశ ప్రధాని స్పృహాలో ఉండి కూడ అబ్బదాలు చెబుతున్నారని మండిపడానదరు. పహల్గాం ఉగ్రవాదులను పార్లమెంట్ సమావే శాలకు ఒక్కరోజు ముందు హతమార్చి వారి శవాలను అడ్డం పెట్టుకుని సభలో తప్పించునే ప్రయత్నం చేశారన్నారు. కాశ్మీర్‌లో 7.50లక్షల మంది భద్రాత సిబ్బందిని మోహరించిన కేంద్రం ఉగ్రవాదులను పట్టు కోకుండా ఇంతకాలం ఏమి చేసిందో చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. మోడీ గ్రాఫ్ పడిపోవడంతో ఆర్ఎస్ఎస్ 75 యేళ్ల వరకే పదవి కాలం అనే అంశాన్ని తెరపైకి తెచ్చిందని, అయితే ప్రధానమంత్రి ఎవరూ అనేది ఇక్కడ కాదని, దేశభద్రత, ఆర్థిక వ్యవస్థ పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాల మార్పు కావాలన్నారు. కర్నాటకలోని ధర్మస్థల పవిత్ర ఆలయాన్ని ట్రస్టీ అపవిత్రం చేసిందని, ఆ దేవాలయాన్ని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఆలయంలో జరిగిన అన్ని దారుణాలకు ట్రస్ట్ బోర్డుదే బాధ్యతని.. వెంటనే బోర్డు సభ్యులను అరెస్టు చేయాలన్నారు. అక్కడ 400 మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడి అత్యంత క్రూరంగా చంపి పూడ్చిపెట్టారని, పవిత్ర ధర్మస్థలా, స్మశానమా అర్థం కావడం లేదన్నారు. ధర్మస్థల ఘటనకు సం బంధించి వార్తల ప్రచురణలను నిలిపి వేస్తూ స్థానిక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేస్తూ తీర్పును ఇవ్వడం స్వాగతి స్తున్నామన్నారు. పొలి టికల్ ఇంజనీర్ల నిర్వాకం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మాయల పక్కీర్ ప్రాణాలు ఎక్కడో చిలకలో దాగి ఉన్నట్లు, ప్రస్తుతం కమిషన్ నివేదికలో మాజీ సిఎం కెసిఆర్ బాగోతం దాగి ఉందని నారాయణ తెలిపారు. పార్టీల ఫిరాయిం పులకు సంబంధించి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినంత మాత్రాన జరిగేది ఏమి లేదన్నారు నారాయణ. స్పీకర్‌కు ఉన్న విశేష అధికారాల నేపథ్యంలో వారి తీర్పును ఎవరూ కాదనే పరిస్థితి ఉండదన్నారు. ఎంఎల్ఎలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ అసలు ఏమి చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. ఎంఎల్ఎలు, ఎంపిలు ఎన్నికైనట్లు సర్టిఫికెట్లను అందజేసి సభలకు పంపేదే ఎన్నికల కమిషన్ అని.. కమిషన్ వద్ద అన్ని వివరాలను ఉంటాయి కదా అలాంటిప్పుడు ఎవరైన పార్టీ ఫిరాయిం పులకు పాల్పడితే ఎన్నికల కమిషన్ తక్షణమే దానిని సుమోటోగా స్వీకరించి అనర్హులుగా ప్రకటించాలన్నారు. సెప్టెంబర్ 22 నుంచి చండీఘర్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో బిజెపి వ్యతిరేక ఫ్రంట్ బలోపేతం చేయడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా ప్రజాఉద్యమాలను ఉదృతంచేసే దిశగా కార్యాచరణను రూపొందించనున్నట్లు నారాయణ వెల్లడించారు.

## న్యాయమైన నీటివాటా కోసం, తెలంగాణ కోసం పనిచేస్తాం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాయలసీమను రతనాల సీమ చేయడం కోసం కాదు, కృష్ణా, గోదావరిలో న్యాయమైన నీటి వాటాను సాధించేందుకు తెలంగాణ కోసం కాంగ్రెస్ నాయకగణం పనిచేస్తోందని చొప్పండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం సిఎల్‌పిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బనకచర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని సిఎం ఇప్పటికే ఢిల్లీ వెళ్లి కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. కేంద్రం కూడా సానుకూలం గా స్పందించింది బనకచర్ల డిపిఆర్‌ను కూడా రిజెక్ట్ చేశారని ఆయన వివరిం చారు.



నారా లోకేష్ మాట్లాడినంత మాత్రాన హడావుడి పడాల్సిన అవసరం లేదని అనుమతులు లేకుండా నారా లోకేష్ బనక చెర్ల ను ఎలా కడతాడో చూస్తాం అని మేడిపల్లి సత్యం ధీమా వ్యక్తం చేశారు. నారా లోకేష్ మాటలను బూచిగా చూపించి హారీశ్‌రావు ప్రభుత్వం పైన విమర్శలు చేస్తు న్నాడని విమర్శించారు. బనకచర్లపైన హారీశ్‌రావు తెగ హడావుడి చేస్తు న్నారని అపహాస్యం చేశారు. హారీశ్‌రావుకు అంత కష్టం అవసరం లేదు బనకచెర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని తెలిపారు. నారా లోకేష్ నా తమ్ముడు లాంటోడు అని కెటిఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని సత్యం విమర్శించారు. బిఆర్ఎస్ మోసగాళ్లకు అడ్డాగా మారిందని విమర్శిం చారు. తెలంగాణ ప్రయోజనాలు రక్షణ కోసమే బిఆర్ఎస్ ఉందన్న హారీశ్ రావు లోకేష్‌ను కెటిఆర్ ఎందుకు కలిసాడో చెప్పాలని నిలదీశారు. మీ లాలూచీ వ్యవహారాలు అన్నీ తమకు తెలుసని అన్నారు.



# ప్రో కబడ్డీకి రంగం సిద్ధం

## 29 నుండి ప్రారంభం

### విశాఖ సహా సహా 4 నగరాల్లో టోర్నీ

### తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పికెఎల్) 12వ సీజన్ ఘనంగా ప్రారంభమయ్యేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి నాలుగు వేదికల్లో టోర్నీని నిర్వహించేందుకు నిర్వాహకులు ప్లాన్ రెడీ చేశారు. ఈ లీగ్‌లో వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ అంతటా 12 జట్లు ట్రోఫీ కోసం తలపడతాయి. ఈ ప్రోలీగ్ టోర్నమెంట్ ఈ నెల 29న వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. దాదాపుగా ఏడేళ్ల తర్వాత వైజాగ్ వేదికగా కబ్బడ్డీ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులు విడుదల చేశారు. పికెఎల్ టోర్నమెంట్ ఈ నెల 29 నుండి అక్టోబర్ 23 వరకు నాలుగు నగరాల్లో జరుగనుంది. వైజాగ్‌లో మొదటి విడత మ్యాచ్‌లు ముగిసిన తర్వాత రెండో భాగం జైపూర్ లోని ఇండోర్ హాల్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మూడో దఫా చెన్నై, చివరిగా ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఢిల్లీ వేదికగా జరగనున్నాయి. ఇందులో భాగంగా వైజాగ్ (ఈ నెల 29 నుండి సెప్టెంబర్ 11 వరకు), జైపూర్ (సెప్టెంబర్ 12, 28), చెన్నై (సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 12 వరకు), ఢిల్లీ (అక్టోబర్ 13 నుండి 23 వరకు) మొత్తం 108 లీగ్ దశ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. హోమ్ టీమ్ అయిన తెలుగు టైటాన్స్ 2018లో చివరిసారిగా ఆరోస్థానాన్ని చేరినా, ఆ తర్వాత జరిగిన అన్ని సీజన్లలో టేబుల్‌ల్లో అట్టడుగుకే పరిమితమైంది. ఈసారైనా బలంగా సత్తా చాటాలని తెలుగు టైటాన్స్ జట్టు ప్రణాళికలు రచిస్తుంది. డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్ ఈ నెల 31న బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనున్నారు. ప్రస్తుతం లీగ్ షెడ్యూల్ విడుదల చేసిన ప్రో కబ్బడ్డీ లీగ్ నిర్వాహకులు ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌గా

# భారత్ మహిళల టీం

### రెండోసారి దక్కిన టైటిల్.. ఫైనల్‌కు పురుషుల జట్టు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ మహిళా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే భారత్ పురుషుల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారత్ మహిళల జట్టు టైటిల్‌ను గెలుచుకోవడం వరుసగా ఇది రెండోసారి. ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో సహా మొత్తం ఆరు పతకాలను సాధించింది. ఇక హెవీవెయిట్ రెజ్లర్ లాకీ 110 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో భారత్ పురుషుల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లి, వ్యక్తిగత ప్రపంచ టైటిల్ కోసం పోటీలో నిలిచింది. 43 కిలోల విభాగంలో రచన స్వర్ణంతో ప్రచారాన్ని ప్రారంభించడంతో భారత మహిళల పతకాల జోరు ప్రారంభమైంది. ఆమె ఫైనల్‌లో చైనాకు చెందిన జిన్ హువాంగ్‌ను ఓడించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే, అశ్విని విష్ణోయ్ 65 కిలోల బరువు విభాగంలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముఖయ్యో ర ఖిమ్జొనోవాపై నిర్ణయాత్మక విజయంతో రెండవ బంగారు పతకాన్ని జోడించింది.



57 కిలోల ఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన మధ్గియా ఉస్మానోవా చేతిలో ఒక పాయింట్ తేడాతో ఓడిపోయిన తర్వాత రజతం సాధించిన మోనితో భారతదేశం బలమైన ప్రదర్శన కొనసాగింది. 73 కిలోల విభాగంలో, చైనాకు చెందిన వెంజిన్ క్యూ చేతిలో ఓటమితో ముగిసిన పట్టుదల ప్రచారం తర్వాత కాజల్ కూడా రజతంతో సంతృప్తి చెందింది. కోమల్ వర్మ 49 కిలోల విభాగంలో కాంస్య పతకంతో తన ప్రదర్శనను ముగించింది, తన పతక పోరులో అన్వెలినా బుర్కినాను ఓడించి భారతదేశం యొక్క ఐదవ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆ ఊపు ఇప్పటి వరకు కొనసాగింది. భారత్‌కే చెందిన యషిత 61 కిలోల విభాగంలో ఫైనల్‌కు చేరుకుంది. సాంకేతిక ఆధిపత్యం ద్వారా ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ అమెరికాకు చెందిన తైనా ఫెర్నాండెజ్ చేతిలో ఓడిపోయింది. కానీ ప్రశంసనీయమైన రజతం సాధించింది. 69 కిలోల కాంస్య పతక పోటీలో, మనీషా ఉక్రెయిన్‌కు చెందిన సోలోమియా పెట్రివ్‌ను ఓడించలేక పోయింది.

## మకావు ఓపెన్‌లో భారత్‌కు డబుల్‌హార్ట్ బ్రేక్

### తరుణ్, లక్ష్యసేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** 2025మకావు ఓపెన్ సూపర్ 300లో భారత బ్యాడ్మింటన్‌కు ఇది నిరాశపరిచే రోజు. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ ఆటగాళ్లు మానేపల్లి తరుణ్, లక్ష్య సేన్ ఇద్దరూ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఓటమిపాలై మకావులో టైటిల్ ఆశలకు ముగింపు పలికారు. అంతకుముందు రోజు, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 47వస్థానంలోఉన్న తరుణ్ గంటా 21 నిమిషాల పాటు సాగిన మూడు గేమ్‌ల ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో మలేషియాకు చెందిన జస్టిన్ హోహ్ చేతిలో ఓడిపోయాడు. మొదటి గేమ్‌ను చేజిక్కించుకున్నప్పటికీ, నిర్ణయాత్మక మ్యాచ్‌లో వరుస తప్పిదాల నుండి కోలుకోలేక తరుణ్ చివరికి 21-19, 16-21, 16-21 తేడాతో ఓడిపోయాడు. 23 ఏళ్ల భారతఆటగాడు పటిష్టంగా ఆట ప్రారంభించి తొలి గేమ్‌లో 11-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. హోహ్18 పాయింట్లతో తిరిగి సమంచేసినప్పటికీ, తరుణ్‌మంచి ప్రదర్శనతో మొదటి గేమ్‌ను స్పష్టమైన స్ట్రెయిట్ రిటర్న్‌తో ముగించాడు. కానీ మలేషియా ఆటగాడు రెండవ గేమ్‌లో పరిస్థితిని మార్చాడు, తరుణ్ తప్పుగా అంచనా వేసిన షాట్లు, అనవసరమైన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మ్యాచ్‌లో, తరుణ్ మళ్ళీ ప్రారంభంలోనే ముందంజలో ఉన్నాడు కానీ ప్రత్యర్థి ఒత్తిడి తట్టుకోలేకపోయాడు. హోహ్ ఆట మధ్యలో విరామం తర్వాత ముందుకు దూసుకెళ్లి, తెలివైన డ్రాప్ షాట్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఇక టోర్నమెంట్‌లో భారత్ యొక్క అగ్ర ఆశ అయిన లక్ష్య సేన్, ఇండోనేషియాకు చెందిన రైజింగ్ స్టార్ అల్వి ఫర్హాన్ చేతిలో 45 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో 16-21, 9-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయాడు. ఆరంభం నుంచే ఫర్హాన్ ఆధిపత్యం చెలాయించాడు. మొదటి గేమ్ తర్వాత, ఇండోనేషియా ఆటగాడు రెండవ గేమ్‌తో ఓడిపోయినా, భారత ఆటగాడు లక్ష్యసేన్‌కు ఊపును పెంచుకునే అవకాశం ఇవ్వకపోవడంతో చివరకు ఓటమి తప్పలేదు. ఈ విధంగా తరుణ్, లక్ష్య ఇద్దరూ ఓటమి పాలవడంతో, మకావు ఓపెన్ 2025లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ ప్రచారం సెమీఫైనల్ దశలో ముగిసింది.



## స్టార్ కంటెండర్ ఫైనల్స్‌కు

# మనుష్-దియా

### మహిళల డబుల్స్ మనికా- స్వస్తిక ఓటమి

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటి స్టార్ కంటెండర్ ఫోజ్ దో ఇగువాకు 2025లో భారతదేశం టేబుల్ టెన్నిస్ చరిత్ర సృష్టించింది. భారతీయ డబుల్స్ జోడీ ఫైనల్స్‌కు చేరుకోవడం ఒక మైలురాయిగా నిలిచింది. బ్రెజిల్‌లో శనివారం జరిగిన ఈవెంట్‌లో భారత ఆటగాళ్ళు మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్ రెండింటిలోనూ ఫైనల్స్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నంబర్ 10, డ్రాలో మొదటి సీడ్‌గా నిలిచిన మనుష్ షా-దియా చిటాలే మంచి సమన్వయాన్ని ప్రదర్శించారు. వారు సెమీఫైనల్లో చిలీకి చెందిన నాల్గవ సీడ్‌జంట నికోలస్‌బుర్గోస్-పౌలినా వేగాను 3-0 తేడాతో ఓడించారు (11-7, 11-2, 11-7). అంతకుముందు, వారు ప్రారంభ రౌండ్‌లో బై పొందారు. క్వార్టర్ ఫైనల్స్‌లో చిలీకి చెందిన గుస్తావో గోమెజ-డానియేలా ఒర్టెగాలను ఓడించారు. ఇక పురుషుల డబుల్స్‌లో, టాప్ సీడ్ భారత జంట మానవ్ ఠక్కర్-మనుష్ షా (ప్రపంచ 10వ ర్యాంక్) ఫైనల్‌కు చేరుకున్నారు. 16వ రౌండ్‌లో జపాన్‌కు చెందిన క్వాలిఫయర్లు సతోషి ఐడా-మిజుకి ఓయికావాపై 3-1 తేడాతో విజయం సాధించి, ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లోరియన్ బౌర్రస్సాడ్-లిలియన్ బార్డెట్‌పై 3-2 తేడాతో విజయం సాధించారు. సెమీఫైనల్లో, వారు చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ యాన్‌చెంగ్-కువో గువాన్‌హాంగ్‌లను ఐదు గేమ్‌ల హోరాహోరీ పోరులో (5-11, 11-9, 11-6, 8-11, 11-5) ఓడించారు. కాగా మహిళల డబుల్స్‌లో మానికా బాత్రా-స్వస్తిక ఘోష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు కానీ దక్షిణ కొరియాకు చెందిన జూ చియోన్‌హుయ్-లీ యున్‌హ్యే చేతిలో ఓడిపోయారు. కాగా ఈ స్టార్ కంటెండర్ టోర్నీలో భారత్ సింగిల్స్ ప్రచారం ఇంకా కొనసాగుతోంది. మహిళల సింగిల్స్‌లో మానికా బాత్రా 16వ రౌండ్‌కు చేరుకోగా, పురుషుల సింగిల్స్ డ్రాలో హర్మీత్ దేశాయ్, మనుష్ షా కూడా 16వ రౌండ్‌లోకి ప్రవేశించారు.

## వరల్డ్ ఛాంపియన్‌షిప్: భారత్ టెన్నిస్ జట్లకు అర్హత

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026లో భారత టేబుల్ టెన్నిస్ జట్లుకు చోటు లభించింది. నేపాల్‌లోని ఖాట్మండులో శనివారం జరిగిన 2025 దక్షిణాసియా ప్రాంతీయ ఛాంపియన్‌షిప్‌లలో ఆధిపత్య ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత భారత పురుషులు, మహిళల టేబుల్ టెన్నిస్ జట్లు లండన్‌లో జరిగే 2026 ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లకు (డబ్ల్యూటిటిసి) అర్హత సాధించాయి. ఐదు దేశాల రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీ పడిన రెండు భారత జట్లు అజేయంగా నిలిచాయి. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ మరియు మాల్దీవులపై 3-0 తేడాతో ఒకేలాంటి విజయాలను నమోదు చేసి, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచాయి. డబ్ల్యూటిటిసి కోసం ఏకైక దక్షిణాసియా కోటాను కైవసం చేసుకున్నాయి. ఆకాష్‌పాల్, రోనిత్ భంజా, అనిర్బన్ ఘోష్, అభినంద్ ప్రధివాధి, మరియు దివ్యాన్ష్ శ్రీవాస్తవలతో కూడిన భారత పురుషుల జట్టు గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా వదులుకోకుండా 4 టైలలోనూ ఆధిపత్యం చెలాయించింది.



ప్రతి మ్యాచ్ 3-0 స్కోరుతో ముగిసింది, ఇది జట్టు యొక్క సాంకేతిక పదును మరియు వ్యూహాత్మక నియంత్రణను ప్రతిబింబిస్తుంది. అలాగే మహిళల జట్టు ఆధిపత్యాన్ని ప్రతిబింబించింది. కృత్వికా సిన్హా, సెలీనా సెల్వకుమార్, తనీషా కోటేచా, సయాలి వాని మరియు సిండ్రెలా దాస్ లతో కూడిన భారత్ మహిళల జట్టు కూడా అదే ప్రత్యర్థులపై 3-0 తేడాతో క్లీన్ విజయాలు సాధించారు. ఆ జట్టు మ్యాచ్‌లలో స్థిరమైన ఫామ్ మరియు అనుకూలతను ప్రదర్శించింది.


## ట్రంప్‌ను నమ్మొద్దు.. భారత్ ఆర్థిక వ్యవస్థ ఓకే: ఎఐ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భారత్‌ది డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలను ఆయన సొంత దేశంలోనే అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ (ఎఐ) ప్లాట్‌ఫామ్‌లు ఖండించాయి. భారత ఆర్థిక వ్యవస్థ నిర్జీవంగా లేదని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా ఉందని స్పష్టం చేశాయి. భారత దిగుమతులపై 25 శాతం భారీ సుంకం (టారిఫ్) విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన ఐదు ప్రముఖ ఏఐ ప్లాట్‌ఫామ్‌లైన చాట్‌జీపీటీ, గ్రోక్, జెమిని, మెటా ఎఐ, కోపైలట్‌లను భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ప్రశ్నించింది. దీనికి అవన్నీ ఏకగ్రీవంగా లేదు అనే సమాధానం ఇచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ చచ్చి పోలేదు, చాలా చురుగ్గా, ప్రతిష్ఠాత్మకంగా ఉంది అని చాట్‌జీపీటీ చెప్పగా, అసలు ఆ మాటే నిజం కాదు, దానికి పూర్తి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి అని కోపైలట్ తేల్చి చెప్పింది. భారత ఆర్థిక వ్యవస్థ పతనం కాలేదు. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉంది అని గ్రోక్ తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధితో దూసుకెళ్తోంది అని జెమిని అంది. అలాగే మెటా ఏఐ కూడా భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ఇది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని చెప్పింది. ఇలా అమెరికన్ ఎఐ ప్లాట్‌ఫామ్‌లన్నీ కూడా ఒకే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ మాటలు అబద్ధమని తేల్చేశాయి.



## టెస్లాకు రూ.2,100 కోట్ల ఫైన్

**వాషింగ్టన్, ఆగస్టు 2:** అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లాకు భారీ జరిమానా పడింది. 2019 నాటి రోడ్డు ప్రమాదం కేసులో టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధరించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో దాదాపు రూ.2,100కోట్లు) చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడ్డారు. 2019లో ఫ్లోరిడాలోని కీ లార్గోలో ఈ ఘటన చోటు చేసుకుంది. జార్జ్ మెక్‌గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళ్తూ అధునాతన ఆటోపైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యలో తన మొబైల్ ఫోన్ కారులో కింద పడిపోయింది. ఎలాగూ కారు ఆటోపైలట్ మోడ్‌లోనే ఉందని భావించిన జార్జ్.. కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో కారు అదుపుతప్పి పక్కనే పార్క్ చేసి ఉన్న ఓ కారును ఢీకొట్టి ఇద్దరు వ్యక్తుల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద తీవ్రతకు యువతి మృతదేహం 75 అడుగుల దూరంలో ఎగిరిపడింది. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుదీర్ఘవిచారణ తర్వాత తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ ప్రమాదానికి గానూ బాధితుల కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి ఓ కారణమేనని గుర్తించిన కోర్టు.. ఇందుకు గానూ పరిహారంలో మూడోవంతు అంటే దాదాపు 242 మిలియన్ డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. మిగతా మొత్తం సదరు వాహనడ్రైవర్ ఇవ్వాలని స్పష్టం చేసింది. అయితే, ఈతీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.



## స్వదేశీ జెట్ ఇంజిన్ల తయారీపై జొమాటో ఆసక్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వ్యవస్థాపకుడు, సిఇఒ దీపిందర్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మద్దతిస్తున్న ఏవియేషన్ స్టార్టప్ ఎల్ఎటి ఏరోస్పేస్ భారత్‌లో సొంత గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతోందని చెప్పారు. బెంగళూరులో ఒక ప్రొపల్షన్ రీసెర్చ్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో టర్బైన్లు, రోటర్లు, కంట్రోల్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేయడంలో అనుభవం ఉన్న వారికోసం అన్వేషిస్తున్నట్లు దీపిందర్ గోయల్ తన లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మేడ్-ఇన్-ఇండియా గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ను నిర్మించాలని కంపెనీ లక్ష్యంగా ఉంది. మన ఏరో స్పేస్ రంగంలో కీలక మార్పులకు తాను సిద్ధంగా ఉన్నట్లు దీపిందర్ గోయల్ అన్నారు. స్వదేశీ గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ల తయారీలో భారతీయ ఇంజినీర్లకు పూర్తిగా స్వేచ్ఛ ఇస్తామని, ఒకవేళ విఫలమైనప్పటికీ, వారికి తిరిగి అవకాశాలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇంజినీర్లకు తగిన ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని గోయల్ వెల్లడించారు. గతంలో భారత్ స్వదేశీ గ్యాస్ టర్బైన్ ఇంజిన్ నిర్మించేందుకు ప్రయత్నించిందని, అయితే ఎల్ఎటి మళ్లీ దానికోసం ముందుకొచ్చింది. ఎల్ఎటి ఏరోస్పేస్ పరిశోధనా కేంద్రం దహన, టర్బోమెషినరీ, థర్మల్ సిస్టమ్‌లు, మెటీరియల్స్‌తో కూడిన ప్రయోగశాలలతో ఏర్పాటైంది. ఇక్కడ ఇంజినీర్లు అవసరమైన ఆవిష్కరణలకు వీలు కల్పిస్తుందని దీపిందర్ గోయల్ వివరించారు. కంపెనీ చేపట్టే పరిశోధనలకు ఏ వ్యాపార సంబంధిత వ్యక్తులూ నాయకత్వం వహించరని, ఇంజినీర్ల చేతుల్లోనే వీటి నిర్వహణ ఉంటుందని గోయల్ స్పష్టం చేశారు. కాగా, ఇది వరకు 1986లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రారంభించిన కావేరీ ఇంజిన్ ప్రోగ్రామ్, భారత లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్ కోసం స్వదేశీ జెట్ ఇంజిన్‌ను అభివృద్ధికి పనిచేసింది. సాంకేతిక సవాళ్లు, ఆలస్యం వల్ల ఇది పూర్తవలేదు.




## మెటా తీరుతో ఇతర కంపెనీలు నాశనం

**వాషింగ్టన్, ఆగస్టు 2:** కృత్రిమ మేధ (ఎఐ) విభాగంలో కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రపంచవ్యాప్తంగా టాలెంట్ హంటింగ్ అనూహ్య స్థాయికి చేరుకుంది. ఓపెన్‌ఎఐ అగ్ర నిపుణులను ఆకర్షించడానికి మెటా 100 మిలియన్ డాలర్ల అంటే సుమారు రూ.870 కోట్లు బోనస్‌ను సైతం ఆఫర్ చేస్తున్న తరుణంలో ఆంత్రోపిక్ సిఇఒ డారియో అమోడీ తన ఉద్యోగులకు పంపిన అంతర్గత ఇ-మెయిల్ వైరల్‌గా మారింది. మెటా వంటి పోటీదారుల నుంచి వచ్చే వేతన ఆఫర్లు కంపెనీల సంస్కృతిని నాశనం చేస్తాయని అంతర్గత ఇ-మెయిల్‌లో అమోడీ తెలిపారు. ఇతర కంపెనీలు ఆఫర్ చేసే ఆర్థిక ప్రోత్సాహకాల కంటే ఆంత్రోపిక్ తన మిషన్ పట్ల నిబద్ధతగా వ్యవహరించాలని ఆయన ఉద్యోగులను కోరారు. మెటా అసాధ్యాన్ని సాధ్యం చేయాలనే తప్పుడు ఆలోచనతో ఉందన్నారు. మెటా తీరు ఇతర కంపెనీల సంస్కృతిని నాశనం చేసేలా ఉందని అంతర్గత ఇ-మెయిల్‌లో అమోడీ తెలిపారు. ఆంత్రోపిక్ ఉద్యోగులకు వేతన ఆఫర్ల కంటే కంపెనీ మిషన్ ప్రధానమని చెప్పారు. మెటా ఆఫర్ చేస్తున్న ప్యాకేజీల కారణంగా సంస్థాగత సమగ్రతను కాపాడుకుంటూ కీలక ప్రతిభావంతులను నిలుపుకోవడంపై పరిశ్రమలో ఇతర కంపెనీలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఎజిఐ)ను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ (ఎంఎస్ఎల్) అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ ఇప్పటికే రీసెర్చ్‌ను అభివృద్ధి చేస్తాయని చెప్పారు. ఎంఎస్ఎల్ కింద కొత్త ల్యాబ్ తదుపరి తరం లార్జ్ ల్యాంగ్వేజ్ మోడళ్ల నిర్మాణంపై దృష్టిపెడుతుందని తెలిపారు.



# వాణిజ్యం

## రష్యా నుంచి భారత్‌కు చమురు కొనుగోళ్లకు నో బ్రేక్!

**ముంబై, ఆగస్టు 2:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో రష్యా నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేయడం లేదంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం లేదని తెలిసిందని, ఇది మంచి నిర్ణయమని అన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఆ వార్తలను తోసిపుచ్చాయి. భారత చమురు శుద్ధి సంస్థలు రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ఇంధన దిగుమతులు మార్కెట్ డైనమిక్స్, జాతీయ ప్రయోజనాల దృష్టా జరుగుతున్నాయని పునరుద్ఘాటించాయి. భారత చమురు సంస్థలు రష్యన్ దిగుమతులను నిలిపివేసినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశాయి. కాగా, ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద మొత్తంలో చౌక ధరకు చమురు కొనుగోలు చేస్తోంది. దీనిపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. మాస్కోతో వ్యాపారం చేస్తోందన్న కారణం చూపుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. భారత్‌పై పెనాల్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను దేశీయ సంస్థలు నిలిపివేశాయంటూ వార్తలు వస్తున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి భారత్‌కు చెందిన ప్రభుత్వ చమురు శుద్ధి సంస్థలు గత వారం రోజులుగా మాస్కో నుంచి చమురు దిగుమతులను నిలిపి వేసినట్లు ప్రచారం జరుగుతోంది.



## మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తి దేశంగా భారత్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భారతదేశం జపాన్‌ను అధిగమించింది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తిదారుగా అవతరించింది భారత్. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుంచి డేటాను కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రస్తావించాడు. భారతదేశం ఇప్పటి వరకు 1,08,494 గిగావాట్ గంటల (జిడబ్ల్యుహెచ్) సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 జిడబ్ల్యుహెచ్ సౌరశక్తినిమాత్రమే ఉత్పత్తి చేసిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచ క్లీన్ ఎనర్జీ విప్లవానికి నాయకత్వం వహిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి భారత్ బహుముఖ విధానంతో పనిచేస్తున్నందున ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ దిశ లో భారతదేశం సాధించిన పురోగతి ఇంధన భద్రతను పెంచడమే కాకుండా ప్రపంచ వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఒక బలమైన అడుగుగా కూడా నిరూపితమైందన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ 2024 డేటా ప్రకారం, సౌర పివి సామర్థ్య వృద్ధిలో చైనా ముందుంది. ఇది 2023లో 260 గిగావాట్లను ఉత్పత్తి చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. చైనా 14వ పునరుత్పాదక ఇంధన ప్రణాళిక 2022లో అమలు చేయడానికి ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.